# జాతీయ స్ఫూర్తి

పక్షపత్రిక

2019, సెప్టెంబరు 1-15

వెల : రూ.15/-

ఒకే రాజ్యాంగం, ఒకే పన్ను, ఒకే ఎన్నిక నిజమేనా ?

మోదీ అఖండ విజయం వెనుక....

భావ సమరం నేటి కర్తవ్యం

భారతీయ బహుళత్వ చరిత్ర : సమకాలీన ప్రాధాన్యం

యౌవనోత్సాహం

కార్ల్ మార్క్స్ జీవిత చరిత్ర

మార్క్స్ సమాధి వద్ద ఎంగెల్స్ ప్రసంగం

మార్క్స్ పుట్టిన ఊళ్లో 200వ పుట్టినరోజు

17

డి.వి.వి.యస్. వర్మ
ప్రధాన సంపాదకులు
సెల్ : 98660 74023

డా॥ బి. రమేష్‌చంద్రబాబు
సంపాదకులు
సెల్ : 93971 14495

# జాతీయ స్ఫూర్తి
పక్షపత్రిక

2019 సెప్టెంబర్ 1-15
సంపుటి : 27 సంచిక : 17
వెల : 15/- రూపాయలు

నిడదవోలు వెంకటేశ్వరరావు
సంపాదకులు

ఈ సంచికలో...

4 ఒకే రాజ్యాంగం, ఒకే పన్ను, ఒకే ఎన్నిక నిజమేనా ? - మాడభూషి శ్రీధర్
5 మోదీ అఖండ విజయం వెనుక .. - వంశీ వకుళాభరణం, శ్రీపాద్ మోతీరామ్
8 భావ సమరం నేటి కర్తవ్యం -ఎ. గాంధి
10 భారతీయ బహుళత్వం కపర్దీ స్మారకోపన్యాసం - డాక్టర్ రామ్ పునియానీ
15 యౌవనోత్సాహం - అవిజిత్ పాథక్
18 కార్ల్ మార్క్స్ జీవిత చరిత్ర - వి.ఐ. లెనిన్
24 కార్ల్ మార్క్స్ సమాధి వద్ద ఎంగెల్స్ ప్రసంగం
26 మార్క్స్ పుట్టిన ఊళ్ళో 200 వ పుట్టిన రోజు - ఎన్. వేణుగోపాల్

చందా వివరాలు

| | |
|---|---|
| విడి ప్రతి | రూ. 15-00 |
| సంవత్సర చందా : | |
| సంస్థలకు | రూ. 500-00 |
| వ్యక్తులకు | రూ. 350-00 |
| విద్యార్థులకు | రూ. 250-00 |

*చందా డి.డి. లేదా మనియార్డరు ద్వారానే పంపండి. చెక్కులు పంపరాదు*

Bank A/c No.3620 101 0000 380
Syndicate Bank, Eluru Main Branch
IFSC Code : SYNB0003620

*పంపవలసిన చిరునామా :*
డా॥ బి. రమేష్‌చంద్రబాబు
క్రాంతి నర్సింగ్ హోమ్
నన్నయ్య విగ్రహం వద్ద, మెయిన్‌రోడ్
తణుకు - 534 211
✆ 08819 222265, 93971 14495

**ఆర్థిక మాంద్యం - జి.డి.పి. ధమాల్** - పత్రికల్లో వార్త

జిడిపి తరిగినా మోదీ దేశం మెరుస్తోంది

**ఆర్థిక మాంద్యానికి మందు**

ఉద్దీపనల మందు - పారిశ్రామికులకు విందు

**వాటా వేసుకుని దోచేస్తున్నారు** - చంద్రబాబు ఫైర్

ఎంతైనా 40 ఏళ్ల స్వానుభవం ఊరికే పోతుందా ?

**ఆదాయంలోనూ జియో ఫస్టు**

వడ్డించేది మన వాడైతే కాసుల వర్షం కురవదా ?

## ఈ పక్షం చాట్ మసాలా

**కశ్మీర్‌కు భారీ ప్యాకేజీ - కేంద్రం కసరత్తు**

పారిశ్రామికులకు ప్యాకేజీ - కాశ్మీరుకు డామేజి

**నన్ను పి.సి.సి. అధ్యక్షుణ్ణి చేస్తారా... లేదా ?** - కాంగ్రెస్ యువనేత సింథియా

ఎదగడానికి ఎందుకురా అంత తొందర !

**అమిత్ భాయి నిజమైన ఉక్కు మనిషి** - ముఖేష్ అంబానీ

సంపన్నులకు ఉక్కు కవచం - సామాన్యులకు ఉక్కు బోను

**వేణుగానంతో ఆవులు బాగా పాలిస్తాయి** - అస్సాం బిజెపి నేత

పిల్లనగోవి పథకం పెట్టండి - ఒక దెబ్బకు రెండు పిట్టలు

దాణా మిగులు దాణా స్కాములు బంద్

**హనీమూన్‌కి కాశ్మీర్ వెళ్లండి** - రాంమాధవ్

నో టీవీ, నో ఫోన్ - కర్ఫ్యూలో హనీమూన్ మజా అనుభవించండి.

# భారత జాతీయ స్ఫూర్తి

సంపాదకీయం

దేశభక్తికీ, జాతీయతకీ అర్థాలు మారుతున్నాయి. సరికొత్త భాష్యాలు పుట్టుకొస్తున్నాయి. కాషాయం రంగు పులుముకుని వికృత రూపం ధరిస్తున్నాయి.

భారత జాతీయ వాదానికి బదులు హిందూ జాతీయ వాదం తెర ముందుకొచ్చింది. స్వయంగా ప్రధానమంత్రే తాను హిందూ జాతీయ వాదినని ప్రకటించడం ద్వారా ఈ దిశగా ప్రయాణం వేగాన్ని పుంజుకుంది.

భారతదేశం అంటేనే బహుళత్వం. పలు మతాలకి, భాషలకీ, కులాలకీ, ప్రాంతీయ ప్రత్యేకతలకీ నిలయం. భారత జాతీయత ఈ బహుళత్వాన్ని గుర్తించేది, ప్రతిబింబించేదిగా వుండి తీరాలి. సమాన హక్కుల ప్రాతిపదికగా పౌరులందరినీ ఐక్యపరిచేది కావాలి. మన రాజ్యాంగ నిర్మాతలు ఈ బహుళత్వాన్ని గుర్తించారు. అందుకు అనుగుణంగా పౌరుల ప్రాతిపదికగా రాజ్యాంగ రచన సాగించారు. కులమతాలకీ అతీతంగా పౌరుల హక్కులు, పౌర స్వేచ్ఛ ఆధారంగా జాతీయతకు రూపునిచ్చారు. వ్యక్తిగతంగా మత విశ్వాసాలకు పూర్తి స్వేచ్ఛనిచ్చింది.

సంఘ పరివారం వల్లించే హిందూ రాష్ట్ర వాదన మన రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నమైందే కాదు. పూర్తిగా వ్యతిరేకమైంది. భారత రాజ్యాంగానికి ఈ దేశంలోని అందరు పౌరులు ప్రాతిపదిక కాగా హిందూ రాష్ట్ర వాదానికి మతం ప్రాతిపదిక. అందరు పౌరులూ కాదు హిందూ మతావలంబులే ప్రాతిపదిక. ఇది బహుళత్వాన్ని గుర్తించేది కాదు. అందరి మీదా ఏకత్వాన్ని రుద్దేది మాత్రమే.

వీళ్ల హిందూత్వం హిందూమతం కూడా కాదు. అన్ని మతాలకు హిందూ మతం తల్లిగా వివేకానందుడు నిర్వచించారు. ఈ హిందూత్వ తల్లి ఇతర మతాల మీద విషం కక్కుతున్నది, విద్వేషం రెచ్చగొడుతున్నది. హిందూ మతం ఎవరి మీద దాడి చేసే మతం కాదన్నారు. కాని సంఘ పరివార్ హిందూత్వం నిత్యం మూకదాడులలో మునిగి తేలుతున్నది. వసుధైక కుటుంబాన్ని ప్రతిపాదించిన హిందూ మతం వీరి చేతులలో దేశ ప్రజల్ని చీల్చే సాధనం అయింది. వీళ్ల హిందూత్వం ఒక రాజకీయం ఆధిపత్య రాజకీయానికి ఓట్లు సాధించే పరిచారిక మాత్రమే.

వీళ్ల దేశభక్తి కేవలం మేడిపండు మాత్రమే. స్వాతంత్ర్యోద్యమంలో సంఘ్‌పరివార్ పాల్గొనక పోగా దాని ప్రధాన ఘట్టాలను వ్యతిరేకించారు. వలస పాలకులకు వత్తాసు దారులుగా వున్నారు. జాతిపిత మహాత్మాగాంధీని సంఘ్ పరివార్ భావజాలమే బలి తీసుకుందని సర్దార్ పటేల్ ప్రకటించారు. హంతకుడు గాడ్సేని ఈ పరివారమే దేశభక్తుణ్ణి చేసి ఆరాధిస్తున్నది.

భారత రాజ్యాంగాన్ని అతుకుల బొంతగా కొట్టి పారేస్తూ మనుధర్మశాస్త్రమే అసలైన రాజ్యాంగం అంటున్నారు. జాతీయ పతాకంలోని మూడు రంగులు దేశానికి అరిష్టమని, దానిని గౌరవించేది లేదని వీరు ప్రకటించారు.

హిందూ రాష్ట్ర వాదన హిందూ మతాన్ని భ్రష్టు పట్టిస్తుంది. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి జాతీయ ఐక్యతను భగ్నం చేస్తుంది. పౌర స్వేచ్ఛ, పౌర హక్కుల ప్రాతిపదికగా జాతీయ స్ఫూర్తినిచ్చేది భారత రాజ్యాంగమే. దాని పరిరక్షణే తక్షణ కర్తవ్యం. ❑

# ఒకే రాజ్యాంగం,
# ఒకే పన్ను
# ఒకే ఎన్నిక నిజమేనా ?



**మాడభూషి శ్రీధర్**
బెన్నెట్ యూనివర్సిటీ ప్రొఫెసర్
కేంద్ర సమాచార మాజీ కమిషనర్

ఒకే దేశం ఒకే రాజ్యాంగం, ఒకే దేశం ఒకే పన్ను, ఒకే దేశం ఒకే ఎన్నిక అని లాల్‌ఖిలా నుంచి ప్రధాని నినదించారు. ఒకే దేశం. మనది రాష్ట్రాల సమూహం, రాజ్యాల సంఘం. భిన్నత్వంలో ఏకత్వం మన లక్షణం కాని, వైవిధ్యం లేని ఏకత్వం కాదు. మనమంతా ఒకటి కాదు అంటే నమ్మడం కష్టం కానీ.. విడివిడి సంస్కృతులు, భాషలతో జీవించే విభిన్న జీవన స్రవంతులన్నీ కలిసి ఒక దేశంగా ఉన్నాయనే వైవిధ్యాన్ని అర్థం చేసుకోవడం అవసరం. మన రాజ్యాంగం ఒకటే, మన ఐపీసీ ఒకటే, మన క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ కూడా ఒకటే కానీ, రాష్ట్రాలకు సంబంధించినంత వరకు కొన్ని సవరణలు చేసుకునే అధికారాలు, చట్టాలు చేసుకునే స్వతంత్రత రాష్ట్రాలకు ఉన్నాయి. ప్రముఖ న్యాయశాస్త్రవేత్త ఉపేంద్ర బక్షీ, మనకు మూడు రాజ్యాంగాలు ఉన్నాయంటారు. ఒకటి 1950లో మనం రాసుకున్నది. మరొకటి వంద సవరణల ద్వారా మనం మార్చుకున్నది. మూడోది మన నియమాలు, సవరణల అసలు స్వరూపం ఏమిటో చెప్పే సుప్రీంకోర్టు తీర్పులలో వ్యక్తమైంది. అమెరికాలో ప్రతి రాష్ట్రానికి ఒక రాజ్యాంగం ఉంది. అయినా ఆ దేశం ఒకటి కాదనగలరా? అనేక రాజ్యాలు, చట్టాలు, సంప్రదాయాలు ఉండడం అవలక్షణం కాదు, అవసరమైన వైవిధ్య లక్షణం.

ఇక ఒక దేశం ఒక పన్ను. పన్నులు కట్టేవాడికి తెలుస్తుంది ఎన్ని రకాల పన్నులు కడుతున్నాడో. అసలు ఒకే పన్ను అనే మాట ఒక ఫన్. ఒక పరిహాసం, ఒక అవాస్తవం. జీఎస్టీలే రెండు రకాలు, ఒకటి కేంద్రానిది మరొకటి రాష్ట్రానిది. అది కూడా అన్నిటికీ ఒకే రేటు కాదు. నానా రేట్లు ఉన్నాయి. ఆదాయం పన్ను, సంపద పన్ను, శిస్తులు వంటివి జీఎస్టీ కాకుండా, ముందు నుంచే ఉన్నాయని అందరికీ తెలుసు.

మరో చోద్యం, వింత ఏమిటంటే.. ఒకే దేశం, ఒకే ఎన్నిక. జమ్మూ కశ్మీర్లో శాసనసభకు, లోక్‌సభకు ఒకేసారి ఎన్నిక జరిపించడానికి అసలు ఏ అడ్డూ లేదు. రాజకీయ ప్రయోజనాల మీద ఆశలే ఎన్నికల్ని నిర్ణయిస్తాయి. ఆ "ఒకే ఎన్నిక"ను జరపలేక చతికిలపడిన వారిదే ఈ నినాదం. కాంగ్రెస్ ప్రభుత్వాలు 356వ అధికరణాన్ని, అందులో లభించే అత్యవసర అధికారాన్ని అకారణంగా, అక్రమ కారణంగా 90 సార్లకు పైగా దుర్వినియోగం వల్ల ఒకే ఎన్నికలు జరపడం సాధ్యం కాలేదు. ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చిన తరువాత 356 అధికరణాన్ని దుర్వినియోగం చేయడంలో పద్ధతులు, ప్రయత్నాలు, వ్యూహాలు మారాయి. టోకు ఫిరాయింపులు చేయించే ధనవ్యాపార రాజకీయం విజృంభిస్తున్నది. మూడింట రెండు వంతుల మంది సభ్యులు లేకపోతే, ఎంఎల్ఎలను కొని, ఫైవ్‌స్టార్ హోటళ్లలో స్టాక్‌గా పారేస్తారు. ప్రభుత్వాలను పడగొట్టి, గద్దెనెక్కుతారు. వీలుకాకపోతే గందరగోళం సృష్టించి ఓటింగ్‌లో గెలిచి ప్రభుత్వాన్నో ప్రతిపక్షాన్నో కొని పడేస్తారు. కేంద్రంలో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ ప్రయోజనాలకు అనుగుణంగా లేకపోతే సర్కారును రద్దు చేస్తారు. అనుకూలంగా ఉంటే తమ పార్టీ తీర్థం పుచ్చుకోమంటారు.

తెలంగాణ, ఆంధ్ర మరికొన్ని రాష్ట్రాలలో జమిలి ఎన్నికలు సహజంగా జరిగేవి. తెలంగాణ ఎన్నికలను ముందుకు జరిపిందెవరు? అప్పుడు ఒకే ఎన్నిక విధానం ఏమైంది? ఆర్నెల్లలోనే రెండు ఎన్నికలకు రాష్ట్రం ఎందుకు సమాయత్తం కావలసి వచ్చింది? కాలం, చట్టం, ఆచారం అనుకూలంగా ఉన్నా ఒకే రాష్ట్రం రెండు ఎన్నికలను కనీసం రెండు రాష్ట్రాలలో అమలు చేయలేని ప్రభుత్వం దారి ఏమిటో దాని శుద్ధి బుద్ధి ఏమిటో? అత్యధిక రాష్ట్రాలలో పాలిస్తున్న బీజేపీ, వేరే పార్టీల అధీనంలో ఉన్న రాష్ట్రాలలో కేంద్రాన్ని కాదని వ్యతిరేకించే ధైర్యమున్న ముఖ్యమంత్రులు తక్కువే. మూడింట రెండు వంతుల ఆధిక్యతతో, సగానికి పైగా రాష్ట్రాల ఆమోదం పొందడం కూడా ఇప్పుడున్న పరిస్థితులతో కష్టం కాదని రుజువైంది. ఇప్పుడు అన్ని రాష్ట్రాలకు, పార్లమెంటుకు ఒకేసారి 2024 ఎన్నికలు నిర్వహించడం అసాధ్యమేం కాదు. కానీ నిర్వహిస్తారా? తమకు

☞ మిగతా 7వ పేజీలో

# మోదీ అఖండ విజయం వెనుక....

వంశీ వకుళాభరణం,
శ్రీపాద్ మోతీరామ్
మాసాచుసెట్స్ యూనివర్శిటీ

హిందూ జాతీయవాదం ప్రాతిపదికన భారత్‌ను తీర్చిదిద్దేందుకై బీజేపీకి ప్రజలు అధికారమిచ్చారా? ఇవ్వలేదనే విషయాన్ని సార్వత్రిక ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయి. అధికార పార్టీకి పోలయిన ఓట్లు 2014లో 31 శాతం నుంచి 2019లో 37 శాతానికి పెరిగాయి. ఎన్డీఏ మిత్రపక్షాలను కలుపుకున్నా మోదీ ప్రభుత్వానికి మొత్తం 45 శాతం ఓట్లు మాత్రమే దక్కాయి. అయినా ఇది మైనారిటీ ఓటు మాత్రమేనన్న వాస్తవాన్ని నొక్కి చెప్పడం చాలా ముఖ్యం. ఎందుకంటే బీజేపీ/ ఎన్డీఏ వ్యతిరేకులకు మొత్తం 55 శాతం ఓట్లు లభించాయి. పుల్వామా ఉగ్ర దాడి సంభవించి వుండకపోతే 17వ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు, బహుశా మరో విధంగా ఉండేవి.

ఇటీవలి సార్వత్రిక ఎన్నికల ఫలితాలు కలవరపెడుతున్నాయి. నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ రెండో ప్రభుత్వ హయాంలో ఆర్థిక వ్యవస్థ పురోగతి అర్థవంతంగా లేదు. లక్షలాది రైతులు దురవస్థల పాలయ్యారు. నిరుద్యోగం మరింతగా ప్రబలిపోయింది. అనియత రంగంలోని శ్రామికులకు జీవనోపాధి భద్రత మరింతగా క్షీణించింది. నరేంద్ర మోదీ ప్రభుత్వ కీలక నిర్ణయమైన పెద్ద విలువ గల కరెన్సీ నోట్ల రద్దు లక్ష్య పరిపూర్తిలో పూర్తిగా విఫలమయింది. వస్తు-సేవల పన్ను (జీఎస్టీ) అస్తవ్యస్త అమలుతో ప్రజలు వర్ణింప శక్యం కాని వెతల పాలయ్యారు. మోదీ ప్రభుత్వ ఈ రెండు ప్రధాన నిర్ణయాల వల్ల దేశ ఆర్థికవ్యవస్థ ధ్వంసమయింది. లక్షలాది ఉద్యోగాలు హరించుకుపోయాయి. వేలాది పరిశ్రమలు మూతపడ్డాయి. సామాజిక రంగంలో మైనారిటీ వర్గాలపై హింసాకాండ పెచ్చరిల్లింది. మేధో స్వేచ్ఛకు సర్వత్రా అవరోధాలే. భిన్నాభిప్రాయాలకు తావు లేకపోయింది. అయినప్పటికీ ఎన్డీఏ మళ్ళీ అధికారానికి వచ్చింది. లోక్‌సభలో బీజేపీ సీట్ల సంఖ్య 282 నుంచి 303కి పెరిగింది. ఆర్థిక, రాజకీయ సంక్షోభాలు, అధికారంలో ఉన్న ప్రభుత్వాలను బలహీనపరచడం ఒక చారిత్రక ఆనవాయితీగా ఉన్నది 1967, 1977, 1989, 1991, 1998, 2004, 2014 సార్వత్రిక ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనాలు. అయితే 2019 సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ఈ చారిత్రక ధోరణికి పూర్తి విరుద్ధంగా ఉన్నాయి.

ఈ విస్మయకర ప్రజా తీర్పుకు కారణాలేమిటి? భారతీయ సమాజంలో సంభవిస్తున్న మౌలిక మార్పులు, అధికారాన్ని కైవసం చేసుకొనేందుకు బీజేపీ అనుసరించిన వ్యూహాలు మొదలైన వివరణలను పరిశీలకులు ఇస్తున్నారు. వీటిల్లో పాక్షిక సత్యం గోచరిస్తున్నప్పటికీ మేము మరికొన్ని ఇతర ప్రశ్నలు వేయదలుచు కున్నాము. బీజేపీకి మళ్ళీ అధికారాన్ని కట్టబెట్టిన అసాధారణ ఫలితాలకు దోహదం చేసిన సందేశం ఏమిటి? ఏ మాధ్యమం ద్వారా ఆ సందేశం వ్యాప్తి చెందింది? బీజేపీకి అనుకూలంగా లభించిన ప్రజా తీర్పు పరమార్థమేమిటి? బీజేపీ/ ఎన్డీఏకు ప్రజాదరణ 2019 ఫిబ్రవరిలో నిమ్న స్థాయిలో ఉన్నదని వివిధ ఓపీనియన్ పోల్స్, ఓటర్ల సర్వేలు స్పష్టం చేశాయి. 2018లో రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలు, ఉత్తరప్రదేశ్‌లో ఉప ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనం. ఆర్థిక వ్యవస్థ పురోగతి ఆశాజనకంగా లేకపోవడం కూడా నరేంద్ర మోదీ ప్రభుత్వంపై వ్యతిరేకత ప్రబలడానికి ప్రధాన కారణంగా ఉన్నది. ఇదంతా 2019 ఫిబ్రవరి వరకు ఉన్న పరిస్థితి. అయితే ఆ నెలలో పుల్వామాలో భారత జవానులపై ఉగ్ర దాడి, అందుకు ప్రతీకారచర్యగా పాకిస్థాన్‌లోని బాలాకోట్‌లో గల ఉగ్రవాద స్థావరాలపై భారత వైమానిక దాడులు చోటు చేసుకోవడంతో మోదీ ప్రభుత్వం పట్ల వ్యతిరేకత గణనీయంగా సడలింది. ప్రజా వ్యతిరేకత గ్రహణం తొలగిపోయింది. పుల్వామా, బాలాకోట్ ఘటనలతో రాజకీయ పక్షాల మధ్య పోటీ జాతీయ స్వభావాన్ని సంతరించుకున్నది. స్థానిక, ప్రాంతీయ సమస్యల ప్రాధాన్యం వెనకపట్టు పట్టింది. అప్పటికే 2019 సార్వత్రిక పోరును పార్లమెంటరీ ఎన్నికల వలే గాక అధ్యక్ష పదవీ ఎన్నికలుగా మార్చేందుకు జరుగుతున్న ప్రయత్నాలను మరింత పటిష్ఠంగా, సమర్థంగా ముందుకు తీసుకువెళ్ళేందుకు పుల్వామా, బాలాకోట్ ఘటనలు మరింత ప్రేరణనిచ్చాయి. అధ్యక్ష ఎన్నికల తరహా పోటీలో నరేంద్రమోదీ అజేయుడుగా నిలిచే అవకాశమున్నది.

సమైక్యత కొరవడ్డ ప్రతిపక్షాలు, దేశ ప్రజలందరినీ ప్రభావితం చేయగల నాయకులు లేకపోవడం మోదీకి తప్పక

అనుకూలమవుతాయి. దీన్ని దృష్టిలో ఉంచుకునే 2019 ఫిబ్రవరి అనంతరం జాతీయ భద్రత (బాహ్య శక్తుల నుంచి జాతికి రక్షణ సమకూర్చడం) భరోసా, జాతీయ స్థాయి నాయకత్వం భౌగోళిక భారత్ (కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, గౌహతి నుంచి జైసల్మేర్ దాకా) కు జాతీయ స్థాయి నాయకత్వం ఇవ్వగలిగేది నరేంద్ర మోదీ మాత్రమే అన్న సందేశాన్ని బీజేపీ వర్గాలు విస్తృతంగా వ్యాప్తి చేశాయి. ఈ ప్రధాన సందేశానికి ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి రిజర్వేషన్లు, నేరుగా నగదు బదిలీ మొదలైన సంక్షేమ సందేశాలను కూడా జోడించారు. ఈ విస్తృత సందేశంలో జాతీయవాద, భౌగోళిక, ఆర్థిక అంశాలు ఉన్నాయి. ఓటర్లు పెద్ద సంఖ్యలో బీజేపీ వైపు మొగ్గడానికి భౌగోళిక, ఆర్థిక అంశాలు విశేషంగా తోడ్పడ్డాయి. మరి ఈ సందేశం ఏ మాధ్యమం ద్వారా వ్యాప్తి చెందింది? ఈ అంశాన్ని మనం నిశితంగా పరీక్షించవలసిన అవసరమున్నది. ఆ మాధ్యమం 'పబ్లిక్ స్పియర్' (సామాజిక జీవితంలో ఇదొక సమష్టి క్షేత్రం). సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటిపై స్వేచ్ఛగా చర్చించేందుకు సమాజ హితులైన పౌరులు కలసికట్టుగా కృషి చేసే ప్రదేశమది. 'పబ్లిక్ స్పియర్' భావనకు ఆద్యుడైన జర్మన్ చింతకుడు హాబెర్మాస్ దానిని 'విమర్శనాత్మక బహిరంగ చర్చలో పాల్గొంటున్న సమాజం'గా నిర్వచించారు. పబ్లిక్ స్పియర్‌లో సంప్రదాయ మీడియా (వార్తా పత్రికలు, టెలివిజన్ మొదలైనవి) తో పాటు అత్యాధునిక 'డిజిటల్ పబ్లిక్ స్పియర్' (ఈ–మెయిల్, మెసేజింగ్, బ్లాగ్స్, సెర్చ్ ఇంజిన్లు, ఫేస్ బుక్ ఇత్యాది సామాజిక మాధ్యమాలు) భాగంగా ఉంటాయి. పబ్లిక్ స్పియర్, ఆర్థికరంగానికి సంబంధించి మోదీ ప్రభుత్వం కొన్ని కీలక చర్యలు చేపట్టింది. తొలుత ప్రణాళికా సంఘాన్ని రద్దుచేసి , దాని స్థానంలో నీతి ఆయోగ్(నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా) నేర్పాటు చేసింది. ప్రణాళికా సంఘం నిర్ణయాలపై చెప్పుకోదగిన స్థాయిలో బహిరంగ చర్చలు జరిగేవి. ఉదాహరణకు టెండూల్కర్ కమిటీ నిర్ణయించిన 'దారిద్ర్యరేఖ'. దీనిపై బహిరంగ చర్చల ఫలితంగా ప్రభుత్వం 'దారిద్ర్యరేఖ'కు ఒక కొత్త ప్రమాణాన్ని నిర్దేశించింది. నీతి ఆయోగ్ ఒక థింక్ –ట్యాంక్ (ధీ సచివుల మండలి) లాంటిది. అయితే ఇది ప్రజలకు జవాబుదారీగా ఉండదు. సాంఖ్యక సంస్థలు (స్టాటిస్టికల్ ఆర్గనైజేషన్స్) వ్యవహారాలలో మోదీ ప్రభుత్వం జోక్యం చేసుకోవడమే కాక, దేశ ఆర్థిక కార్యకలాపాలకు సంబంధించిన భోగట్టా (డేటా)ను కప్పిపుచ్చింది. ప్రభుత్వ సమాచారం (అసమగ్రమే అయినప్పటికీ) ఆధారంగా జరిగే చర్చల స్థానంలో పుకార్లు, ఊహాగానాలు, అన్యాపదేశ వ్యాఖ్యలు, సూచనలు చోటు చేసుకోవడం ప్రారంభమయింది.

జాతీయ భద్రత, జాతీయ స్థాయి నాయకత్వం అంశాలకు విస్తృత ప్రచారం కల్పించడంలో మీడియా కీలక పాత్ర వహించింది. పుల్వామా ఉగ్ర దాడి అనంతరం పాకిస్థాన్‌పై యుద్ధానికి వెళ్ళి ప్రతీకారం తీర్చుకోవాలని కొన్ని మీడియా సంస్థలు వాదించాయి. నరేంద్రమోదీ సైతం చాల కరుకుగా మాట్లాడారు: 'యే హమారా సిద్ధాంత్ హై కీ హమ్ ఘర్మే ఘుస్ కర్ మారేంగే' (శత్రువు ఇంటిలోకి ప్రవేశించి, అతన్ని హతమార్చడం మన సిద్ధాంతం) అన్న వ్యాఖ్య మీడియా ఆమోదం పొందింది. దీంతో ప్రతిపక్షాలు ఆత్మరక్షణలో పడ్డాయి. డిజిటల్ పబ్లిక్ స్పియర్, సంప్రదాయ పబ్లిక్ స్పియర్‌కు భిన్నమైనది. దీనిపై నిఘా అంతగా లేదు. పూర్తి చట్టబద్ధత కూడా దీనికి ఇంకా సమకూరలేదు. తీవ్ర అణచివేత విధానాలను అనుసరిస్తున్న ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరచడంలో ఈ డిజిటల్ పబ్లిక్ స్పియర్ కీలక పాత్ర వహిస్తోంది. అయితే ఇది పాలక వర్గాలకు సైతం విశేషంగా తోడ్పడుతుంది. నకిలీ వార్తలు తప్పుడు సమాచారం, పుకార్లను వ్యాపింపచేయడానికి ఈ అత్యాధునిక మాధ్యమం బాగా ఉపయోగపడుతోంది. ఫేస్‌బుక్, వాట్సాప్‌కు భారత్ ఒక అతి పెద్ద మార్కెట్‌గా ఉన్నది. ఈ నవీన మాధ్యమాన్ని 25 కోట్ల మంది భారతీయులు వినియోగించుకుంటున్నారు. తప్పుడు వార్తలను వ్యాప్తి చేసేందుకు వాట్సాప్ ఎందుకు అత్యంత ఉపయోగకారిగా ఉన్నది? సందేశం ఎక్కడ నుంచి వచ్చిందీ తెలుసుకోవడం అసాధ్యంగా ఉండడం, గ్రూపులను సృష్టించడంలో సౌలభ్యత అందుకు కారణాలుగా చెప్పవచ్చు. ప్రతి రాజకీయ పార్టీ తన ప్రయోజనాలకు వాట్సాప్‌ను విస్తృతంగా వినియోగించుకుంటుంది. అయితే బీజేపీ, ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాలలో వాణిజ్య ప్రకటనలపై ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్ కంటే ఆరు రెట్లు అధికంగా ఖర్చుచేస్తున్నది. బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న కథనాల కంటే అనుకూలంగా ఉన్న కథనాలే నకిలీ వార్తలను ఎక్కువగా వ్యాప్తి చేస్తున్నాయని బీబీసీ పేర్కొంది. ఆ మాటకొస్తే ప్రధానమంత్రి నమో యాప్ సైతం తప్పుడు సమాచారానికి ఒక ప్రధాన ఆధారంగా ఉన్నది. 'పబ్లిక్ స్పియర్', మోదీ నేతృత్వంలోని బీజేపీ మాత్రమే భారతదేశపు జాతీయ భద్రతకు

హామీ ఇవ్వగలదని, దేశానికి మరింత మెరుగైన పాలనను అందించగలదన్న సందేశానికి ఒక అద్భుత వాహిక అయింది. తత్ఫలితంగా ఆర్థిక వ్యవస్థ తిరోగమనంతో అంతకంతకూ పెరిగిపోతోన్న ప్రభుత్వ వ్యతిరేకతకు అడ్డుకట్ట వేయడం సాధ్యమయింది. ఈ సందేశమూ, సంక్షేమ పథకాలను మరింత మెరుగ్గా అమలుపరుస్తామన్న హామీ బీజేపీకి నిర్ణయాత్మకమైన విజయాన్ని సమకూర్చాయి.

హిందూ జాతీయవాదం ప్రాతిపదికన భారత్‌ను తీర్చిదిద్దేందుకై బీజేపీకి ప్రజలు అధికారమిచ్చారా? ఇవ్వలేదనే విషయాన్ని సార్వత్రిక ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయి. అధికార పార్టీకి పోలయిన ఓట్లు 2014లో 31 శాతం నుంచి 2019లో 37 శాతానికి పెరిగాయి. ఎన్డీఏ మిత్రపక్షాలను కలుపుకున్నా మోదీ ప్రభుత్వానికి మొత్తం 45 శాతం ఓట్లు మాత్రమే దక్కాయి. అయినా ఇది మైనారిటీ ఓటు మాత్రమేనన్న వాస్తవాన్ని నొక్కి చెప్పడం చాలా ముఖ్యం. ఎందుకంటే బీజేపీ/ ఎన్డీఏ వ్యతిరేకులకు మొత్తం 55 శాతం ఓట్లు లభించాయి. పుల్వామా ఉగ్రదాడి సంభవించి వుండకపోతే 17వ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు, బహుశా, మరో విధంగా ఉండేవి. సార్వత్రిక ఎన్నికలలో బీజేపీకి లభించిన ప్రజల మద్దతు పరిమితమైనది. అలాగే ఓట్ల వాటా కూడా తక్కువే. అయినప్పటికీ హిందువులకే అధిక ప్రాధాన్యమిచ్చి, హిందూ జాతీయవాదం ప్రాతిపదికన భారత్‌ను పునర్నిర్మించాలనే డిమాండ్లు ముమ్మరమయ్యే అవకాశమున్నది. అంతర్గత అసమ్మతిని 'జాతి వ్యతిరేకత' పేరుతో అణచివేసే ప్రయత్నాలు జరిగే అవకాశమూ ఎంతైనా ఉన్నది. అయితే ఇటువంటి చర్యలు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమైనవి. సార్వత్రిక ఎన్నికల ప్రజా తీర్పు వాటికి ఏ విధంగానూ మద్దతునివ్వడం లేదు. ప్రజాస్వామ్య వ్యవస్థలు ఎన్ని అవరోధాలు ఎదురైనా, వైఫల్యాలు సంభవించినా సదా మరింత సమ్మిళిత, సహనశీల, సమానత్వ సమాజ దిశగా పురోగమిస్తుంటాయి. ఈ సత్యాన్ని మనం విస్మరించకూడదు. ఎన్నికలలో మద్దతు ఇవ్వడం ద్వారా వివిధ పాలనా వ్యవహారాలలో నిర్దిష్ట విధానాలకు తాము తెలిపిన ఆమోదాన్ని రాజకీయ పార్టీలు, రాజకీయ నాయకులు దుర్వినియోగం చేయడాన్ని భారత్‌తో సహా ప్రపంచ వ్యాప్తంగా ఏ దేశ ఓటర్లూ తేలికగా తీసుకోరని చరిత్ర ఘోషిస్తోంది. 2019 ఎన్నికలలో సమ్మిళిత భారత్‌కు ఓటు వేసిన ఓటర్లకు ఆ చారిత్రక భరోసా ఒక ఆశాభావాన్నిస్తున్నది. అంతేకాదు భారత గణతంత్ర రాజ్య వ్యవస్థాపకుల సమున్నత ఆశయాల, మహోన్నత వారసత్వ పరిరక్షణకు చేస్తున్న పోరాటాన్ని మొక్కవోని దీక్షతో కొనసాగించేందుకు వారికి ఎనలేని స్ఫూర్తిని, ధైర్యాన్ని ఇస్తుందనడంలో సందేహం లేదు.

– ఆంధ్రజ్యోతి సౌజన్యంతో... ❏


## ఒకే రాజ్యాంగం, ఒకే పన్ను, ఒకే ఎన్నిక నిజమేనా ?

(4వ పేజీ తరువాయి)

గెలిచే అవకాశం ఉందనుకుంటేనే జరుగుతాయా? రాష్ట్రంలో లోక్‌సభకు, శాసనసభకు ఒకే ఎన్నిక జరిపించడానికి అడ్డొచ్చిన అవసరాలే జమిలి ఎన్నికలకూ ఏర్పడతాయి. నినాదాలు చేయడం వేరు, విధానాలు రచించడం వేరు. విధానాలను సక్రమంగా రచించడం కోసమే సంవిధానం ఉంది. సంవిధానాన్ని కాదనుకుంటే, లేదనుకుంటే, ఉన్నా అది వేరు పాలన వేరు అనుకుంటే వారికి ఏదీ చెప్పడం సాధ్యం కాదు. స్వేచ్ఛగా వ్యవహరించి, శాస్త్రీయంగా ఆలోచించి, సహేతుకంగా అభిప్రాయాన్ని ఏర్పరచుకుని, ధైర్యంగా చెప్పగలవాళ్లుంటేనే ప్రజాస్వామ్యం ఉంటుంది.

మూఢంగా నమ్మడం మతంలో కుదురుతుందేమో కానీ సమాజంలో, రాజకీయంలో సాగించకూడదు. అభివృద్ధిని అవసరమైన వస్తువులాగా చూపి, టెర్రరిజం ప్రమాదాన్ని భయానక వాతావరణం కల్పించడానికి అనువుగా వాడుకుని, స్వతంత్రతను, స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని, అధికార వికేంద్రీకరణను దెబ్బతీస్తూ ఉంటే మౌనంగా ఉండడం నేరమవుతుంది. మోదీ వల్ల ప్రజాస్వామ్యానికి వచ్చే ప్రమాదం కన్నా గుడ్డిగా ఆమోదించేవారి వల్ల ప్రమాదం ఎక్కువ. అయితే ఎవరేమన్నా, అనుకున్నా, తిట్టినా లైక్ చేయకపోయినా, నిజానిజాలను హేతుబద్ధంగా విశ్లేషించడం రాజ్యాంగ విధి, చట్టపరమైన బాధ్యత, నైతిక బాధ్యత, దేశ భక్తుల బాధ్యత. భయపడకండి, ధైర్యంగా విమర్శించండి, ఆ విమర్శల జడివానలకు బ్రిటిష్ పాలకులే పారిపోయారు. విమర్శాస్త్రం ముందు స్వార్థపర అవకాశ వాద రాజకీయులేం నిలబడతారు? స్వాతంత్ర్య దినోత్సవంలో దినం కాదు ప్రధానం, ఉత్సవం అంతకన్నా ప్రధానం కాదు. స్వతంత్రం ప్రధానం. దినాలు, ఉత్సవాలు మనకు స్వాతంత్ర్యాన్ని గుర్తు చేయాలి. ❏

# భావ సమరం నేటి కర్తవ్యం



ఎ. గాంధి
సంపాదకుడు, పీకాక్ క్లాసిక్స్

బిజెపి దేశాన్ని రక్షించగల ఏకైక పార్టీ అని కోట్లమంది నమ్ముతున్నారు. ప్రతిపక్ష పార్టీలు ప్రజల నమ్మకాన్ని పోగొట్టుకున్నాయి. అది స్వయంకృతం. కోట్ల మంది హిందూత్వని ఆదర్శంగా స్వీకరించారు. ఇంతకు ముందు ప్రజల ఆమోదం పొందిన మానవోచితమయిన ఆదర్శాలెన్నో ఎందుకు వెనక్కి మళ్లాయి? ఇప్పుడు తక్షణ లక్ష్యమూ దీర్ఘకాలిక లక్ష్యమూ ఒకటే. హిందూత్వకి వ్యతిరేకంగా భావ సమరం జరగాలి.

ప్రజలు కుల పరిమితుల్ని దాటి ఎదిగారని బిజెపి నాయకుడు సుబ్రమణ్య స్వామి వ్యాఖ్యానించారు. 2019 సార్వత్రిక ఎన్నికల ఫలితాలు తెలిసిన రోజునే ఆయన ఈ మాటన్నారు. బిజెపి ఘన విజయానికి కారణం మోదీ కాదని, అందుకు హిందూత్వే కారణమని అన్నారు. మోదీ పాలనలో ఆర్థిక రంగం బాగా లేకపోయినప్పటికీ జనం దాన్ని క్షమించడానికి కూడా అదే కారణమన్నారు.

2014 ఎన్నికల్లో బిజెపి విజయాన్ని 2019 విజయంతో పోల్చి చూస్తే సుబ్రమణ్యస్వామి చెప్పింది నిజమే అనిపిస్తుంది. నిజానికి ఏ విజయానికైనా ఒక్క కారణమే ఉండదు. మనం మాట్లాడుకొనేది ప్రధాన కారణాల గురించే. 2014 లో బిజెపి విజయానికి ప్రధాన కారణం కాంగ్రెసు నిర్వాకం. ఆ ప్రభుత్వం కొన్ని మంచి పనులు చేయలేదని కాదు. కాని స్థూలంగా చెప్పాలంటే అది అధ్వాన్నపు పాలననే అందించింది. దానికి తోడు అంతులేనన్ని అవినీతి కుంభకోణాలు వెలుగు చూశాయి. వాటితో జనం విసిగిపోయారు. అవినీతికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు నడిచాయి. సరిగ్గా ఆ సమయానికి ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సిద్ధంగా ఉంది. దాన్ని గెలిపించారు. దేశంలో అంతకంటే సిద్ధంగా బిజెపి ఉంది. దానికీ పట్టం కట్టారు. ఆవేళ హిందూత్వ లేదని కాదు. హిందూత్వ పునాదికి కాంగ్రెసు వ్యతిరేకత తోడై అది బిజెపిని గెలిపించింది.

అయితే గత ఐదేళ్లలో బిజెపి సాధించింది ఏమీ లేదు. ఆర్థికరంగంలో గాని సామాజిక రంగంలో గాని నైతిక రంగంలో గాని వారికి చెప్పుకోవడానికి ఏమీ లేదు. అంతకుముందు అధ్వాన్నంగా ఉన్న ఏ రంగాన్నీ వారు మెరుగుపర్చలేదు. అంతకు ముందు కాస్త మెరుగ్గా ఉన్న అంశాలను కూడా పాడుచేశారు. పైగా పెద్ద నోట్ల రద్దు లాంటి అర్థరహితమైన నిర్ణయాలతో ఉత్తపుణ్యానికి జనాన్ని ఇబ్బందుల్లోకి నెట్టారు. వ్యక్తుల వ్యక్తిగత జీవితాల్లోకి మునుపెన్నడూ లేనంతగా జొరబడ్డారు. జనం ఏం తినాలో, ఏం తాగాలో, ఏం కట్టుకోవాలో, ఎలా కట్టుకోవాలో, ఎవరితో కలవాలో, ఎవరిని ద్వేషించాలో, ఎప్పుడు నిలబడాలో, ఎప్పుడు కూర్చోవాలో వారు నిర్దేశించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించడాన్ని దేశద్రోహంగా నిర్వచించారు. ప్రజాస్వామ్యాన్ని ఏక వ్యక్తి పాలనగా దిగజార్చారు. ప్రజాస్వామ్య సంస్థలని చీపురు కట్టల కంటే చులకన చేశారు. ఒక్క మాటలో, అది ఐదేళ్ల దుష్టపాలన!

అయినా జనం బిజెపిని అందలమెక్కించారు. ఈ విడ్డూరపు ఫలితానికి కారణం హిందూత్వ కాక మరేముంటుంది? మరో పార్టీ ఏదైనా మోదీ చేసిన అఘాయిత్యాల్లో పదోవంతు చేసినా మట్టిగొట్టుకు పోయేది. ఈవీయం లను మోదీయులు తమకి అనుకూలంగా మలుచుకొన్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దాన్ని పూర్తిగా కొట్టి పారేయలేం. హిందూత్వవాదులు దేనికయినా సిద్ధమే. ధర్మ చింతన బొత్తిగా లేని ధార్మిక వేషధారులు వారు. సాంకేతికపరమైన మోసాలతో వారు గెలిచివుంటే, అది దారుణమే కాని దాని నుంచి దేశం బయటపడడం అంత కష్టం కాదు. అలాకాక, జనం బుర్రల్ని హిందూత్వ గాఢంగా పట్టుకోవడం వల్లనే బిజెపి గెలిచివుంటే మాత్రం దేశం ప్రమాదంలో పీకలదాకా కూరుకుపోయిందని అర్థం. దానినుంచి బయట పడడం అంత తేలిక కాదు. నిత్యం మనం చూసే రాజకీయులకు అది సమస్య అని కూడా తెలియదు.

హిందూత్వ అంటే హిందూ మతం అనుకొనేరు! అది హిందూ మతతత్వం హిందూ ఉన్మాదమది. అది మతాభిమానం కాదు మత దురభిమానం. దీనికి తోడు యుద్ధోన్మాదం. అంతులేని

పరమత ద్వేషం. మతతత్వం తలకెక్కిన మనిషి విచక్షణని కోల్పోతాడు. మతం పేరుతో సాగే పాలకుల దౌర్జన్యాన్నీ కుటిలనీతినీ చూడలేడు. ఈ విషయంలో ఏ మతతత్వమైనా ఒకటే. ఇండియాలో ముస్లిం మతతత్వం కంటే హిందూ మతతత్వం ప్రమాదకరమని జవహర్లాల్ నెహ్రూ అన్నారు. ఈ దేశంలో ముస్లిం మతతత్వం అధికారానికి రాలేదు కనుక అది తక్కువ ప్రమాదకరం అని ఆయన భావించాడు. కాని గుర్తించాల్సిన విషయమేమంటే హిందూ మత తత్వానికి ముస్లిం మతతత్వం ఊపిరులూదుతుంది. హిందూ మతతత్వం ముస్లిం మతతత్వాన్ని రెచ్చగొడుతుంది. ఈ దేశంలో జరిగింది అదే. సంఘ పరివారం బాబ్రీ మసీదుని కూల్చాక ఏం జరిగింది? ఈ దేశంలో ముస్లిం యువకులు ఎప్పుడూ లేనంతమంది ఉగ్రవాదం బాట పట్టారు. ఉగ్రవాదులు చేసిన ఘాతుకాలు దేశంలో తిరిగి హిందూమత తత్వాన్ని అపారంగా పెంచాయి. ఈ రెండూ పరస్పరం ప్రేరేపించుకొంటాయి. ఇదొక విషవలయం.

కులం ఊబి నుంచి జనం బయటపడ్డారని సంతోషించడానికేమీ లేదు. వారు అంతకంటే లోతయిన మతం ఊబిలో కూరుకుపోతున్నారు. భారత, పాక్ దేశాల ప్రజలు మతతత్వ ఊబిలో కూరుకుపోవడానికి తోడ్పడుతున్న మరో శక్తి పాకిస్థాన్. మోదీ నాయకత్వం మతతత్వాన్నీ యుద్ధోన్మాదాన్నీ పాకిస్థాన్పైనా పరమతాల పైనా ద్వేషాన్నీ రంగరించి జనంతో మింగించడంలో సఫలమైంది. దాన్ని మింగినవారికి మోదీ ప్రభుత్వ క్రూరత్వం ధీరత్వంలా కనిపించింది.

మోదీ ప్రగల్భాలు ఆయన ఘన విజయాలుగానూ, మోదీ అబద్ధాలు నిఖార్సయిన సత్యాలుగానూ వారు భ్రమపడ్డారు. బెంగాల్నే చూడండి... 1905లో బెంగాల్ని మతప్రాతిపదికపైన కర్జన్ దొర రెండు ముక్కలు చేసినప్పుడు బెంగాల్ అంతా ఏకమై దాన్ని వ్యతిరేకించింది, ఆనాడు వందేమాతర ఉద్యమంతో దేశమంతా అట్టుడికిపోయింది. ఇవ్వాళ అదే వందేమాతర నినాదంతో పశ్చిమ బెంగాల్లో హిందూ ముస్లిం మతాల మధ్య వైషమ్యాన్ని రెచ్చగొట్టడంలో బిజెపి సఫలమైంది. దీన్నే బిజెపివారు జాతీయవాదం అంటున్నారు. దీన్నే దేశ భక్తి అని కూడా అంటున్నారు. దానికి తలలూపే జనం అపారంగా పెరిగారు. బిజెపి దేశాన్ని రక్షించగల ఏకైక పార్టీ అని కోట్లమంది నమ్ముతున్నారు. పార్లమెంటు ఎన్నికల్లో ఏదో ఒకటి చేసి ప్రతిపక్ష పార్టీలు కలిసి బిజెపిని ఓడించాలన్న ఎత్తుగడలు ఇప్పుడు పూర్తిగా అసంగతం. ఆ పార్టీలు ప్రజల నమ్మకాన్ని పోగొట్టుకున్నాయి. అది స్వయంకృతం. కోట్లమంది హిందూత్వని ఆదర్శంగా స్వీకరించారు. అదెలా జరిగింది? ఇంతకుముందు ప్రజల ఆమోదం పొందిన మానవోచితమయిన ఆదర్శాలెన్నో ఎందుకు వెనక్కి మళ్లాయి? ఇప్పుడు తక్షణ లక్ష్యమూ దీర్ఘకాలిక లక్ష్యమూ ఒకటే. పోరాటం జరగాల్సింది భావాల రంగంలోనే. హిందూత్వకి వ్యతిరేకంగా భావ సమరం జరగాలి. అయితే మతవాదులకున్న ఒక వెసులుబాటు సమానతావాదులకూ, మానవతా వాదులకూ నిజమైన సెక్యులర్ వాదులకూ ఉండదు. వారు అబద్ధంపైనా భ్రమలపైనా ఆధారపడి తమ వాదనను వినిపించలేరు. సత్యం సాయంతోనే అసత్యంతో తలపడాలి. మానవత్వం అమానుషత్వం కంటే బలమైనదని నిరూపించాలి. మన కళ్లెదుట జరుగుతున్న వాస్తవాలనే కాదు, చారిత్రిక తాత్విక సత్యాలెన్నిటినో మతవాదులు వక్రీకరించారు. దాన్ని ఓపిగ్గా విడమర్చాలి. భావాల పోరులో ప్రజల మనసుల్ని చూరగొనాలి. వారి ఆమోదం గెలుచుకోవాలి. స్వార్థం కోసం కాదు, దేశ భవిష్యత్తు కోసం ప్రపంచ సంక్షేమం కోసం. ❑


## జాతీయ స్ఫూర్తి

### ప్రకటనల రేట్లు

**1/4 డెమ్మీ సైజు**

| | |
|---|---|
| **లోపలి పూర్తిపేజీ** | **రూ. 5,000/-** |
| **లోపలి అరపేజీ** | **రూ. 2,500/-** |
| **కవరు పేజీ :** | |
| **లోపలి కవరు పేజీలు** | **రూ. 7,500/-** |
| **వెనుక కవరు పేజీ** | **రూ. 10,000/-** |

*పంపవలసిన చిరునామా :*


**జాతీయ స్ఫూర్తి**

C/o. **క్రాంతి నర్సింగ్ హోమ్,** నన్నయ్య విగ్రహం వద్ద

మెయిన్‌రోడ్, **తణుకు - 534 211**

✆ 08819 222265, 93971 14495

# భారతీయ బహుళత్వ చరిత్ర : సమకాలీన ప్రాధాన్యం



**డాక్టర్ రామ్ పునియానీ**

భారతదేశంలో మతవాదం పెచ్చరిల్లడమనేది, మన చరిత్రను – ముఖ్యంగా, మధ్యయుగాల చరిత్రను – వక్రీకరించడంతో ప్రత్యక్షంగా ముడిపడి వుంది. ముస్లిం రాజుల దురాక్రమణ కారణంగానే హిందువులకి బానిసత్వం దాపురించిందనే దుష్ప్రచారం ముమ్మరంగా జరిగింది. ఇస్లాం మతవ్యాప్తి హింసాత్మకంగా సాగిందనేది మరో దుష్ప్రచారం. పర్యవసానంగానే, హిందూ జన సమూహానికి భయంకరమయిన కష్టనష్టాలు వచ్చి పడ్డాయన్నది మరో దుష్ప్రచారం. ఈ విధంగా, పక్షపాత బుద్ధితో చరిత్రను వక్రీకరించి, ప్రదర్శించడం ఘోరమైన నేరం. అలా చెయ్యడం మతపరమయిన అసహనాన్ని పెంచి, పోషిస్తుంది. ఈ విధమైన అసహన కథనాలూ, కల్పనలూ, కట్టుకథలూ ఇతరుల పట్ల మతపరమయిన ద్వేషానికి ప్రాతిపదికలుగా మారతాయి. అది హింసకు దారి తీస్తుంది.

చరిత్రను ఇలా మిథ్యాకల్పనగా మార్చడమనేది మతవాదుల చేతుల్లో మారణాయుధంగా పరిణమిస్తుంది. అంతే కాదు – భారత సమాజానికి సహజమయిన బహుళత్వ స్వభావాన్నీ, ఈ గడ్డ మీద పుట్టి, పెరిగిన సాంస్కృతిక సమ్మేళన సంప్రదాయాలనూ ఈ మిథ్యా కల్పన పక్కదోవ పట్టిస్తుంది కూడా. సామాన్య ప్రజల మనస్సుల్లో వాస్తవాలు మరుగున పడిపోయేలా చేస్తుందీ వక్రీకరణ. ఇంతకీ, మన చరిత్రకి సంబంధించిన వాస్తవమేమిటి? మన మధ్య యుగాల చరిత్ర అంతా ముస్లిం రాజుల దురాక్రమణ యుద్ధాలతోనూ, దేవాలయాల విధ్వంసాలతోనూ, బలవంతపు మతమార్పిడులతోనూ నిండి వుందనే ప్రచారంలో నిజమేమయినా వుందా? ఈ దశ మన సామాజిక జీవన చరిత్రలో అంధయుగంగా ఉండిందా? ఎంత మాత్రం లేదు – వాస్తవం ఈ దుష్ప్రచారానికి యోజనాల దూరంలో వుంది. ఆ దశలో వ్యక్తమయిన సామాజిక వైవిధ్యం మన జాతిని మరింత బలోపేతంగానూ, మరింత శక్తిమంతంగానూ మార్చింది. సరిహద్దులను మరింతగా విస్తరించుకోవడం కోసం, మరిన్ని విశాల భూభాగాలపై పెత్తనం సాధించడం కోసం రాజులు యుద్ధాలకు తెగబడిన మాట నిజమే. మతాధికారులూ, మతాధిపతులూ – ఉలేమాలూ, బ్రాహ్మణులూ – ఒకరి పూజా పద్ధతులను మరొకరు చిన్నచూపు చూసుకున్న మాటా నిజమే. కానీ భిన్న మతాలకు చెందిన సామాన్య ప్రజలు – మధ్యయుగాల్లో నానాబాధలూ అనుభవించిన పీడితులు, అట్టడుగు వర్గాల ప్రజలు – మాత్రం పరస్పరం సహజీవనం చెయ్యడంలోని మాధుర్యాన్ని ఘనంగా ఆస్వాదించారు. మతాల చట్రాలను అధిగమించి రాజులు సయితం పరస్పర సంబంధాలను విస్తరించుకున్నారు. భౌతిక ప్రయోజనాల కోసం తమ తమ రాజ్యాలను కాపాడుకోవడం పైనా, మరింతగా విస్తరించుకోవడం పైనా ఆయా రాజులు కేంద్రీకరించిన మాట వాస్తవమే. కానీ, సమాజంలోని అత్యధిక సంఖ్యాకులు నానా పాట్లు పడినప్పటికీ, సామాజిక – ధార్మిక జీవనాల నుంచి ఆనందాన్నీ, మాధుర్యాన్నీ పొందారు. విభిన్న వర్గాలకి చెందిన కులీనులు తమ తమ సామాజిక పెత్తనాలను స్థిరపర్చుకోవడం పైనా, పరస్పరం చిన్నబుచ్చుకోవడం పైనా ఎక్కువ ఆసక్తి చూపించిన మాట నిజమే. కానీ అదే సమయంలో సృజనాత్మక రంగాలకి చెందిన దర్బారీ కవులూ, కళాకారులూ, శిల్పులూ, వాస్తుశిల్పులూ, నటులూ, గాయకులూ, జానపద కళాకారులూ, చిత్రకారులూ ఇతర స్రవంతులకి చెందిన సంప్రదాయాలని కూడా తమ కళల్లో మేళవించి సమగ్ర కళారూపాలను ఆవిష్కరించారు. ఆ క్రమంలో మొత్తంగానే కళారంగం సుసంపన్నం కాగలిగింది.

## రాజకీయ సంబంధాలు :

మధ్యయుగాల్లో హిందువులూ ముస్లింలూ తన్నుకు చచ్చారనే దుష్ప్రచారం ఓవైపు జరుగుతుండగా, అందుకు భిన్నమయిన, విరుద్ధమయిన వాస్తవాన్ని వెల్లడిస్తోంది చరిత్ర. రాజ్యాధికారం కేంద్రంగా రాజులు పరస్పరం సంబంధాలను పెంచుకున్నారన్నదే ఆ వాస్తవం. రాజస్థాన్‌కి చెందిన రాణా సంగ, స్వయంగా బాబర్‌ను భారతదేశంలోకి ఆహ్వానించిన వ్యక్తి. బాబర్ యుద్ధం చేసింది ఎవరితోనో తెలుసా? ఇబ్రహీం లోఢీతో! ఎందరో ముస్లిం రాజుల

ఆస్థానాల్లో హిందువులు ఉన్నత పదవుల్లో ఉండేవారు. హిందూ రాజులు కూడా మరెందరో ముస్లింలని తమ ఆస్థానాల్లో కీలకమయిన పదవుల్లో నియమించుకున్నారు. అక్బర్ దర్బారులోని నవరత్నాల్లో బీర్‌బల్, తోడర్ మల్ కూడా ఉండేవారు. ముఖ్యంగా తోడర్‌మల్ అక్బర్ సామ్రాజ్యంలో అత్యంత కీలకమయిన రెవిన్యూ విభాగానికి అధిపతిగా ఉండేవాడు. కాగా, అక్బర్‌కీ, రాణా ప్రతాప్‌కీ జరిగిన యుద్ధంలో అక్బర్ సేనలకు నాయకత్వం వహించినవాడు రాజా మాన్ సింగ్. అవతల, రాణా ప్రతాప్ తరపున సేనాధిపతిగా ఉన్నవాడు హకీంఖాన్ సుర్. ఔరంగజేబ్‌ని మతోన్మాదిగా చిత్రించి దుమ్మెత్తిపోయడం మన దేశంలో ఎక్కువయింది. కానీ, ఔరంగజేబ్ కొలువుకూటంలోని అధికారుల్లో హిందువుల సంఖ్య 34% అని అత్థర్ ఆలీ రాసిన పాఠ్యపుస్తకం చెప్తోంది. కాగా, ఔరంగజేబ్‌కీ – శివాజీకి జరిగిన ఓ యుద్ధంలో మొగల్ చక్రవర్తి తరపున సేనలకు నాయకత్వం వహించినవాడు రాజా జయ్ సింగ్.

టిప్పుసుల్తాన్‌పై హిందూ వ్యతిరేకిగా ముద్రకొట్టి చిన్నచూపు చూస్తారు కానీ, అతని ప్రధాన సలహాదారుడు పూర్ణయ్య అనే బ్రాహ్మణుడనే వాస్తవం దాచిపెడతారు. కంచి కామకోటి పీఠాధిపతి అయిన శంకరాచార్యకు టిప్పూ నెత్తిన పెట్టుకుని గౌరవించి, ఎన్నెన్నో నిధులూ నిక్షేపాలూ కుమ్మరించాడు. శంకరాచార్యను టిప్పూ జగద్గురువుగా భావించి, అలాగే పిలిచేవాడు. మరాఠా సేనలు నాశనం చేసిన శ్రీరంగపట్నం దేవాలయానికి టిప్పూ మరమ్మత్తులు చేయించాడు. అలాగే, ఔరంగజేబ్ కాశీలోని విశ్వనాథ దేవాలయాన్ని కూల్చిన మాట నిజమే కానీ, అసోంలోని కామాఖ్య దేవాలయానికి, ఉజ్జయినిలోని మహాకాలుడి దేవాలయానికీ, బృందావనంలోని శ్రీకృష్ణ దేవాలయానికీ – మరెన్నో హిందూ దేవాలయాలకు సయితం – నిధులను సమకూర్చాడు.

## ధార్మిక రంగం :

మధ్యయుగాల నాటి ప్రధాన మతాల్లో, మొత్తంగా ధార్మిక రంగంలో, ఎన్నో సమన్వయపూర్వక వైఖరులు దర్శనమిచ్చాయి. హిందూమతంలో భక్తి, ఇస్లాంలో సూఫీ ధోరణులు మధ్య యుగాలలో ప్రధాన మత ధోరణులుగా ఆవిర్భవించాయి. కబీర్, నానక్, తులసీదాసు సమన్వయ పూర్వక దృక్పథం వహించి, తమ రచనల్లోనూ జీవనంలోనూ రెండు మతాల ప్రభావాన్నీ ప్రదర్శించారు. కబీర్ దాసు ఉన్నత కులస్థులయిన బ్రాహ్మణులు మాట్లాడే సంస్కృతం వాడడానికి నిరాకరించాడు. సరళమయిన హిందీ భాషలోనే కబీర్ సామాన్య ప్రజలకు సందేశమిచ్చేవాడు. హిందూ ముస్లిం మతాల మధ్య నిర్మితమయిన సమన్వయ వారధులను కబీర్ తన జీవిత సాహిత్యాల్లో ప్రతిఫలించాడు. ఆయన ఒక శబ్దంలో ఇలా అన్నాడు – "బంగారమనే ఒకే మూలపదార్థం, వేర్వేరు నగల రూపంలో ఎలా దర్శనమిస్తుందో అదే విధంగా ఒకే భగవంతుడు అల్లాహ్, హరి, రామ్, రహీమ్‌లుగా కనిపిస్తాడు. అవన్నీ ఒకే దైవానికి మనం పెట్టుకున్న వేర్వేరు పేర్లు" అన్నాడు కబీర్. హిందువుల పూజాపునస్కారాలూ, ముస్లింల నమాజ్ పఠనాలూ ఒకే దైవం పట్ల ప్రదర్శించే భిన్న ఆరాధనా రూపాలు అన్నాడు కబీర్. వ్యవస్థీకృత మతాలనూ, ప్రజలను చీల్చే మత సంప్రదాయాలనూ కబీర్ నిశితంగా విమర్శించాడు.

ముల్లాలనూ పూజారులనూ సమానంగానే విమర్శించాడు కబీర్. కులవ్యవస్థ, అంటరానితనం లాంటి సామాజిక దురాచారాలను ఆయన ఖండించాడు. మధ్య యుగాల కాలంలో తలెత్తిన అన్ని రకాల మతధార్మిక ధోరణుల్లోనూ కబీర్ దాసు బోధనలు విస్తరించడం గమనార్హం.

అదే యుగానికి చెందిన మరో భక్తి కవి తులసీదాసు. తన కాలంలో అమల్లో వుండిన ధార్మిక సమన్వయతను తులసీ ఒకానొక ఆత్మ కథాత్మక కవితలో ఇలా ప్రకటించాడు.

"ఎవరేమన్నా అనుకోనీ ఆ రాముని దాసుడు ఈ తులసీ!
దానధర్మాలు నాకాధారం – మసీదు వాకిలి నాకు ఆశ్రయం
ఈ లోకంతో నా లావాదేవీలంతటితోనే అంతమవుతాయి!"
(తులసీదాసు 'కవితావళి' నుంచి)

చరిత్రకు తెలిసిన అతి గొప్ప రామభక్తుడు – తులసీదాసు – మసీదులో నివసించడం గురించి చెప్పాడు. అక్కడ ఉంటూనే శ్రీరాముడి గుణగానం చేసి ఎన్నెన్నో రచనలను వెలువరించాడాయన.

సమాజంలో శాంతి సౌఖ్యం వెల్లివిరియాలని కోరుకున్న మహనీయుడు గురు నానక్. ఆయనపై కబీర్ రచనల ప్రభావం అపారం. సమన్వయ వాదానికి కట్టుబడిన సంస్కర్త నానక్. హిందూ మతం నుంచీ, ఇస్లాం నుంచీ ఎన్నెన్నో భావాలను కూర్చుకుని, నానక్ ఆ రెండింటినీ ఒకే విశ్వాసంలో ముడివెయ్యాలని ప్రయత్నించాడు. ఇస్లాం నుంచి దేవుడొక్కడే అనే భావనను స్వీకరించి – విగ్రహారాధనను నిషేధించాడు నానక్. హిందూ మతం

నుంచి పునర్జన్మ విశ్వాసాన్నీ, కర్మ అనే భావననూ స్వీకరించాడు. మనుషులు ఈ జన్మలో చేసే పనులే వచ్చే జన్మల్లో వాళ్ల రాతను నిర్ణయిస్తాయని నానక్ బోధించాడు. ఆయన కుల వ్యవస్థను వ్యతిరేకించాడు. సిక్కు మతానికి పవిత్ర గ్రంథమయిన 'గురు గ్రంథ్ సాహిబ్'లో కబీర్ రచనలూ, బాబా ఫరీద్ లాంటి సూఫీ సాధువుల బోధనలూ కూడా కనిపిస్తాయి. అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయానికి శంకుస్థాపన చెయ్యాల్సిందిగా మరో సూఫీ సాధువు మీర్ మియాంను నానక్ అభ్యర్థించడం గమనార్హం.

మధ్యయుగాల కాలంలో, అట్టడుగు కులాలూ వర్గాల ప్రజలను సూఫీ ధోరణి అపారంగా ఆకట్టుకుంది. అత్యధిక సంఖ్యాకులయిన అట్టడుగు కులాలూ వర్గాల ప్రజలు ఇస్లాంలోకి మారడానికి సంప్రదాయాలతో సంబంధంలేని సూఫీ జీవన సరళే కారణం. సూఫీల మజార్‌ల – పవిత్ర స్థలాల – తలుపులు ఎల్లరికీ తెరిచే ఉంటాయి. మత విశ్వాసాలతో నిమిత్తం లేకుండా, ప్రతి ఒక్కరూ వాటిని దర్శించుకోవచ్చు. సూఫీలు, మౌలికంగా, ఇస్లాం మతంలోని ఆధ్యాత్మికతకు కట్టుబడి ఉన్నారు. అత్యున్నత సూఫీ సాధువుల్లో ఒకరైన ముహియుద్దీన్ ఇబ్న్ అరబీ "వహదత్ అల్ ఉజూ" (ఒకే అస్తిత్వం) అనే సిద్ధాంత భావనను ప్రతిపాదించారు. ఈ ఒకే అస్తిత్వం అనే భావమే ఆధ్యాత్మిక విశ్వజనీన భావానికి తావిచ్చింది. కులమత భేదాలను ఈ భావనే కూలదోసింది. నిజమైన అస్తిత్వం ఒక్కటేననీ – మనమందరం, దాని ప్రతిరూపాలం మాత్రమేననీ ఈ సిద్ధాంత భావన బోధిస్తుంది. భిన్న మతాలను అనుసరించే వారి మధ్య సద్భావనను నెలకొల్పిన సిద్ధాంతమిది.

సూఫీ సాధువుల ఆధ్యాత్మిక ప్రబోధాలు అతి సామాన్య ప్రజానీకానికి అత్యంత సన్నిహితం కాగలగడం విశేషం. బాబా ఫరీద్ తన ప్రబోధాలను మామూలు పంజాబీ భాషలోనే కవితల రూపంలో చెప్పేవారు. ఆయన రచనలనేకం సిక్కుల పవిత్ర గ్రంథం 'గురు గ్రంథ్ సాహిబ్'లో స్థానం సంపాదించుకోవడం అంతకు మించిన విశేషం. బాబా ఫరీద్ శిష్యుల్లో అగ్రగణ్యుడు నిజాముద్దీన్ అలియా. ఈ భూమి మీద ఎన్ని ఇసుక రేణువులు ఉన్నాయో దైవాన్ని ఆరాధించుకోవడానికి అన్ని మార్గాలూ ఉన్నాయని నిజాముద్దీన్ సగర్వంగా ప్రకటించారు. భజనలు వినడానికి ఆయన చెవి కోసుకునేవారు, ఖవ్వాలీ గానాన్ని కూడా నిజాముద్దీన్ అంతే పారవశ్యంతో వినేవారట. స్థానిక సంప్రదాయాల పట్ల ఆయన గౌరవాదరాలు అపారం. ఇస్లామ్ సంప్రదాయానికి నిజాముద్దీన్ ఎంత దూరంగా ఉండేవారో, స్థానిక సంప్రదాయాలను ఆయన ఎంత గౌరవించేవారో చెప్పడానికి ఈ చిన్న కథ చాలు.

"ఒకనాటి ఉదయం నిజాముద్దీన్ ఆలియా దిల్లీలోని యమునా నదీ తీరం వెంబడి పోతున్నారు. ఆయనతో పాటుగా, ఆయన శిష్యుడు – ఉర్దూ కవితా పితామహుడు – అమీర్ ఖుస్రో కూడా ఉన్నారు. అప్పుడు, దూరంగా యమునలో స్త్రీలు స్నానం చేస్తున్నారు. అంతలో వారంతా సూర్యుడికి నమస్కరించడం మొదలుపెట్టారు. అది చూసి నిజాముద్దీన్ ఆలియా ఇలా అన్నారు : 'ఖుస్రో, చూడు ఆ మహిళలు కూడా దైవానికే మొక్కుతున్నారు. అయితే, ప్రార్థించుకోవడంలో ఎవరి మార్గం వారిదే మళ్లీ'. అలా అన్న తర్వాత నిజాముద్దీన్ ఖురాన్‌లోని ఈ కింది భాగం చదివి వినిపించారు : ఎవరు ఏ వైపునకు తిరిగితే అటువైపే ఒక దిశా నిర్దేశనం ఉంది; అంచేత మంచి పనులు చేసే విషయంలో ఒకరితో ఒకరు ఉత్సాహంగా పోటీపడండి!"

(అస్గర్ అలీ ఇంజినియర్ పత్రం 'సూఫీయిజమ్ అండ్ ఇంటర్‌ఫెయిత్ హార్మనీ' నుంచి. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇస్లామిక్ స్టడీస్, మార్చి 4, 1995)

ఇక్కడ మనమందరం గమనించవలసిన విషయం ఒకటుంది. "ఇతర మతాలను పాటించే వారినందరినీ ఉలేమాలు కాఫిర్‌లుగా పరిగణించి అవమానించేవారు. కానీ, సూఫీలు మాత్రం అన్ని మతాల్లోని ఆధ్యాత్మిక ఆరాధనా మార్గాలనూ గౌరవించేవారు. వాటి పట్ల అపారమయిన గౌరవాదరాలు ప్రకటించేవారు". (పైన పేర్కొన్న పత్రం నుంచే) మజ్‌హర్ జానీజానాం షంషుద్దీన్ హబీబుల్లాహ్ గొప్ప కవి, ధర్మశాస్త్రజ్ఞుడు. ఆయన కూడా అన్య మతాచారాల పట్ల అపారమయిన గౌరవం కలిగి ఉండేవాడు. జహంగీర్ వారసుడయిన దారాషికో సంస్కృతంలో మహాపండితుడు. రాజ్యాధికారం కోసం ఇతన్ని సోదరుడే హత్య చేశాడు. అది వేరే విషయం. హిందూ ధార్మిక గ్రంథాలను దారా క్షుణ్ణంగా చదివినవాడు. 'మజ్మ్ ఉల్ బహ్రైన్' (హిందూ–ఇస్లాం సాగర సంగమం) అనే పుస్తకం రాసినవాడు. ఇస్లామిక్–సూఫీ–హిందూ ధార్మిక పరిభాషను ఈ పుస్తకంలో తులనాత్మకంగా పరిశీలించాడు దారా. ఈ పదాలలోనూ భావాలలోనూ ఎంతో సామ్యం వుందని ఆయన తేల్చి చెప్పాడు.

హిందూ–ఇస్లాం మతాచారాల మధ్య పరస్పర ప్రభావాన్ని డాక్టర్ బి.ఎన్.పాండే తులనాత్మకంగా మదింపు వేశారు. "హిందూ మతానికీ, ఇస్లాంకీ మధ్య మొదట్లో ఎంతో వైరం ఉన్నట్లు కనిపించినప్పటికీ, చివరికి పరస్పరం సమ్మేళనం చెందాయి. ఒకదాన్ని మరొకటి క్షుణ్ణంగా అధ్యయనం చేసుకున్నాయి. ఆయా ధార్మిక భావాల సమన్వయం ఫలితంగానే భక్తి, తసవ్వాఫ్ ధోరణులు ఆవిర్భవించాయి. ఇవి, ప్రేమ–ఆరాధనలకు పెద్దపీట వేసిన మతధోరణులు. ఆనాటి భారతదేశంలో విభిన్న మతాలను పాటించే కోట్లాది మంది ప్రజల హృదయాల్లో పాతుకుపోయిన ధోరణులివి. హిందూ భక్తి భావన – ఇస్లామిక్ సూఫీ భావన పరస్పరం పెనవేసుకుని మహాప్రవాహంగా రూపొందాయి. ఆనాటి ధార్మిక మరుభూములను సారవంతంగా మార్చి, దేశం రూపురేఖలనే మార్చేసింది ఈ మహాప్రవాహం. హిందూ శ్రోత్రియ – సనాతన కర్కశత్వానికీ, భయంకరమయిన ఇస్లామిక్ కులీనతావాదానికీ మధ్య అసాధ్యమనిపించే సమన్వయాన్ని ఈ భారతీయ స్ఫూర్తిమత్వం సాధించగలిగింది. ఈ సమన్వయ ఫలితంగానే అపారమయిన పరిపూర్ణతా, అనంతమయిన రూపవైవిధ్యమూ, హిందూమతంతో సమ్మిళితమయిన ఆంతరంగిక ఐక్యత తాలూకు సహజమయిన దృక్పథమూ రూపుదిద్దుకున్నాయి. పర్యవసానంగానే, చరిత్రాత్మకమైన కళాఖండాలు ఆవిర్భవించాయి. సాహిత్యం, చిత్రకళ, సంగీతం, ప్రేమభావం చేత ప్రేరణ పొందిన మతం – ఇవీ మధ్యయుగాల నాటి భారతీయ చరిత్ర మనకి అందించిన మహోన్నత సాంస్కృతిక వారసత్వ సంపద" అన్నారు డాక్టర్ బి.ఎన్.పాండే.

## సాంస్కృతిక రంగం :

ముస్లిం రాజులతోనూ, ఇస్లాంతోనూ స్థానిక సంస్కృతి మేళవించడంతో అన్ని రంగాల్లోనూ ఒక సమన్వయపూర్వకమైన సంస్కృతి రూపుదిద్దుకుంది. ఈ సమ్మేళనం ఫలితంగానే హిందూస్థానీ సంగీతంలో ఖయాల్, గజల్, ఠుమ్రీ లాంటి అత్యద్భుతమయిన ప్రక్రియలు రూపుదిద్దుకున్నాయి. అయిదు వందల సంవత్సరాల పాటు హిందూ–ముస్లిం సంస్కృతుల సమ్మేళన ఫలితంగా అవతరించినదే హిందూస్థానీ సంగీతం పేరిట ప్రసిద్ధమయిన ఉత్తర భారత సంగీతం. బిజాపూర్ రాజ్యాన్ని పాలించిన రెండో ఇబ్రాహీం ఆదిల్‌షాహీ (1580–1626) తన ఆస్థానంలో 300 మంది హిందూ గాయకులను పోషించాడు. ముస్లింలలో ఈ సంగీతం వ్యాపింపచేసే నిమిత్తం స్వయంగా కితాబే నౌరంగ్ అనే ఉర్దూ గీతసంకలనం వెలువరించాడు ఇబ్రాహీం. 59 గీతాలున్న ఆ సంకలనంలోని తొలిగీతం సరస్వతీ ప్రార్థన. పదిహేనో శతాబ్దానికి చెందిన చైతన్య మహాప్రభు, మరెందరో వైష్ణవ భక్తికవులు, ముస్లింలను ప్రభావితులను చేసి, వాళ్లు కూడా తమ సొంత పలుకుబడులతో పాటలు రాసేలా ప్రోత్సహించారు.

వ్రజ భాషలో శ్రీకృష్ణుని గురించి కీర్తనలు రచించిన వాళ్లలో రహీం, రస్‌ఖాన్‌లు ప్రసిద్ధులు. మధ్యయుగాల ప్రేమ కవితలకి తలమానికమయిన హీర్–రాంఝాల ప్రేమ కథను రాసింది పద్దెనిమిదో శతాబ్దానికి చెందిన సుప్రసిద్ధ సూఫీ సాధు–కవి సయిద్ వారిస్ షాహ్. పదహారు–పదిహేడు శతాబ్దాలకి చెందిన ప్రసిద్ధ సూఫీ సాధు – కవి షేఖ్ ముహమ్మద్, మరాఠీ సాహిత్యానికి ఎనలేని సేవ చేశారు. శివాజీకి ఆధ్యాత్మిక గురువుగా ఉండిన రామ్‌దాస్ ఈ సూఫీ సాధు–కవి గురించి ఎంతో ఘనంగా ప్రస్తావించారు.

దిల్లీ చుట్టుపక్కల నివసించే ప్రజలు మాట్లాడే హిందీ మాండలికంతో కలగలిసిన పారశీ మాండలికమే. 'ఉర్దూ' అనే సరికొత్త భాష పుట్టడానికి దారితీసింది. ఉర్దూ భాషను కేవలం పాలనా భాషగానే కాకుండా, సాహిత్య భాషగా కూడా స్వీకరించి ఆ భాషా సాహిత్యాలకి అపారమయిన సేవ చేసిన గొప్ప హిందూ పండితులెందరో వున్నారు. హిందూ శిల్పకళ అద్భుతమయిన, సున్నితమైన వివరాలతో నిండి, బొమ్మను కమ్మేస్తుంది. ఇస్లామిక్ శిల్పకళ పరిమితమయిన వివరాలతో, శైలీసౌలభ్యంతో కూడి బొమ్మకి అందచందాలను తీర్చిదిద్దుతుంది. ఈ రెండు కళారీతుల సమ్మేళనం విభిన్న శిల్ప కళాఖండాల రూపకల్పనకి తావిచ్చింది. మధ్యయుగాల్లో ఈ రీతి శిల్పకళ వ్యాపించింది. ఆగ్రా కోటలోని జోధాబాయ్ మహల్‌లోనూ, ఫతేపూర్ సిక్రీలోనూ, కువాత్ ఉల్ ఇస్లామ్ మసీదులోనూ ఇదే తరహా సమ్మిశ్ర శిల్పకళారీతి కనిపిస్తుంది. నేటి రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోని హవేలీలోనూ, జోధ్‌పూర్, బికనీర్, జైసల్మేర్ నగరాల్లోని కట్టడాల్లోనూ ఇదే హిందూ–ఇస్లామిక్ (ఇండోసారసేనిక్) వాస్తుశిల్పకళే కనిపిస్తుంది. పారశీక చిత్రకళారీతులనూ, హిందూ చిత్రకళ తాలూకు వర్ణ సమ్మేళనాన్ని సమ్మిశ్రితం చేసిన దాని ఫలితంగా మినియేచర్ పెయింటింగ్ కవితాత్మకతను సంతరించుకుంది.

మతవాద శక్తుల దాడులను తట్టుకుని నిలబడిన కట్టడాల్లో ప్రముఖంగా ప్రస్తావించుకోవలసింది సూఫీ దర్గాల గురించి. ఈ

దర్గాలు భిన్న నగరాల్లో వ్యాపించి వున్నాయి. కొన్ని చోట్ల హిందువులూ మరి కొన్ని చోట్ల ముస్లింలూ ఈ దర్గాల నిర్వహణ బాధ్యతను నిర్వర్తిస్తున్నాయి. అన్ని మతాలకు చెందిన విశ్వాసులూ ఈ దర్గాలను సందర్శిస్తూ వుంటారు. మతవిద్వేషాన్ని వ్యాపింపచేసే శక్తులు వెళ్లగక్కే విషాన్ని లెక్క చేయకుండా వాళ్లు ఈ దర్గాలకు వస్తూనే వున్నారు. ముంబయి నగరానికి సమీపంలో ఉన్న హాజీ మలంగ్ దర్గా, మధ్యయుగాల నాటి సమన్వయ పూర్వక సంస్కృతికీ, కళారీతికీ ఉత్తమ ఉదాహరణగా నిలిచి వుంది. వారసత్వ సంప్రదాయం మేరకి ఈ దర్గాకి ట్రస్టీగా ఎన్నికయిన వ్యక్తి కైలాష్‌నాథ్ గోపాల్ కేట్కర్. ఆయన కులానికి బ్రాహ్మణుడు. దర్గాలో జరిగే పూజలూ సేవలూ హిందూ-ముస్లిం మతాచారాలు రెండింటి సమ్మేళనంగా ఉంటాయి. కొందరు ఛద్దర్లు కప్పితే, మరికొందరు పూలూ కొబ్బరికాయలూ సమర్పించుకుంటారు.

ఇటువంటి ఉదాహరణలు మన దేశం నలుమూలలా కోకొల్లలుగా ఉన్నాయి. ఎంతోవిలువైన ఇటువంటి సత్సంప్రదాయం తాలూకు ప్రాధాన్యాన్ని తగ్గించేందుకు కొందరు కుట్రపూరితంగా ప్రయత్నిస్తున్నారు ఇప్పుడు. ఇటువంటి నేపథ్యంలో సత్యాన్ని సమగ్ర దృక్కోణంలో దర్శించవలసి వుంది. సమన్వయ పూర్వకమైన ఈ సదాచారాల సుసంపన్నతను మనం నిలబెట్టాలి. మన సమాజంలోని విభిన్న విశ్వాసాలకు చెందిన ప్రజలు పరస్పరం వ్యక్తం చేసుకున్న ప్రేమాభిమానాలకూ, సహనానికీ సమర్పించుకున్న ఘనమైన నివాళుల వంటివి ఈ సుసంపన్న సంప్రదాయాలు.

## పరస్పర సామాజిక సంబంధాలు :

సామాజిక స్థాయిలో విభిన్న సముదాయాలకి చెందిన ప్రజల మధ్య వర్ధిల్లిన పరస్పర సంబంధాలు, భిన్న సంప్రదాయాల నుంచి రూపుదిద్దుకున్నవై ఉంటాయి. ఆహారపు అలవాట్లు, వంటలూ, పిండి వంటల్లో ఎన్నెన్నో మార్పులు చోటు చేసుకుని, పరస్పరం సుసంపన్న మవుతూ పోయాయి. వడా పావ్, బిర్యానీ, శాండ్‌విచ్, కట్లెట్ లాంటి భిన్న అంశాలను విభిన్న సంస్కృతులు మనకి పరిచయం చేశాయి. అవి ఇప్పుడు మన ఉమ్మడిసంస్కృతిలో భాగమైపోయాయి. భిన్న సముదాయాల మధ్య పరస్పర సంబంధాలు మన వస్త్రధారణనూ, మన సంగీత రీతులనూ, విభిన్న జీవన విధానాలకి సంబంధించిన అనేక సంప్రదాయాలనూ ప్రభావితం చేశాయి.

## స్వాతంత్ర్యోద్యమం - బహుళత్వం :

మధ్యయుగాల్లో హిందూ ముస్లిం రాజుల పాలనలో విభిన్న సంప్రదాయాలు పాదుకున్న రీతిలోనే, స్వాతంత్ర్యోద్యమ కాలంలో కూడా వైవిధ్యం ఓ సంస్కారంగా వర్ధిల్లింది. వేర్వేరు మతాలకూ, ప్రాంతాలకూ, భాషలకూ కులాలకూ చెందిన స్త్రీలూ పురుషులూ వలసవాదులకు వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్యోద్యమంలో ఐక్యంగా పోరాడారు. ఆధునిక భారత దేశాన్ని నిర్మించేందుకు వారందరూ ఉమ్మడిగా పోరాటం చేశారు. స్వాతంత్ర్యోద్యమం అనేది ఏదో రాజకీయ ఐక్య కార్యాచరణ మాత్రమే కాదు. ఆ ఉద్యమం మన సామాజిక జీవనాన్ని సుసంపన్నం చేసింది; మన సంస్కృతికి అనేక కొత్త కోణాలు తీర్చింది. విభిన్న సంప్రదాయాలను పాటించే వారి మధ్య లోతయిన పరస్పర సంబంధాలు ఏర్పడడానికి స్వాతంత్ర్యోద్యమ కాలం ఎంతో దోహదం చేసింది. ఆధునిక భారత దేశ సౌధానికి ఈ పరస్పర సంబంధాలే పునాది రాళ్లు.


## గాంధీ, నెహ్రూ - మన బహుళత్వం :

స్వాతంత్ర్యోద్యమం తాలూకు బహుళత్వ సారాన్ని గాంధీ, నెహ్రూలు అద్భుతంగా గ్రహించారు. అనేక సందర్భాల్లో, అనేక తరహాల్లో వాళ్లు ఈ వైవిధ్యం గురించి ప్రకటనలు చేశారు. 1909లో, హొంరూల్ ఉద్యమం గురించి రాసిన 'హింద్ స్వరాజ్' పుస్తకంలో గాంధీ మన గత చరిత్రలోని బహుళత్వాన్నీ, వైవిధ్యాన్నీ రేఖామాత్రంగా చిత్రించారు. "ముస్లిం చక్రవర్తుల ఏలుబడిలో ఎందరో హిందువులు వృద్ధిలోకి వచ్చారు. హిందూ చక్రవర్తుల పాలనలో ముస్లింలూ బాగుపడ్డారు. పరస్పరం కలహించుకోవడం ఆత్మహత్యా సదృశమని అన్ని సముదాయాలూ గ్రహించాయి. ఆయుధాలతో బెదిరించినంత మాత్రాన ఏ మతం వారూ తమ విశ్వాసాలను వదిలిపెట్టరని వాళ్లు అర్థం చేసుకున్నారు. అంచేత, రెండు మతాలకి చెందినవాళ్లూ పరస్పరం శాంతి సౌఖ్యాలతో బతకాలనుకున్నారు. ఎప్పుడయితే ఇంగ్లీష్ వలసవాదులు అడుగుపెట్టారో, అప్పట్నుంచే మతకలహాలు తిరిగి పెచ్చరిల్లాయి. మన దేశంలో హిందువులుగా ఉన్న వాళ్లకీ, ముస్లింలుగా బతుకుతున్న వారికీ మూలపురుషులు ఒక్కరేననే వాస్తవాన్ని మనం గుర్తించాలా అక్కర్లేదా? మన అందరి నరాల్లోనూ ప్రవహించే నెత్తురు ఒక్కటేననే సత్యాన్ని మనం గుర్తించాలా అక్కర్లేదా? మతాలు

☞ మిగతా 17వ పేజీలో

# యౌవనోత్సాహం

**అవిజిత్ పాఠక్**
సామాజిక శాస్త్ర ఆచార్యులు
జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీ



విద్యార్థి విజయాల్ని అర్థం లేని అంకెలు, సంబంధం లేని కటాఫ్ మార్కుల వంటి తప్పుడు, మందిపు విధానాల ద్వారా కొలిచే విద్యా సంవత్సరం ముగిసి యువతీ యువకులకు కొత్త సంవత్సరం ప్రారంభం కాబోతోంది. నిరంతర కుటుంబ పర్యవేక్షణలో నియమ నిబంధనల మధ్య సాగిన పాఠశాల, విద్యావరణం నుంచి వాళ్ళు ఉన్నతస్థాయి అధ్యయనం కోసం యౌవనారంభ దశలో ఉండే ఆకాంక్షలు, పొంగులు, ఆరాటాలతో కలగలిసిన ఒకానొక స్వేచ్ఛాయుత వాతావరణంలోకి అడుగుపెట్టబోతున్నారు. కళాశాలలో ఈ సంధి కాలం వారికి ఏం చెప్పబోతోంది ?

ప్రజల మార్కెట్ ప్రేరిత ఆకాంక్షలు, పరిస్థితుల కనుగుణంగా మారిన వాడే మనగలుగుతాడనే సిద్ధాంతాని కనుగుణంగా మధ్యతరగతి సాగించే అవిశ్రాంత పోరాటం, విద్య భారీ మార్కెట్ సరుకుగా మారిపోవడం, కమ్ముకుంటున్న కల్లోల రాజకీయాల – వీటన్నిటి మధ్య భారతీయ సమాజం ఒక బలమైన మార్పుకు లోనవుతున్న దశలో యువ హృదయాలకు కళాశాల జీవితం విముక్త అనుభవాన్నివ్వగలదా ?

యువతతో సదా సంభాషించే అవకాశం ఉన్న అధ్యాపకునిగా, ఉన్నత విద్యావరణంలో వారి స్థితిని అర్థం చేసుకోవడానికి రెండు అంశాలపై దృష్టి సారించవలసి వుందని భావిస్తున్నాను.

## కఠినమైన క్రమశిక్షణకు అటువైపు

కొత్తగా లభించే స్వేచ్ఛ, విసిరే సవాళ్ళను ఎదుర్కోవడంలో యువత పడే ఘర్షణ పట్ల నాకు సానుభూతి ఉంది. నా కళాశాల రోజుల నాటి ఒక జ్ఞాపకాన్ని మీ ముందుంచుతాను. నా మిత్రుడొకడు ఉండేవాడు. అతడు పశ్చిమబెంగాల్‌లోనే ప్రముఖమైన నైతిక విద్యకు, క్రమశిక్షణకు ఆటపట్టయిన ఒకానొక రామకృష్ణ మిషన్ వారి స్కూల్‌లో చదువుకుని వచ్చాడు. స్వామీజీల నిరంతర పర్యవేక్షణలో, ఖచ్చితత్వంతో కూడిన టైంటేబుల్‌ను అనుసరించే పాఠశాల అది. కానీ మేధో సంచలనాలకు, రాడికల్ రాజకీయాలకు, యువతీ యువకుల చెట్టాపట్టాలకు నిలయమైన కలకత్తాలోని ప్రెసిడెన్సీ విశ్వవిద్యాలయంలో అతను ప్రవేశించడంతో కఠిన శిక్షణతో నిర్మితమైన అతని వ్యక్తిత్వం కుప్పకూలటం ప్రారంభమైనది. అతను క్లాసులు ఎగవేయడం మొదలుపెట్టాడు. చిత్తుగా తాగడానికి అలవాటు పడ్డాడు. పైగా రిత్విక్ ఘటక్ వంటి సుప్రసిద్ధ సినీ దర్శకుడు కూడా తన వలెనే అరాచకంగా అల్కాహాలిక్‌గా ఉండేవాడని సమర్ధించుకునేవాడు. జాగ్రత్తగా గమనించినప్పుడు నాకతని తొలినాళ్ళ క్రమశిక్షణ, భయమూ, సైనికతత్వమూ పునాదులుగా నిర్మితమైందే తప్ప అది అతని మనస్సాక్షిని ధ్వనించ లేకపోయిందనీ, అంతర్గత సంగీతంగా లయం కాలేకపోయిందనీ అనిపించింది. అంతేకాదు అతనికి కళాశాలలో కొత్తగా లభించిన స్వేచ్ఛ – లోతూ, విస్తృతీ లేని ఒక అనుకరణ మాత్రమేనని, అది అణచివేయబడిన కోర్కెలు పొందిన పునరావాసమనీ, చివరికి అది అలవాటైన మార్గదర్శకుల గైర్హాజరీలో జీవన చలనశీలతే గతి తప్పడంగా పరిణవించిందనీ అనిపించింది.

ఇవాల్టికీ చాలా మంది యువతకి కళాశాల జీవితం ఈ సవాళ్ళనే విసురుతోంది. ఇదిగో ఈ కూడలిలోనే వారొక అస్తిత్వ సమస్యను తలదాల్చుతున్నారు. కఠిన నిబంధనలతో కూడిన శిక్షణ అనే సంకెళ్ళకు ఆవల, బాధ్యతరహితమైన స్వేచ్ఛకు ఈవల ఉన్న స్వాతంత్ర్యాన్ని ఎట్లా దర్శించాలో వారికి అర్థం కావడం లేదు. స్వేచ్ఛనొక అసంకల్పిత అన్వేషణగా, ప్రపంచానికీ మనిషికీ జరిగే నిరంతర సంభాషణగా అనుభవంలోకి తెచ్చుకోవడంలో వాళ్ళు విఫలమవుతున్నారు.

నిజానికి ఈ స్వేచ్ఛ మానవ సంబంధాల ప్రాంగణంలోనే ఒక రూపాన్ని తీసుకోవలసి వుంది. కళాశాల ఆవరణ అంటే తక్షణ ప్రేమలు, డాన్సులు, సంగీతం, పిక్నిక్‌లు వంటి బాలీవుడ్ ప్రతీక (కరణ్ జోహార్ తరహా) ఉన్నప్పటికీ, నిజానికది ఒక సంక్లిష్ట ఆవరణ. అది నానా జాతుల కేంద్రం. స్నేహితులుగా, సహోద్యోగులుగా, సహ ప్రయాణీకులుగా వేరొక జెండర్‌తో బలీయమైన సంబంధమూ, అవగాహన పెరిగే ప్రదేశం. అక్కడ కొత్త రకం అధ్యాపకులుంటారు. విద్య అక్కడ కొత్త ప్రశ్నల్ని లేవనెత్తుతుంది. లైబ్రరీ, క్యాంటీన్, థియేటర్, ఫిల్మ్‌క్లబ్‌లు నూతన సంబంధాల వేదికలుగా ప్రయోగశాలలుగా వెల్లివిరుస్తాయి.

ఈ కొత్త ఆవరణలో జీవించడం అనే కళ కుటుంబ సంరక్షిత లేదా పాఠశాల నిర్బంధిత జీవితం కంటే ఖచ్చితంగా భిన్నమైంది. ఇక్కడ స్వేచ్ఛను విత్తుకుని సాగు చేసుకోవాలి. అది ఇతరులను నిరపేక్షంగా, వేరెవ్వరితోనూ పోలిక లేకుండా అర్థం చేసుకునే స్వేచ్ఛ. స్త్రీ పురుష సంబంధాలను సమాన ఆకృతిలో మలుచుకోవడం ద్వారా వాటి సౌందర్యాన్ని నిలుపుకునే స్వేచ్ఛ. అధ్యాపకుల్ని సంచాలకులుగా, సంభాషణలో భాగస్వాములుగా అనువర్తింప చేసుకునే స్వేచ్ఛ. అన్నిటినీ మించి జీవన లావణ్యాన్నే జీవితం ప్రసాదించిన అనుగ్రహాన్ని నిలుపుకునే స్వేచ్ఛ.

కానీ ఈ స్వేచ్ఛను ఏమంత సులువుగా పొందలేం. అందుకు ఎన్నో అవాంతరాలున్నాయి. 'మంచి' కళాశాలల్లో కూడా అవకాశాలున్నా యువతరం కులం, జాతి, వేషం, ఉచ్ఛారణ, ఇంగ్లీషు ప్రాతిపదికలుగా కొందర్ని నిందార్హుల్ని చేయడం చూస్తున్నాం. అట్లాగే మీడియా ప్రభావిత లేదా నిర్దేశిత ప్రపంచంలో ఒకరు తమ ప్రత్యేకతల్ని లేదా తమవి మాత్రమే అయిన లక్షణాల్ని రూపురేఖల్ని నిలబెట్టుకోవడం క్లిష్టమైపోయింది. ఎవరి మాదిరిగాను కనిపించి తీరవలసిన ఒత్తిడికి గురి కావల్సి వస్తోంది. ఒకరు లేడీ శ్రీరామ్ కళాశాల విద్యార్థిని అయితే తప్పకుండా ఫాబ్ ఇండియా దుస్తుల్నే ధరించడం వంటి ప్రతీకాత్మక ఆధిపత్య ధోరణికి లొంగిపోవడం ఒక ఉదాహరణ. ఈ లొంగుబాటు స్వేచ్ఛ ఆత్మకు మరకలంటిస్తుంది. ఈ కారణం వల్లనే కళాశాల ఆవరణలు డేవిడ్ రీస్‌మన్ అన్నట్లు వేరెవరు నడిపిస్తే నడిచే మనుషుల ప్రదేశాలుగా మారడమే కాదు, స్పాన్సర్ చేయబడిన మిరుమిట్లు గొలిపే కళాశాల ఉత్సవాల పాప్ సంస్కృతిని ఉత్పత్తి చేసే కర్మాగారాలు కూడా అవుతున్నాయి.

అంతేకాదు, కేవలం నోట్సు కోసమో, హాజరు కోసమో తరగతులకు వెళ్ళడం వల్ల ప్రయోజనం లేదు. అది విద్యార్థిని అధ్యాపకులతో నిరంతరకలయిక వల్ల సంభవించే ఉల్లాసపూరితమైన అధ్యయనం నుంచి వేరు చేస్తుంది. మార్కెట్ వినిమయ సంస్కృతి ప్రతి అనుభవాన్ని తక్షణ అనుభవైకవేద్యమైన వస్తువుగా మార్చుతున్న తరుణంలో ఎరిక్‌ఫ్రామ్ మాటల్లో చెప్పాలంటే ప్రతి అంశంలోనూ 'శిక్షణ కలిగి ఉండడం' (orientation) మానవ సంబంధాల్లోని లయను భగ్నం చేస్తుంది. చివరికి 'ప్రేమలో పడడం' కూడా ప్రతిష్టకు ప్రతీక అవుతుంది. స్వాధీనం కావడానికీ / చేసుకోవడానికీ సంకేతం అవుతుంది. ప్రేమికుల రోజున సగర్వంగా ప్రదర్శించగల దృశ్య సంబరం మాత్రమే అవుతుంది.

అందువల్లనే కళాశాల ప్రాంగణంలోకి అడుగుపెట్టబోయే యువతీ యువకులు సానుకూల జీవనశక్తికీ తాత్కాలిక ఉద్రేకాలకు మధ్య, అధ్యయనం వల్ల కలిగే వికాసానికీ విజయం కోసం వ్యూహాత్మకంగా రూపొందించుకున్న ప్రణాళికకు మధ్య ప్రేమకు కామానికీ మధ్య, సాధికారికమైన వ్యక్తిత్వానికీ భేషజాల కోసం వెంపర్లాడే దుర్బలిత్వానికీ మధ్య జరిగే సంఘర్షణాత్మక అంతర్నాటకం విసిరే సవాళ్ళను ఎదుర్కోవలసి వుంది. యౌవనోత్సాహంగా ఉండడమంటే ఈ సంక్లిష్టత గుండా ప్రయాణించడమే.

## ఉద్యోగార్థులూ , బడాయి మేధావులూ

ఇది కెరీర్ గురించి కూడా ఆలోచించవలసిన సందర్భమే. అందుకే ప్రతి ఒక్కరూ తమను ఉద్యోగార్థిగానే ప్రారంభించుకోవడం మనకు ఆశ్చర్యాన్ని కలిగించదు. ఉద్యోగ ప్రాధాన్యత నిరాకరించ వీలులేని వాస్తవమే అయినా చదువు కేవలం ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, సాంకేతిక విద్యాలయాలు లక్ష్యంగా పెట్టుకునే 'ప్లేస్‌మెంట్‌లు' 'శాలరీప్యాకేజీ' ల కోణం నుంచే చూడవలసి వస్తే సమస్య మొదలవుతుంది. ఇది నూతన సరళీకృత మార్కెట్ పోటీ ప్రపంచపు అందలం అందుకోవడానికి అర్రులు చాస్తున్న మధ్యతరగతి ఆరాటాలను సంతృప్తి పరుస్తుంది కానీ యౌవనంగా ఉండడంలోని ఆశల్ని, ఆశయాల్ని మరో ప్రపంచాల్ని, ఊహా స్వర్గాల్ని నిశ్శబ్దంగా నిశ్శేషం చేస్తుంది. ఈ క్రమంలో కవిత్వం చచ్చిపోతుంది. మంచి సినిమా మాయమవుతుంది. కోర్సు సిలబస్‌కు వెలుపల మంచి పుస్తకం చదవాలన్న కాంక్ష నిర్దాక్షిణ్యంగా అణచి వేయబడుతుంది. ఈ ఉద్యోగార్థులు అర్థవంతమైన విద్యకు అవసరమైన సానుకూలమైన దృక్పధాన్ని నిర్మించడంలో విఫలమవుతారు. ఉదాహరణకు వీరు ఒక చరిత్ర విద్యార్థి ఫెర్నాండ్ బ్రాడెల్‌ను, ఎరిక్ హాబ్స్‌వామ్‌ను చదవడం వల్ల పొందే ఉత్తేజాన్ని అర్థం చేసుకోలేరు. ప్రయోగశాలలో తలముక్కలయ్యే ఫిజిక్స్ విద్యార్థి కొంత సమయం చిక్కించుకుని గ్రంథాలయంలో తీస్తవిస్కీనో, షెర్మన్ షెస్సీనో చేతపట్టుకోవడాన్ని వీళ్ళు ఊహించలేరు. ఫలితం కళాశాల విద్యార్థి సృజనోత్సాహ, మేధోసాహసాలు కనుమరుగై పోతాయి. వీటన్నిటికీ దూరంగా అతను / ఆమె ఒక బహుళ జాతి కంపెనీ ఉద్యోగిగా మిగిలిపోవడమే అత్యంత విషాదం.

ఒక వైపున ఉద్యోగం కోసమే చదివే వాళ్ళు యౌవనోత్తేజం పరవళ్ళు తొక్కవలసిన సందర్భంలో నిస్సారంగా, రొటీన్‌గా ఉపరితలంలో మాత్రమే ఉత్తేజంగా ఉంటుండగా తరగతులకు

హాజరవుతూ, అధ్యాపకుల ఆదేశాలు పాటిస్తూ పరీక్షల్లో ట్యుటోరియళ్ళలో గ్రేడ్‌లు సంపాదించే 'మంచి విద్యార్థులు' కూడా మరో రకం పనిముట్లుగా తయారవుతున్నారు. వారికి వారి పాండిత్యం ఒక ఆభరణం. ఒక లాంటి సాంస్కృతిక పెట్టుబడి. విదేశాల్లో చదువుకునేందుకు ప్రణాళికాబద్ధంగా వేసిన అడుగు. ఆశ్చర్యం లేదు, వారు రాజకీయాలను ద్వేషిస్తారు. అన్ని ప్రత్యామ్నాయాలను వ్యతిరేకిస్తారు. బహుళ 'పరిశుభ్రమైన' ప్రైవేటు విశ్వవిద్యాలయాలు సంపన్న కళాశాలలు ఈ రాజకీయ వ్యతిరేక వాతావరణాన్ని నిర్మిస్తాయి. అదే సమయంలో రాజకీయాలతో కల్లోలమయ్యే పబ్లిక్ విశ్వవిద్యాలయాలు మితిమీరి రక్షణాత్మకంగా ఉండే సంరక్షకుల చేత, మీడియా చేత తీవ్రంగా ఖండించబతాయి.

నిజమే, రాజకీయాలు కాంపస్‌ను వీధి పోరాటాల రంగస్థలిగా మార్చడం, పెద్ద రాజకీయ పార్టీలు సైతం విద్యార్థుల్ని పక్షపాత లక్ష్యాల వైపు మరల్చడం ఆందోళన కలిగించే అంశమే. కానీ దీనికి విరుగుడు విస్తృతమైన సామాజిక సమస్యల నుంచి దూరంగా తప్పుకోవడం కాదు. ఆలోచనల్లో అణగారిన వర్గాల వారసత్వం, ఆకాంక్షల్లో బూర్జువా తత్వం కలిగి పాండిత్యం ముసుగులో కేవలం కెరీర్ కోసం ప్రాకులాడడమూ కాదు. కావలసింది బహుశా జీవితాన్ని స్థిరపరచే సానుకూల రాజకీయాలు. ఆంటోనియో గ్రాంషి ఆశించినట్లు మేధావిని 'సజీవ మేధావి' (Organic Intellectral)గా పరిణమింపచెయ్యగల రాజకీయాలు కావాలి. సున్నితమైన మానవీయ స్పందనల్ని తట్టిలేపి ప్రతి మనిషినీ ప్రజా జీవనంలో చురుకైన భాగస్వామిగా మార్చే రాజకీయాలు కావాలి.

వైరుధ్యం ఏమిటంటే నూతన ఉదారవాదం ప్రజా సమస్యలకు ప్రైవేటు పరిష్కారాలను చూపుతుంది. ఉదాహరణకు రక్షిత మంచినీటి సరఫరా ఎందుకు లేదో పట్టించుకోవడం మానేసి మనం మినరల్ వాటర్ బాటిల్‌ను కొనుక్కుంటాం. ప్రజా రవాణా లేకపోవడం గురించి ప్రశ్నించడం మరచిపోయి స్మార్ట్‌ఫోన్ ఉపయోగించి ఓలా / ఊబర్ సర్వీస్‌లను బుక్ చేసుకుంటాం. మరో వైపు 'సాంకేతిక పరికరాలు' సమాజాన్ని అణు శకలాల స్థాయిలో విచ్ఛిన్నం చేసేస్తాయి. ఈ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ రాజకీయాలు ప్రత్యామ్నాయ సంస్కృతిని నిర్మించడం ద్వారా తమను తాము ప్రేమించుకుని ఆరాధించుకునే వైయక్తిక ధోరణుల్ని ప్రతిఘటించాల్సి ఉంది. యువతరం కంటే మించి ఎవరు దీన్ని సాధ్యం చెయ్యగలరు? యౌవనంతో ఉండడం అంటే సాపేక్షంగా ఉండడం. యౌవనంలో ఉండడం అంటే ప్రేమించడం. యౌవనంగా ఉండడం అంటే ఆధిక్యతల్ని ప్రశ్నించడం.

ప్రణాళికాబద్ధంగా ఉద్యోగాల కోసం అడుగులేసే వారిగానో, తమ పాండిత్యానికి తామే మురిసిపోతూ ఆ బరువును మోయలేని బడాయి మేధావులుగానో కాక, తమను తాము వికసించే పువ్వులుగా పునర్నిర్వచించుకోవలసిన అవసరం కళాశాల ముంగిట్లో నిలిచిన యువతరానికి ఉంది. ❑

## భారతీయ బహుళత్వ చరిత్ర : సమకాలీన ప్రాధాన్యం

**14వ పేజీ తరువాయి...**

మార్చుకున్నంత మాత్రాన మనుషులు పరస్పరం శత్రువులుగా మారిపోతారా? ముస్లింల దేవుడు, హిందువుల భగవంతుడికి భిన్నమయినవాడా? మతాలనేవి, ఒకే గమ్యాన్ని చేరే వేర్వేరు దారులు. ఒకే గమ్యాన్ని చేరడం నిజమయినప్పుడు ఏ దారిలో ప్రయాణిస్తే ఏం? ఇందులో కలహించుకోవలసిన కారణం ఏముందసలు?" అని నిలదీశారు గాంధీజీ.

ఇక నెహ్రూ విషయానికి వస్తే, శతాబ్దాల తరబడి హిందువులూ ముస్లింల మధ్య వర్ధిల్లిన పరస్పర సత్సంబంధాల గురించి 'భారత దర్శనం' (డిస్కవరీ ఆఫ్ ఇండియా) పుస్తకంలో నెహ్రూ నొక్కి చెప్పారు. ఈ అంశాన్ని శ్యామ్ బెనిగల్ రూపొందించిన 'భారత్ ఏక్ ఖోజ్' అద్భుతంగా ప్రదర్శించింది.


**సారాంశం :** అనేక శతాబ్దాలుగా, భారతదేశం బహుళ-వైవిధ్యపూర్వక సమాజంగానే కొనసాగుతూ వచ్చింది. విభిన్న సంస్కృతులకి చెందిన ప్రజలు పరస్పరం సత్సంబంధాలు పెంచుకుని జీవితోత్సవాన్ని కన్నుల పండుగగా జరుపుకున్నారిక్కడ. ఒకే మత సంప్రదాయంతోనూ, సంస్కృతితోనూ దేశాన్ని అంతటినీ ముడిపెట్టే ఒంటెత్తు పోకడ మొదలయి వంద సంవత్సరాలే అయింది. మన సమాజంలో పరస్పర విద్వేషం, అసహనం, హింస పెరగడానికి ఈ ఒంటెత్తు పోకడే కారణం. శాంతి సౌభాగ్యాలను పునఃస్థాపించడానికి మనమందరం బహుళత్వాన్ని, వైవిధ్యాన్ని బలోపేతం చేయాలి. ప్రజలందరికీ పౌర హక్కులూ, మానవ హక్కులూ ఉండే సమాజాన్ని నిర్మించుకోవడానికి అదొక్కటే మార్గం.

**- ఎం.వి.ఎస్. కపర్దీ స్మారకోపన్యాసం** ❑

# కార్ల్ మార్క్స్ జీవిత చరిత్ర

**వి.ఐ. లెనిన్**

కార్ల్ మార్క్స్ 1818 మే 5వ తేదీన (కొత్త కాలెండరు ప్రకారం) ట్రీర్ నగరంలో (రైనిష్ ప్రష్యా) జన్మించాడు. ఆయన తండ్రి న్యాయవాది, యూదు జాతివాడైనా, 1824లో ప్రొటెస్టంట్ మతం స్వీకరించాడు. వాళ్లది సంస్కారం గల సంపన్న కుటుంబం, కాని విప్లవ భావాలు గల కుటుంబం మాత్రం కాదు. ట్రీర్ నగరంలో ఉన్నత పాఠశాల విద్య పూర్తి చేసిన తరువాత, మార్క్స్ మొదట బోన్ విశ్వవిద్యాలయంలోనూ, ఆ తరువాత బెర్లిన్ విశ్వ విద్యాలయం లోనూ చేరి న్యాయశాస్త్రం, అంతకంటే ప్రధానంగా చరిత్ర, తత్త్వ శాస్త్రం అధ్యయనం చేశాడు. 1841లో ఎపిక్యూరస్ తత్త్వశాస్త్రంపై థీసిస్ రాసి విశ్వవిద్యాలయానికి సమర్పించి తత్వశాస్త్రంలో డాక్టరేటు డిగ్రీ సంపాదించాడు. అప్పటికి మార్క్స్ తన అభిప్రాయాలలో హేగెలియన్ భావవాది. బెర్లిన్‌లో ఆయన "వామపక్ష హేగెలియన్" ల బృందంలో (బ్రూనో బౌవర్ మొదలైన వారు) చేరాడు. ఆ బృందం వారు హేగెల్ తత్వశాస్త్రం నుంచి నాస్తిక, విప్లవ భావ నిర్ధారణలు చేయడానికి ప్రయత్నించారు.



విశ్వవిద్యాలయం అధ్యయనం పూర్తి చేసిన తరువాత ఆచార్యుడు కావాలనే ఆశతో మార్క్స్ బోన్ నగరానికి మారాడు. కాని 1832లో లుడ్విగ్ ఫాయెర్‌బాఖ్‌ను ప్రధానాచార్య స్థానం నుంచి తొలగించి, 1836లో ఆయన్ను తిరిగి విశ్వవిద్యాలయానికి రానివ్వకుండా చేసి, 1841లో యువ ఆచార్యుడైన బ్రూనో బౌవర్‌ను బోన్ విశ్వవిద్యాలయంలో లెక్చర్లు ఇవ్వకుండా నిషేధించిన ప్రభుత్వ అభివృద్ధి నిరోధక విధానం మూలంగా మార్క్స్ ఆచార్య వృత్తిని చేపట్టాలనే తన ఉద్దేశాన్ని మానేశాడు. ఆ రోజుల్లో జర్మనీలో వామపక్ష హేగెలియన్ల భావాలు త్వరితగతిని వ్యాపించసాగాయి. లుడ్విగ్ ఫాయెర్‌బాఖ్, ముఖ్యంగా 1836 తరువాత, మత సిద్ధాంతాన్ని విమర్శించడం ప్రారంభించి భౌతికవాదాన్ని సమర్థించడం మొదలుపెట్టాడు.

1841 కల్లా ఆయన తత్వశాస్త్రంలో భౌతికవాదానిది పైచెయ్యి అయింది ("క్రైస్తవ మతసారం" అనే ఆయన గ్రంథం). 1843లో "భవిష్యత్ తత్వశాస్త్ర మూలసూత్రాలు" అనే ఆయన గ్రంథం వెలువడింది. ఈ గ్రంథాలు "మనస్సుపై కలిగించే విమోచన ప్రభావాన్ని ఎవరంతట వారు స్వయంగా అనుభవించవలసిందే" అని ఫాయెర్‌బాఖ్ గ్రంథాలను గురించి ఎంగెల్స్ తరువాత రాశాడు. "మేము" (అంటే మార్క్స్‌తో సహా వామపక్ష హేగెలియన్లు) "అందరం వెంటనే ఫాయెర్ బాఖ్ అనుయాయులమైపోయాం" అని కూడా ఎంగెల్స్ రాశాడు. ఆ రోజులలో వామపక్ష హేగెలియనులతో పరిచయం వున్న రైన్‌లాండ్‌లోని కొందరు తీవ్రవాద బూర్జువాలు కొలోన్ నగరంలో "రైనిషె సైటుంగ్" అనే ప్రతిపక్ష పత్రికను స్థాపించారు (దీని మొదటి సంచిక 1842 జనవరి 1న వెలువడింది). ప్రధాన వ్యాసకర్తలుగా వుండవలసిందిగా మార్క్స్, బ్రూనో బౌవర్ ఆహ్వానింపబడ్డారు, 1842 అక్టోబరులో మార్క్స్ ఆ పత్రికకు ప్రధాన సంపాదకుడు అయి బోన్ నుంచి కొలోన్‌కు మారాడు. మార్క్స్ సంపాదకత్వం క్రింద ఆ పత్రిక విప్లవకర ప్రజాస్వామిక ధోరణి మరింత ప్రస్ఫుటం అయింది, ప్రభుత్వం ఆ పత్రిక మీద మొదట్లో రెండు స్థాయిలలోనూ, ఆ తరువాత మూడు స్థాయిలలోనూ సెన్సార్‌షిప్‌ను విధించి, చివరకు 1843 జనవరి 1న పత్రికను నిషేధించడానికి నిర్ణయించింది. ఆ తేదీకి ముందే మార్క్స్ తన సంపాదకత్వానికి రాజీనామా ఇవ్వవలసి వచ్చింది, కాని ఆ రాజీనామా పత్రికను రక్షించలేకపోయింది. 1843 మార్చిలో పత్రిక మూసివేయబడింది. "రైనిషె సైటుంగ్" పత్రికకు మార్క్స్ రాసిన ప్రధాన వ్యాసాలలో యీ క్రింద పేర్కొన్న వాటికి తోడు ("గ్రంథ వివరణ పట్టిక" చూడండి[1]) మోసెల్ లోయలో ద్రాక్ష పండించే రైతుల స్థితిని గురించి

ఒక వ్యాసం వుందని ఎంగెల్స్ పేర్కొన్నాడు. అర్థశాస్త్రంలో తనకున్న జ్ఞానం చాలదని మార్క్స్ తన పాత్రికేయ ఉద్యోగాన్ని బట్టి తెలుసుకుని పట్టుదలతో అర్థశాస్త్ర అధ్యయనం ప్రారంభించాడు.

తన బాల్య స్నేహితురాలూ విద్యార్థిగా వున్నప్పుడే ప్రదానం చేసుకున్న జెన్నీ ఫన్ వెస్ట్‌ఫాలెన్‌ను 1843లో క్రాయిజ్‌నాఖ్ నగరంలో మార్క్స్ వివాహం చేసుకున్నాడు. ఆయన భార్య అభివృద్ధి నిరోధక భావాలు కల కులీన ప్రష్యన్ కుటుంబానికి చెందింది. ఆమె అన్న అత్యంత అభివృద్ధి నిరోధక కాలమైన 1850–58లో ప్రష్యాలో ఆంతరంగిక వ్యవహారాల మంత్రిగా వుండేవాడు. 1843 ఆకురాలు కాలంలో ఆర్నాల్డ్ రూగెతో కలిసి (రూగె జననం 1802, మరణం 1880; అతడు వామపక్ష హేగెలియన్; 1825 నుండి 1830 వరకూ జైలులో వున్నాడు; 1848 తరువాత రాజకీయ ప్రవాసి, 1866–70 మధ్య కాలంలో బిస్మార్క్ అనుచరుడుగా వున్నాడు) విదేశాల నుంచి ఒక అతివాద పత్రికను ప్రచురించడం కోసం మార్క్స్ పారిస్ నగరానికి వెళ్లాడు. "దోయిచ్–ఫ్రాన్‌జోజిషె యార్‌బ్యూఖర్" ("జర్మన్ ఫ్రెంచి ఐతిహాసిక వార్షిక సంచికలు") అనే ఆ పత్రిక ఒక సంచిక మాత్రమే వెలువడింది. జర్మనీలో దానిని రహస్యంగా పంచి పెట్టడంలో కలిగిన చిక్కుల మూలంగానూ, రూగెతో వచ్చిన అభిప్రాయ బేధాల మూలంగానూ ఆ పత్రిక ప్రచురణ ఆపివేయవలసి వచ్చింది. ఈ పత్రికలో మార్క్స్ వ్రాసిన వ్యాసాలలో, ఆయన అప్పటికే విప్లవకారుడుగా ముందుకొచ్చాడు, "ఉనికిలో వున్న ప్రతిదానినీ నిర్దాక్షిణ్యంగా విమర్శించాలి" అని ఆయన వాదించాడు, అందులోనూ ప్రత్యేకించి "ఆయుధంతో విమర్శ" అని జనబాహుళ్యానికీ, శ్రామిక వర్గానికీ ఆయన ప్రబోధించాడు.

1844 సెప్టెంబరులో పారిస్‌లో కొన్ని రోజులు గడిపేటందుకు ఫ్రెడరిక్ ఎంగెల్స్ పారిస్‌కు వచ్చాడు, అప్పటి నుంచీ ఆయన మార్క్స్‌కి అత్యంత సన్నిహిత మిత్రుడయ్యాడు. వారిద్దరూ అప్పుడు పారిస్‌లో వున్న విప్లవ గ్రూపుల పొంగులు వారే జీవితంలో అత్యంత ఉత్సాహంతో పాల్గొన్నారు. (ఆ రోజులలో ప్రూదన్ సిద్ధాంతం ప్రత్యేకించి ప్రాధాన్యం వహించింది, మార్క్స్ "తత్వశాస్త్ర దారిద్ర్యం" అనే తన గ్రంథం (1847)లో, దానిని తత్తునియలుగా ఖండించాడు) వివిధ రకాల పెటీబూర్జువా సోషలిస్టు సిద్ధాంతాలను తీవ్రంగా ఎదిరించి పోరాడుతూ వారు విప్లవాత్మక శ్రామికవర్గ సోషలిజం లేక కమ్యూనిజం (మార్క్సిజం) యొక్క సిద్ధాంతాన్నీ, ఎత్తుగడలనూ రూపొందించారు. 1844–48 మధ్యకాలంలో మార్క్స్ రచనల వివరాన్ని "గ్రంథ వివరణ పట్టిక"లో చూడండి. ప్రష్యన్ ప్రభుత్వం ఒత్తిడి వల్ల ప్రమాదకరమైన విప్లవకారుడని మార్క్స్‌ని 1845లో పారిస్ నుంచి వెళ్లగొట్టారు. ఆయన బ్రస్సెల్స్‌కు వెళ్లాడు. 1847 వసంతంలో మార్క్స్ ఎంగెల్సులు కమ్యూనిస్ట్ లీగ్ అనే ఒక రహస్య ప్రచార సంఘంలో చేరారు. ఆ లీగ్ ద్వితీయ మహాసభలో (లండన్, నవంబరు 1847) వారు ప్రముఖ పాత్రను నిర్వహించారు, ఆ మహాసభ కోరిక మీదనే ప్రఖ్యాత "కమ్యూనిస్టు ప్రణాళిక"ను వారు రచించారు. అది 1848 ఫిబ్రవరిలో వెలువడింది. ఈ గ్రంథం, ఒక నూతన ప్రపంచ దృక్పథాన్ని, సామాజిక జీవితాన్ని సహితం పరివేష్టించే సుసంగతమైన భౌతిక వాదాన్ని; అభివృద్ధిని గురించిన అత్యంత సమగ్రమైన ప్రగాఢమైన సిద్ధాంతం అయిన గతితర్కాన్ని; వర్గపోరాటం యొక్క నూతన, కమ్యూనిస్టు సమాజనిర్మాత అయిన శ్రామికవర్గపు ప్రపంచ చారిత్రక విప్లవకర పాత్ర యొక్క సిద్ధాంతాన్ని స్పష్టంగానూ ప్రతిభావంతంగానూ వివరిస్తుంది.

1848 ఫిబ్రవరి విప్లవం ప్రజ్వరిల్లినప్పుడు, మార్క్స్ బెల్జియం నుంచి వెళ్లగొట్టబడ్డాడు. ఆయన పారిస్‌కు తిరిగి వెళ్లాడు, అక్కడి నుంచి మార్చి విప్లవానంతరం జర్మనీలో కొలోన్ నగరానికి వెళ్లాడు. కొలోన్‌లో మార్క్స్ ప్రధాన సంపాదకత్వం క్రింద "నోయె రైనిషె సైటుంగ్" అనే పత్రిక 1848 జూన్ 1 నుంచి 1849 మే 19 వరకూ వెలువడింది. ప్రపంచంలోని అన్ని దేశాలలో శ్రామికవర్గ, ప్రజాస్వామిక ఉద్యమాలు తరువాత ధృవపరిచినట్టే 1848–49లలో జరిగిన విప్లవకర ఘటనల తీరు నూతన సిద్ధాంతాన్ని ఘనంగా ధృవపర్చింది. విజయం సాధించిన విప్లవ ప్రతీఘాతకులు మార్క్స్‌పై మొదట కోర్టులో కేసు పెట్టాలని ప్రేరేపించారు. (1849 ఫిబ్రవరి 9న మార్క్స్ నిర్దోషి అని కోర్టు తీర్పు చెప్పింది), ఆ తరువాత ఆయన జర్మనీ నుంచి వెళ్లగొట్టబడ్డాడు (1849 మే 16). మార్క్స్ మొదట పారిస్‌కు వెళ్లాడు, కాని 1849 జూన్ 13 ప్రదర్శన తరువాత ఆయనను మళ్లీ అక్కడి నుంచి వెళ్లగొట్టారు, తదుపరి ఆయన లండన్ చేరి జీవితాంతం వరకూ అక్కడే గడిపాడు.

రాజకీయ ప్రవాసిగా ఆయన ఎంతో కష్టభరితమైన జీవితాన్ని గడపవలసి వచ్చింది. ఈ విషయం మార్క్స్ ఎంగెల్స్‌ల మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలలో స్పష్టంగా తెలుస్తుంది (1913లో

ప్రచురింపబడ్డాయి). మార్క్సు, ఆయన కుటుంబమూ దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించారు. ఎంగెల్సే కనక నిరంతరమూ నిస్వార్థంగా ఆర్థిక సహాయం చేసి వుండకపోతే మార్క్స్ "పెట్టుబడి" అనే గ్రంథాన్ని పూర్తి చేయలేకపోవడమే గాక, లేమితో కృంగిపోయి వుండేవాడు. అంతేకాకుండా, అప్పుడు ప్రబలమై వున్న పెటీబూర్జువా సోషలిజం యొక్క, మొత్తం మీద శ్రామికవర్గేతర సోషలిజం యొక్క సిద్ధాంతాలకూ ధోరణులకూ వ్యతిరేకంగా మార్క్స్ నిరంతరమైన నిర్దాక్షిణ్యమైన పోరాటాన్ని సాగించవలసి వచ్చింది, ఒక్కొక్కప్పుడు అత్యంత ఉన్మత్తమైన అమానుషమైన వ్యక్తిగత దూషణలను సహితం ("Herr Vogt") ఎదుర్కొని తిప్పికొట్టవలసి వచ్చింది. రాజకీయ ప్రవాసుల బృందాలకు దూరంగా వుంటూ, మార్క్స్ ప్రధానంగా అర్థశాస్త్ర అధ్యయనానికి తన శక్తి సామర్థ్యాలను వినియోగించుతూ అనేక చారిత్రక గ్రంథాలలో తన భౌతికవాద సిద్ధాంతాన్ని విపులీకరించాడు. మార్క్స్ తాను రచించిన "అర్థశాస్త్ర విమర్శకు చేర్పు" (1859), "పెట్టుబడి" (మొదటి సంపుటి, 1867) అనే గ్రంథాలలో యీ శాస్త్రాన్ని (ఈ దిగువ ఇవ్వబడిన "మార్క్సిస్టు సిద్ధాంతం" అనే ప్రకరణం చూడండి) విప్లవాత్మకంగా మార్చివేశాడు.

పందొమ్మిదవ శతాబ్దం అయిదవ దశకం చివరి సంవత్సరాల లోను, ఆరవ దశకంలోను ప్రజాస్వామిక ఉద్యమాల పునరుద్ధరణ మార్క్స్‌ను ప్రత్యక్ష కార్యాచరణ రంగంలోకి దింపింది. 1864 (సెప్టెంబరు 28న) అంతర్జాతీయ కార్మికుల సంఘం – ప్రఖ్యాత ప్రథమ ఇంటర్నేషనల్ – లండన్‌లో స్థాపించబడింది. ఈ సంఘానికి ప్రాణమూ అంతఃకరణమూ మార్క్సే, ఆ సంస్థ ప్రకటించిన మొదటి విజ్ఞప్తినీ, అనేక తీర్మానాలనూ, ప్రకటనలనూ, ప్రణాళికలనూ రచించింది మార్క్సే. వివిధ దేశాలలోని కార్మికోద్యమాలను ఐక్యపరుస్తూ వివిధ రూపాలలో వున్న శ్రామిక వర్గేతర, మార్క్సిస్టు పూర్వపు సోషలిజాన్ని (మజ్జీనీ, ప్రూడన్, బకూనిన్, బ్రిటన్‌లోని లిబరల్ ట్రేడ్ యూనియనిజం, జర్మనీలో మితవాదం వైపు లసాలియన్ వూగిసలాటలు వగైరాలను) సంయుక్త కార్యాచరణ మార్గంలోకి మళ్లించడానికి ప్రయత్నిస్తూ, యీ మతాల పంథాల సిద్ధాంతాలను అన్నిటినీ ప్రతిఘటించుతూ వివిధ దేశాలలోని కార్మిక వర్గపు శ్రామిక పోరాటం అవలంభించవలసిన ఏకైక ఎత్తుగడలను మార్క్స్ రూపొందించాడు. పారిస్ కమ్యూన్ పతనం (1871) తరువాత – దీనిని గురించి మార్క్స్ ఎంతో ప్రగాఢమైన, స్పష్టమైన, ప్రతిభావంతమైన, సార్థకమైన, విప్లవాత్మకమైన పరిశీలన జరిపాడు ("ఫ్రాన్సులో అంతర్యుద్ధం", 1871 అనే గ్రంథం) – ఇంటర్నేషనల్ బకూనిన్ అనుయాయులు తెచ్చిన చీలిక మూలంగానూ ఆ సంస్థ యూరప్‌లో ఇంకెంత మాత్రమూ మనలేకపోయింది. హేగ్ ఇంటర్నేషనల్ కాంగ్రెస్ (1872) తరువాత మార్క్స్ ఇంటర్నేషనల్ యొక్క జనరల్ కౌన్సిలును న్యూయార్క్ నగరానికి మార్పించాడు. ప్రథమ ఇంటర్నేషనల్ తన చారిత్రక పాత్రను నిర్వహించింది, ఇప్పుడది ప్రపంచంలోని అన్ని దేశాలలోని కార్మికోద్యమం మరింత ఎక్కువగా అభివృద్ధి చెందే దశకు అంటే, విస్తృతిలో పెరిగి విడివిడిగా దేశాలలో సామూహిక సోషలిస్టు కార్మికవర్గ పార్టీలు ఏర్పడిన దశకు తావిచ్చింది.

ఇంటర్నేషనల్‌లో అమిత ప్రయాసతో కూడిన పని మూలంగానూ, అంతకంటే ఇంకా ఎక్కువ శ్రమతో కూడిన సైద్ధాంతిక వ్యాసంగం మూలంగానూ మార్క్స్ ఆరోగ్యం క్షీణించింది. అయినప్పటికీ అర్థశాస్త్రాన్ని సరిదిద్దే పనినీ, "పెట్టుబడి"ని పూర్తి చేసే పనినీ ఆయన కొనసాగించాడు. అందుకోసం ఆయన బోలెడంత కొత్త సమాచారాన్ని సేకరించాడు. అనేక భాషలు (ఉదాహరణకు రష్యన్ భాష) నేర్చుకున్నాడు. కాని అనారోగ్యం కారణంగా ఆయన "పెట్టుబడి"ని పూర్తి చేయలేకపోయాడు.

1881 డిసెంబరు 2న ఆయన భార్య మరణించింది. 1883 మార్చి 14న ఆయన తన పడకకుర్చీలో ప్రశాంతంగా కన్ను మూశాడు. లండన్‌లోని హైగేట్ శ్మశానవాటికలో ఆయన భార్య సమాధి పక్కనే ఆయన కూడ సమాధి చేయబడ్డాడు. మార్క్స్ కుటుంబం నికృష్ట దారిద్ర్యం అనుభవించుతున్న రోజులలో ఆయన పిల్లలలో కొందరు శైశవదశలోనే లండన్‌లో చనిపోయారు. ముగ్గురు కూతుళ్లు : ఎలియెనోర్ ఎవెలింగ్, లౌరా లాఫార్గ్, జెన్నీ లోంగెలు, ఇంగ్లీషు, ఫ్రెంచి సోషలిస్టులను వివాహాలు చేసుకున్నారు. జెన్నీ లోంగె కొడుకు ఫ్రెంచి సోషలిస్టు పార్టీ సభ్యుడు.

## మార్క్సిజం మూడు మూలాధారాలు - మూడు భాగాలు

మార్క్స్ ఉపదేశాలు నాగరిక ప్రపంచమంతటా బూర్జువా శాస్త్రానికి (అధికారయుగ విజ్ఞానశాస్త్రానికీ, ఉదార విజ్ఞానశాస్త్రానికీ కూడా) అత్యంత శత్రు భావాన్నీ, ద్వేషాన్నీ కలిగిస్తున్నాయి. అవి మార్క్సిజాన్ని ఒక రకమైన 'హానికరమైన పక్షం'గా పరిగణిస్తున్నాయి. అవి వేరొక వైఖరిని ప్రదర్శిస్తాయని ఆశించలేము, ఎందుచేతనంటే

వర్గపోరాటం ప్రాతిపదికగా ఏర్పడిన సమాజంలో "నిష్పాక్షిక"మైన సామాజిక శాస్త్రం అనేది ఏదీ వుండజాలదు. అధికారయుతమైన, ఉదారమైన విజ్ఞాన శాస్త్రం అంతా ఏదో విధంగా వేతన బానిసత్వాన్ని సమర్థిస్తూ వుంటే, మార్క్సిజం ఆ వేతన బానిసత్వం మీద సడలుబాటు లేని యుద్ధాన్ని ప్రకటించింది. వేతన బానిస సమాజంలో విజ్ఞానశాస్త్రం నిష్పాక్షికంగా వుంటుందని ఆశించడం పెట్టుబడిదార్ల లాభాలను తగ్గించుకుని కార్మికుల వేతనాలను పెంచే సమస్య మీద ఉత్పత్తిదారులు నిష్పాక్షికంగా వుంటారని ఆశించడమంతటి తెలివితక్కువ అమాయకత్వమే అవుతుంది.

అంతే కాదు. తత్వశాస్త్ర చరిత్ర, సామాజిక శాస్త్ర చరిత్ర అత్యంత స్పష్టంగా తెలుపుతున్నది ఏమిటంటే, ప్రపంచ నాగరికతాభివృద్ధి యొక్క రాజమార్గానికి దూరంగా ఎక్కడో ఉత్పన్నమైన కరుడుగట్టిన సిద్ధాంతం అనే భావంలో చూస్తే మార్క్సిజంలో "ఒంటెత్తువాదా"న్ని పోలిన లక్షణం కించిత్తు కూడా లేదు. తద్భిన్నంగా మానవజాతిలో అగ్రశ్రేణికి చెందిన భావుకులు ఇదివరకే లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలను ఇవ్వడంలోనే మార్క్స్ ప్రతిభ వుంది. తత్వశాస్త్రంలోనూ, అర్థశాస్త్రంలోనూ, సోషలిజంలోనూ మహాపండితులైన వారి బోధలకు సూటి అయిన తక్షణమైన కొనసాగింపుగానే మార్క్స్ సిద్ధాంతం ఉద్భవించింది.

మార్క్సిస్టు సిద్ధాంతం సర్వశక్తివంతమైనది, ఎందుకంటే అది సత్యమైనది. అది సమగ్రమైనది. సమరసమైనది. ఏ రకమైన మూఢ నమ్మకంతో గానీ, అభివృద్ధి నిరోధకత్వంతో గానీ, బూర్జువా పీడనను సమర్థించడంతో గానీ రాజీపడని పరిపూర్ణమైన ప్రపంచ దృక్పథాన్ని మానవులకు సమకూరుస్తుంది. అది జర్మన్ తత్వశాస్త్రంలోనూ, ఇంగ్లీషు అర్థశాస్త్రంలోనూ, ఫ్రెంచి సోషలిజంలోనూ వ్యక్తమైన విధంగా పంథొమ్మిదవ శతాబ్దంలో మానవాళి సృజించినదానిలో ఉత్తమమైన దానికి న్యాయమైన వారసురాలు.

మార్క్సిజం యొక్క యీ మూడు మూలాధారాలను గురించీ, దాని అంశీభూతములు కూడా అయిన మూడు భాగాలను గురించీ మేమిప్పుడు క్లుప్తంగా వివరిస్తాం.

**(1)**

మార్క్సిజం తత్వశాస్త్రం భౌతికవాదం. యూరప్ ఖండం యొక్క ఆధునిక చరిత్ర అంతటిలోనూ, అందులో ప్రత్యేకించి పద్దెనిమిదవ శతాబ్దం చివరిలో మధ్యయుగం నాటి అన్ని రకాల చెత్తకూ వ్యతిరేకంగానూ, సంస్థలలోనూ భావాలలోనూ వుండిన ఫ్యూడల్ వ్యవస్థకు వ్యతిరేకంగానూ కృతనిశ్చితమైన పోరాటం సాగిన ఫ్రాన్సులు ప్రకృతి శాస్త్రాల బోధలన్నిటికీ తగినట్టుగానూ, మూఢనమ్మకాలకు డాంబికాలు వగైరాలకు వ్యతిరేకంగానూ నిరంతరాయంగా ఎదిరించి నిలబడగలిగిన ఒకే ఒక తత్వశాస్త్రం భౌతికవాదమేనని రుజువైంది. అందుచేత ప్రజాస్వామ్యానికి శత్రువులైన వారు భౌతికవాదాన్ని "పూర్వపక్షం" చేయడానికీ, దాన్ని కూలదోసి అపఖ్యాతి పాలు చేయడానికీ ఎల్లప్పుడూ తమ సర్వశక్తులనూ వినియోగించారు. ఎల్లప్పుడూ ఏదో విధంగా మతాన్ని సమర్థించేవి, లేక బలపర్చేవి అయిన రకరకాల తాత్విక భావవాద రూపాలను ప్రోత్సహిస్తూనే వచ్చారు.

మార్క్స్, ఎంగెల్స్‌లు తాత్విక భౌతికవాదాన్ని అత్యంత దృఢనిశ్చయంతో సమర్థించి యీ ప్రాతిపదిక నుంచి వైదొలగిన పెడమార్గం ప్రతీదీ ఎంత తీవ్రమైన పొరపాటో పదేపదే వివరించారు. ఎంగెల్స్ రచించిన "లుడ్విగ్ ఫాయెర్‌బాఖ్", "ఆంటీ డ్యూరింగ్" అనే గ్రంథాలలో వారి భావాలు అత్యంత స్పష్టంగానూ పూర్తిగానూ వివరించబడ్డాయి. ఇవి, 'కమ్యూనిస్టు ప్రణాళిక' లాగనే వర్గచైతన్యం కలిగిన ప్రతి కార్మికునికీ పాఠ్యగ్రంథాలు.

అయితే, మార్క్స్ పద్దెనిమిదవ శతాబ్దపు భౌతికవాదంతోనే ఆగిపోలేదు. తత్వశాస్త్రాన్ని ఆయన ముందుకు తీసుకుపోయాడు. ఆయన దానిని జర్మన్ సాంప్రదాయక తత్వశాస్త్రం సాధించిన విజయాలతో, అందులోనూ ముఖ్యంగా హేగెల్ సిద్ధాంతంతో పరిపుష్టం చేశాడు. ఈ హేగెల్ సిద్ధాంతం నుంచే ఫాయెర్‌బాఖ్ భౌతికవాదం వచ్చింది. అందులో ప్రధానమైన చేర్పు గతితర్కం, అంటే అభివృద్ధిని దాని పరిపూర్ణమైన, ప్రగాఢమైన, అత్యంత సమగ్రమైన రూపంలో చూపించే సిద్ధాంతం. నిత్యం అభివృద్ధి చెందే పదార్థం యొక్క ప్రతిబింబాన్ని మనకు ప్రదర్శించే మానవ విజ్ఞానపు సాపేక్షత గురించిన సిద్ధాంతం. ప్రకృతి శాస్త్రంలో రేడియం, ఎలక్ట్రానులు, మూలద్రవ్యాలు వేరు పదార్థాలుగా మారిపోవడం మొదలైన ఇటీవలి ఆవిష్కరణలు, పాతకాలపు మృతి చెందిన భావవాదానికి తిరిగివెళ్లి బూర్జువా తత్వశాస్త్రజ్ఞులు చేసే 'నూతన' బోధలన్నీ విఫలం చెందగా, మార్క్స్ యొక్క గతితార్కిక భౌతికవాదానికి అద్భుతమైన ధ్రువీకరణ.

మార్క్స్, తాత్విక భౌతికవాదాన్ని ప్రగాఢ మొనర్చి, పూర్తిగా

అభివృద్ధి చేసి, ప్రకృతిని గురించిన ప్రజ్ఞానాన్ని మానవ సమాజం గురించిన ప్రజ్ఞానానికి కూడా వర్తించేట్టు విస్తృతపర్చాడు. ఆయన చారిత్రక భౌతికవాదం శాస్త్రీయ చింతన సాధించిన ఒక మహత్తర విజయం. చరిత్రను, రాజకీయాలను గురించిన అభిప్రాయాలలో అంతకు పూర్వం ప్రబలంగా వుండిన అవ్యక్తస్థితికీ, నియమరహిత స్థితికీ బదులు ఉత్పాదక శక్తుల పెరుగుదల ఫలితంగా సామాజిక జీవితపు ఒక వ్యవస్థ నుండి మరొక ఉన్నత వ్యవస్థ ఎలా అభివృద్ధి చెందుతుందో – ఉదాహరణకు ఫ్యూడలిజం నుంచి పెట్టుబడిదారీ వ్యవస్థ ఎలా ఉత్పన్నమవుతుందో – నిరూపించే ఆశ్చర్యకరమైనంత పరిపూర్ణమైన సమరసమైన శాస్త్రీయ సిద్ధాంతం వచ్చింది.

మానవుని ఇష్టానిష్టాలతో నిమిత్తం లేకుండా స్వతంత్రంగా ఉనికిలో వున్న ప్రకృతిని (అంటే, అభివృద్ధి చెందే పదార్థాన్ని) అతని ప్రజ్ఞానం ఏ విధంగా ప్రతిబింబిస్తుందో అలాగే మానవుని సామాజిక ప్రజ్ఞానం (అంటే, అతనికున్న తాత్విక, మత, రాజకీయ భావాలూ, సిద్ధాంతాలూ వగైరా) ఆర్థిక వ్యవస్థను ప్రతిబింబిస్తుంది. రాజకీయ సంస్థలు ఆర్థిక పునాది మీద నిర్మింపబడిన ఉపరి నిర్మాణం, ఉదాహరణకు, ఆధునిక యూరోపియన్ రాజ్యాల యొక్క వివిధ రాజకీయ రూపాలు శ్రామికవర్గంపై బూర్జువా వర్గపు అధికారాన్ని పటిష్టం చేసేటందుకు ఉపయోగపడుతూండటాన్ని మనం చూస్తున్నాం.

మానవజాతికి, అందులోనూ ముఖ్యంగా కార్మికవర్గానికి శక్తివంతమైన జ్ఞానసాధనాలను సమకూర్చిన పరిపూర్ణమైన తాత్విక భౌతికవాదమే మార్క్స్ బోధించిన తత్వశాస్త్రం.

**(2)**

ఆర్థిక వ్యవస్థ పునాదిపైనే రాజకీయ ఉపరి నిర్మాణం లేపబడుతుందనే విషయాన్ని గుర్తించిన మార్క్స్ యీ ఆర్థిక వ్యవస్థను క్షుణ్ణంగా పరిశీలించడానికి ఎక్కువ శ్రద్ధ వహించాడు. మార్క్స్ తన ప్రధాన గ్రంథం అయిన 'పెట్టుబడి'లో ఆధునిక సమాజపు, అంటే పెట్టుబడిదారీ సమాజపు, ఆర్థిక వ్యవస్థను గురించి పరిశీలన జరిపాడు.

మార్క్స్‌కు పూర్వం సాంప్రదాయిక అర్థశాస్త్రం, పెట్టుబడిదారీ దేశాలలో కల్లా అత్యంత అభివృద్ధి చెందిన ఇంగ్లండులో వృత్పన్నం అయింది. ఆడమ్ స్మిత్, డేవిడ్ రికార్డో ఆర్థిక వ్యవస్థను పరిశీలించి విలువ యొక్క శ్రమ సిద్ధాంతానికి పునాదులు వేశారు. వారి కృషిని మార్క్స్ కొనసాగించాడు; ఆయన ఆ సిద్ధాంతానికి రుజువును సమకూర్చి దానిని సుసంగతంగా అభివృద్ధి చేశాడు. ప్రతి సరుకు యొక్క విలువ దానిని ఉత్పత్తి చేయడానికి ఖర్చు చేయబడే సామాజికంగా అవసరమైన శ్రమ కాలాన్ని బట్టి నిర్ణయం అవుతుందని నిరూపించాడు.

బూర్జువా అర్థశాస్త్రజ్ఞులు వస్తువుల మధ్య గల సంబంధాన్ని (ఒక సరుకుతో మరొక సరుకును మారకం చేసుకోవడమనే సంబంధాన్ని) గుర్తించగా మార్క్స్ మనుష్యుల మధ్య గల సంబంధాన్ని బైటపెట్టాడు. సరుకుల మారకం మార్కెట్ ద్వారా వ్యక్తిగత ఉత్పత్తిదారుల మధ్య ఉండే సంబంధాన్ని వ్యక్తం చేస్తుంది. ఈ సంబంధం అంతకంతకు మరింత సన్నిహితం అవుతూ వుండడాన్ని, వ్యక్తిగత ఉత్పత్తిదారుల ఆర్థిక జీవితం యావత్తునూ ఒకటిగా విడదీయరాని విధంగా ఏకం చెయ్యడాన్ని ధనం తెలియజేస్తుంది. ఈ సంబంధం మరింత అభివృద్ధి చెందడాన్ని – మానవ శ్రమశక్తి ఒక సరుకుగా తయారవడాన్ని – పెట్టుబడి తెలియజేస్తుంది. వేతన కార్మికుడు తన శ్రమశక్తిని భూమినీ, ఫ్యాక్టరీలను, శ్రమ సాధనాలనూ కలిగివున్న యజమానికి అమ్ముకుంటాడు. కార్మికుడు తాను పనిచేసే రోజులో ఒక భాగాన్ని తననూ, తన కుటుంబాన్ని పోషించుకోడానికి అయ్యే ఖర్చుల సంపాదనకు (వేతనానికి) వినియోగిస్తాడు, ఆ రోజులో రెండవ భాగాన్ని ఎలాంటి ప్రతిఫలం లేకుండా పెట్టుబడిదారుని లాభానికి మూలాధారం అయిన అదనపు విలువను సృష్టించడానికి వినియోగిస్తాడు. ఈ అదనపు విలువే పెట్టుబడిదారీ వర్గపు సంపదకు మూలాధారం.

అదనపు విలువ సిద్ధాంతం మార్క్స్ ఆర్థిక సిద్ధాంతానికి పునాది రాయి.

కార్మికుని శ్రమ సృష్టించిన పెట్టుబడి, చిన్న ఉత్పత్తిదారులను నాశనం చేయడం ద్వారానూ, నిరుద్యోగుల సైన్యాన్ని సృష్టించడం ద్వారానూ కార్మికుణ్ణే అణచివేస్తుంది. పరిశ్రమలో అయితే భారీస్థాయి ఉత్పత్తి సాధించిన విజయం మనకి వెంటనే కనబడుతోంది. కాని వ్యవసాయ రంగంలో కూడా ఇదే పరిణామం సంభవిస్తోందని గ్రహించాలి. అక్కడ భారీ స్థాయి పెట్టుబడిదారీ వ్యవసాయపు ఆధిక్యత పెరుగుతోంది. యంత్రాల వినియోగం హెచ్చు అవుతోంది. ధన పెట్టుబడి గుప్పెట్లో పడి రైతాంగ ఆర్థిక

వ్యవస్థ పతనం చెందుతోంది. వెనుకబడిన వ్యవసాయ పద్ధతుల భారం క్రింద క్రుంగి నాశనం అవుతోంది. సన్నకారు ఉత్పత్తి యొక్క క్షయం వ్యవసాయ రంగంలో వివిధ రూపాలను ధరిస్తోంది, కాని అది క్షీణించిపోతోందన్న విషయం మాత్రం నిర్వివాదం.

సన్నకారు ఉత్పత్తిని నాశనం చేయడం ద్వారా పెట్టుబడి శ్రామిక ఉత్పాదకత యొక్క పెరుగుదలకూ, బడా పెట్టుబడిదారుల సంఘాలు గుత్తాధిపత్య స్థితిని నెలకొల్పడానికి దారితీస్తుంది. ఉత్పత్తియే అంతకంతకు ఎక్కువ సామాజికం అవుతుంది – లక్షలాది కోట్లాది కార్మికులు ఒక క్రమబద్ధమైన ఆర్థిక నిర్మాణంగా కట్టుబాటు అవుతారు. కాని యీ సమిష్టి శ్రమ ఫలితం మాత్రం పిడికెడు మంది పెట్టుబడిదారులచే భుక్తం చేసుకోబడుతుంది. ఉత్పత్తిలో అరాజకత్వం, సంక్షోభాలు, మార్కెట్ల కోసం ఉగ్రమైన వేట, జన బాహుళ్యపు ఉనికికే భద్రత లేకపోవడం తీవ్రమైపోయాయి.

కార్మికులు పెట్టుబడి మీద ఆధారపడి వుండే స్థితిని అంతకంతకు అధికం చేయడం మూలంగా పెట్టుబడిదారీ విధానం సమైక్య శ్రమ యొక్క మహత్తర శక్తిని సృష్టిస్తుంది.

సరకుల ఉత్పత్తి మీద ఆధారపడిన ఆర్థిక వ్యవస్థ అంకుర దశ నుంచి, సరళ మారకం దశ నుంచి దాని అత్యున్నత రూపాలైన భారీస్థాయి ఉత్పత్తి వరకూ పెట్టుబడిదారీ విధానపు అభివృద్ధిని మార్క్స్ వివరించాడు.

పాతవి కొత్తవి, అన్ని పెట్టుబడిదారీ దేశాల అనుభవం అంతకంతకు ఎక్కువ మంది కార్మికులకు ఆయేటికాయేడు ఈ మార్క్స్ సిద్ధాంతంలోని సత్యాన్ని మరింత కళ్లకు కట్టినట్టుగా చూపిస్తుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచమంతటా విజయం పొందింది, కాని యీ విజయం పెట్టుబడి మీద శ్రమశక్తి సాధించబోయే విజయానికి నాంది మాత్రమే.

**(3)**

ఫ్యూడల్ వ్యవస్థ కూలదోయబడి ప్రపంచంలో "స్వేచ్ఛాయుత" పెట్టుబడిదారీ సమాజం రావడంతోనే యీ స్వేచ్ఛ అంటే శ్రామిక ప్రజలను పీడించి దోచుకునే ఒక కొత్త పద్ధతి మాత్రమే అనేది వెంటనే స్పష్టం అయిపోయింది. ఈ పీడనకు ప్రతివర్తనగానూ అసమ్మతిగానూ రకరకాల సోషలిస్టు సిద్ధాంతాలు తక్షణమే తల ఎత్తాయి. కాని ఆదిలో వచ్చిన సోషలిజం ఊహాజనిత సోషలిజంగానే వుండిపోయింది. అది పెట్టుబడిదారీ సమాజాన్ని విమర్శించింది. దానిని ఖండించి తిట్టింది, దాని నాశనాన్ని గురించి అది కలలు కంది, అది ఉత్తమ సమాజ వ్యవస్థ గురించి ఊహించింది, దోపిడి చేయడంలో వున్న అవినీతిని గురించి ధనికులకు నచ్చచెప్పి ఒప్పించడానికి ప్రయత్నించింది.

కాని ఊహాజనిత సోషలిజం నిజమైన పరిష్కార మార్గాన్ని చూపించలేకపోయింది. పెట్టుబడిదారీ వ్యవస్థలో వేతన బానిసత్వపు సారం ఏమిటో వివరించలేకపోయింది. పెట్టుబడిదారీ అభివృద్ధి నియమాలను బైటపెట్టడం గాని ఏ సామాజిక శక్తి నూతన సమాజ సృష్టికర్త కాగల సామర్థ్యం కలిగి వుందో చూపడం గాని చేయలేకపోయింది.

ఇది ఇలా వుండగా ఫ్యూడల్ వ్యవస్థ, భూదాస్య వ్యవస్థ, పతనం చెందిన వెనువెంటనే యూరప్‌లో ప్రతి చోటా, ముఖ్యంగా ఫ్రాన్సులో, వచ్చిన ఉద్ధృతమైన విప్లవాలూ, యీ పరిణామానికంతకీ ప్రాతిపదిక, చోదకశక్తి వర్గపోరాటమే అన్న విషయాన్ని అంతకంతకు మరింత స్పష్టంగా బైటపెట్టాయి.

ఫ్యూడల్ వర్గంపై సాధించబడిన రాజకీయ స్వాతంత్ర్య సంబంధమైన ఏ ఒక్క విజయమూ కూడా తెంపరితనంతో కూడిన ప్రతిఘటనను ఎదుర్కోకుండా లభించలేదు. ఏ ఒక్క పెట్టుబడిదారీ దేశమూ కూడా, పెట్టుబడిదారీ సమాజంలోని వివిధ వర్గాల మధ్య జీవన్మరణ పోరాటం ద్వారా తప్ప కొద్దో గొప్పో స్వేచ్ఛాయుత ప్రజాస్వామిక ప్రాతిపదికపై వికసించలేదు.

దీన్నుంచి, ప్రపంచ చరిత్ర బోధించే యీ గుణపాఠాన్ని మొట్టమొదటి సారిగా గ్రహించి, ఆ గుణపాఠాన్ని సుసంగతంగా అన్వయించడంలోనే మార్క్స్ ప్రతిభ వుంది. ఈ గుణపాఠమే వర్గపోరాట సిద్ధాంతం.

ప్రజలు ఎల్లప్పుడూ రాజకీయాలలో వంచనకూ ఆత్మ వంచనకూ తెలివితక్కువగా బలి అవుతూనే ఉన్నారు. అన్ని నైతిక, మత, రాజకీయ, సాంఘిక పదజాలాల, ప్రకటనల, వాగ్దానాల వెనుక ఏదో ఒక వర్గం యొక్క ప్రయోజనాలు దాగి వున్నాయనే విషయాన్ని గ్రహించేటంత వరకూ వారలా బలి అవుతూనే వుంటారు. ప్రతి పురాతన సంస్థా, అది ఎంత అనాగరికమైనది

☞ మిగతా 25వ పేజీలో

# మార్క్సు సమాధి వద్ద ఎంగెల్స్ ప్రసంగం

మార్చి 14వ తేదీన, మధ్యాహ్నం పావు తక్కువ మూడు గంటలకు, ప్రపంచంలోకెల్ల మహత్తర ఆలోచనాపరుని ఆలోచనా క్రియ ఆగిపోయింది. ఆయన్ని మహా అయితే రెండే రెండు నిమిషాలు విడిచి బయటకు వెళ్లి వుంటామేమో, కాని మేము తిరిగి వచ్చేసరికి ఆయన పడకకుర్చీలో శాంతంగా నిద్రపోతున్నాడు – అయితే అది శాశ్వత నిద్ర.

ఈ మనిషి మృతి మూలంగా యూరప్, అమెరికాలలోని సమరశీల శ్రామికవర్గానికీ, చారిత్రక విజ్ఞాన శాస్త్రానికీ అపారమైన నష్టం వాటిల్లింది. ఈ మహాత్ముని మహాప్రస్థాన కారణంగా ఏర్పడిన లోటు జనానికి త్వరలోనే అనుభూతమవుతుంది.

డార్విన్ ఏ విధంగానైతే జీవప్రకృతి యొక్క అభివృద్ధి నియమాన్ని కనుగొన్నాడో, సరిగా అదే విధంగా మార్క్సు మానవ చరిత్ర యొక్క అభివృద్ధి నియమాన్ని కనుగొన్నాడు. భావజాలం యొక్క అమితవృద్ధి కారణంగా యింతదాకా మరుగున పడిపోయిన ఒక సరళ సత్యాన్ని, రాజకీయాలు, విజ్ఞానశాస్త్రం, కళలు, మతం మొదలైన వాటిలో నిమగ్నులవగలిగేందుకు ముందు మానవజాతికి అన్నపానాలూ, వాస వస్త్రాలూ అవసరమన్న విషయాన్ని ఆయన కనుగొన్నాడు. కాగా, అత్యవసర జీవనాధార వస్తువుల ఉత్పత్తి, తత్పర్యవసానంగా ఒకానొక యుగంలో లేక ఒకానొక జాతి ప్రజల చేత సాధింపబడిన ఆర్థికాభివృద్ధి స్థాయే ఆ ప్రజల యొక్క రాజ్య సంస్థలకు, న్యాయశాస్త్రానికి సంబంధించిన భావనలు, కళలు, చివరకు మతానికి సంబంధించిన భావాలు సైతం క్రమాభివృద్ధి చెందడానికి పునాది. అందుకని వీటన్నింటినీ యీ పునాది దృష్ట్యానే – యింతవరదాకా జరుగుతున్నట్లు, యిందుకు తలకిందులుగా కాకుండా – వివరించాల్సి వుంటుంది.

అయితే అంతమాత్రమే కాదు. సమకాలీన పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్నీ, యీ ఉత్పత్తి విధానం సృష్టించిన బూర్జువా సమాజాన్నీ శాసించే ప్రత్యేక గతినియమాన్ని కూడా మార్క్సు కనుగొన్నాడు. అదనపు విలువ ఆవిష్కారంతో, ఏ సమస్యను పరిష్కరించే ప్రయత్నంలోనైతే అంతకు పూర్వపు అటు బూర్జువా అర్థశాస్త్రజ్ఞుల యొక్క, యిటు సోషలిస్టు విమర్శకుల యొక్క – అన్వేషణలన్నీ అంధాన్వేషణలుగానే మిగిలిపోయాయో, ఆ సమస్యపైన కాంతి ప్రసరింపబడింది.

ఒక జీవితానికి అటువంటి ఆవిష్కరణలు రెండు చాలు. అటువంటి ఒక్క ఆవిష్కరణను చేసే అదృష్టం లభించిన వ్యక్తి సైతం భాగ్యశాలి అనే చెప్పాలి. కాని మార్క్సు తను పరిశోధన జరిపిన ప్రతి రంగంలోనూ కూడా – మరి ఆయన చాలా రంగాల్లోనే పరిశోధన జరిపాడు, అలా పరిశోధన జరిపిన ఏ ఒక్క రంగంలోనూ ఆషామాషీగా పైపైన తడిమి విడిచిపెట్టలేదు. గణితశాస్త్రంతో బాటు ప్రతి ఒక్క రంగంలోనూ కూడా ఆయన స్వతంత్రమైన ఆవిష్కరణలు చేశాడు.

అటువంటి విజ్ఞాన శాస్త్రవేత్త ఆయన. అయితే విజ్ఞాన శాస్త్రవేత్తగా ఆయన యీ రూపం ఆయన సమగ్ర వ్యక్తిత్వంలో అర్థాంశం కూడా కాదు. మార్క్సుకు సంబంధించినంత వరకు విజ్ఞాన శాస్త్రం చారిత్రకంగా క్రియాత్మకమైన, విప్లవాత్మకమైన ఒక శక్తి. ఏ విజ్ఞానశాస్త్ర సిద్ధాంతంలోనైనా ఒక కొత్త ఆవిష్కరణ జరిగితే – ఆచరణలో దాని అన్వయాన్ని గురించి ఆలోచించడం సైతం యింకా అసంభవమే అయినా కూడా – దానికి ఆయన మహా సంతోషంగా స్వాగతం పలికేవాడు. కాని అదే ఆవిష్కరణ పరిశ్రమల్లోనూ, మొత్తంగా చారిత్రకాభివృద్ధిలోనూ రక్షణ విప్లవాత్మక మార్పులకు దారి తీసినట్లయితే ఆయన మరో రకమైన ఆనందానుభూతి పొందుతూండేవాడు. ఉదాహరణకు, విద్యుచ్ఛక్తి రంగంలో జరిగిన ఆవిష్కరణల అభివృద్ధి క్రమాన్ని, మర్సెల్ దెప్రే యిటీవలి ఆవిష్కరణలతో బాటు మార్క్సు అత్యంత శ్రద్ధాసక్తులతో గమనించేవాడు.

మార్క్సు అన్నిటికంటే ముఖ్యంగా విప్లవవాది కావడమే యిందుకు కారణం. ఏదో ఒక రకంగా పెట్టుబడిదారీ సమాజాన్నీ, అది సృష్టించిన రాజ్యసంస్థలనూ కూల్చివెయ్యడానికి తోడ్పడడం, ఆధునిక శ్రామికవర్గ విముక్తికి తోడ్పడడమే ఆయన జీవిత పరమోద్దేశ్యం. దానికి తన స్థితినీ, అవసరాలనూ గురించిన

చైతన్యాన్ని కలిగించి, ఏ పరిస్థితుల్లో దాని విముక్తి సంభవమో తెలియజెప్పిన మొట్టమొదటివాడు ఆయనే. పోరాటం జరపడమే ఆయన సహజగుణం. మరి ఆయన అతి కొద్దిమందికి మాత్రమే సాధ్యమైన ఆవేశంతో, పట్టుదలతో, సాఫల్యంతో ఆ పోరాటాన్ని సాగించాడు. మొదటి "Rheinische Zeitung" (1842)[4]లో, పారిస్ "Vorwarts"[87] (1844) లో, "Deutsche-Brusseler Zeltung"[9] (1847) లో, "Neue Rheinische Zeitung"[10] (1848-49) లో, New York Tribune"[18] (1852-61) లో ఆయన చేసిన పని, దీనికి తోడు సమరశీలమైన అనేక చిన్న పుస్తకాల రచన, పారిస్, బ్రస్సెల్స్, లండన్లలోని సంఘాల్లో చేసిన పని, చిట్టచివర ఆయన సేవల్లోకెల్ల శిఖరప్రాయమైనదైన ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్[88] సంస్థాపన – ఇదెంతటి గొప్ప పని అంటే, యీ సంఘ సంస్థాపకుడు, తను మరేదీ చెయ్యకపోయినా కూడా, యీ ఒక్క పనికే సముచితంగా గర్వించవచ్చు.

మరి వీటన్నింటి పర్యవసానంగానే, మార్క్స్ తనకాలంలో అందరికన్న ఎక్కువగా ద్వేషింపబడ్డాడు, అభాండాలకు గురయ్యాడు. రాజరిక, రిపబ్లికన్ ప్రభుత్వాలు రెండూ కూడా ఆయన్ని తమ తమ దేశాల నుండి బహిష్కరించాయి. బూర్జువాలు, వారు మితవాదులైనా, లేక పరమ ప్రజాస్వామ్యవాదులైనా కూడా, మార్క్స్పై అభాండాలు కురిపించడంలో ఒకరితో మరొకరు పోటీపడ్డారు. ఇవన్నీ ఏదో ఒక సాలెగూడన్నట్లు ఆయన వీటన్నింటినీ తోసిపారేశాడు. వీటిని మనస్సుకు పట్టించుకోలేదు, మరీ తప్పనిసరి అవసరం ఏర్పడినప్పుడు మాత్రమే వీటికి సమాధాన మిచ్చాడు. మరి యిప్పుడాయన మన మధ్య లేడు. సైబీరియా గనులు మొదలుకొని కాలిఫోర్నియా దాకా, యూరప్ అమెరికాలలో అన్ని ప్రాంతాల్లోనూ గల లక్షలాది మంది ఆయన విప్లవవాద కార్మిక సహచరులు ఆయన్ని ప్రేమిస్తున్నారు, ఆయన్ని గౌరవిస్తున్నారు. ఈనాడు ఆయన మృతి పట్ల అశ్రుధారలు కురిపిస్తున్నారు. నేనొక విషయం ధైర్యంగా చెప్పగలను. ఆయనకు పలువురు వ్యతిరేకులు ఉండి వుండవచ్చునేమో గాని ఆయనకు వ్యక్తిగత శత్రువు మాత్రం ఒక్కడూ లేడు.

ఆయన పేరు యుగయుగాలదాకా అమరంతా వుంటుంది, అలాగే ఆయన కృషి కూడా చిరస్థాయిగా వుంటుంది.

లండన్లోని హైగేట్ శ్మశాన వాటికలో 1883, మార్చి 17న ఎంగెల్స్ ఇంగ్లీషు భాషలో చేసిన ప్రసంగం

జర్మన్ భాషలో, 1883, మార్చి 22న, "Der Sozialdemokrat" 13వ సంచికలో ప్రచురింపబడింది. ❑

---

# కార్ల్ మార్క్స్ జీవిత చరిత్ర

**23వ పేజీ తరువాయి**

గానూ, కుళ్లిపోయినదిగానూ కనబడినప్పటికీ పాలక వర్గాలకు చెందిన కొన్ని శక్తులచే అది నిలబెట్టబడుతోందనే విషయాన్ని గ్రహించకుండా వున్నంతవరకూ సంస్కరణవాదులూ, అభివృద్ధి కాముకులూ పాత వ్యవస్థను సమర్థించే వారిచేత ఎల్లప్పుడూ మోసగించబడుతూనే వుంటారు. ఆ వర్గాల ప్రతిఘటనను పటాపంచలు చేయడానికి ఒకే ఒక మార్గం వుంది. అదేమిటంటే మన చుట్టూ ఉన్న సమాజంలోనే పాతను తుడిచివేసి కొత్తను సృష్టించే సామర్థ్యం గలిగివున్న శక్తులను – సమాజంలో వాటి స్థానాన్ని బట్టి ఆ పని చేసి తీరవలసిన శక్తులను – వెలికి తెచ్చి పోరాటం కోసం ఆ శక్తులను విజ్ఞానవంతులను చేసి సంఘటితపర్చడం.

ఇప్పటి వరకూ ఆధ్యాత్మిక బానిసత్వంలో పడి మగ్గుతూన్న పీడిత వర్గాలన్నీ దాని నుండి బైటపడే మార్గాన్ని శ్రామికవర్గానికి చూపినది మార్క్స్ బోధించిన తాత్విక భౌతికవాదం ఒక్కటే. పెట్టుబడిదారీ విధానపు సాధారణ వ్యవస్థలో శ్రామికవర్గం యొక్క నిజమైన స్థానం ఏదో వివరించినది మార్క్స్ ఆర్థిక సిద్ధాంతం ఒక్కటే.

అమెరికా మొదలు జపాను వరకు, స్వీడన్ మొదలు దక్షిణాఫ్రికా వరకు, ప్రపంచమంతటా శ్రామికవర్గపు స్వతంత్ర సంఘాలు వృద్ధి అవుతున్నాయి. తన వర్గ పోరాటాన్ని సాగించడం ద్వారా శ్రామికవర్గం విజ్ఞానాన్ని వికాసాన్ని పొందుతోంది. అది బూర్జువా సమాజపు దుర్భ్రమలను వదిలించుకుంటోంది. అది తన శ్రేణులను మరింత సన్నిహితంగా సమీకరించుకుంటోంది, తన విజయాల ప్రమాణాన్ని అంచనా వేయడం నేర్చుకుంటోంది. అది తన బలాలను పటిష్టం చేసుకుంటోంది, అప్రతిహతంగా అభివృద్ధి చెందుతోంది. ❑

# మార్క్స్ పుట్టిన ఊళ్లో 200వ పుట్టినరోజు



ఎన్. వేణుగోపాల్
సంపాదకులు, వీక్షణం మాసపత్రిక

ప్రపంచ శ్రామికులందరికీ, శ్రమను గౌరవించేవారందరికీ, పీడిత ప్రజలందరికీ అధ్యాపకుడు, స్నేహితుడు, మార్గదర్శి కారల్ మార్క్స్ 200వ పుట్టినరోజు (మే 5, 2018)న ఆయన పుట్టిన ఊళ్లో, పుట్టిన ఇంట్లో గడిపే అరుదైన అవకాశం వీక్షణం సంపాదకుడికి కలిగింది. మార్క్స్ పుట్టిన ఊరు ట్రియర్‌ను, మార్క్స్ పుట్టిన ఇంటిని గతంలో సందర్శించిన వారు, భవిష్యత్తులో సందర్శించబోయేవారు ఎందరైనా ఉండవచ్చు గాని, 200 పుట్టినరోజు చారిత్రక సందర్భం మాత్రం మళ్లీ రాదు. ట్రియర్ సందర్శన గురించి సంపాదకుడి ఉద్వేగభరిత నివేదిక వీక్షణం పాఠకుల కోసం ప్రత్యేకం.

– – –

మానుకోట మిత్రుడు రంజిత్ ఉద్యోగార్థం జర్మనీ చేరినప్పటి నుంచీ, నాలుగేళ్లకు పైగా, నన్ను జర్మనీ వచ్చి కొన్ని రోజులు ఉండమనీ, అక్కడ చూడవలసిన ప్రదేశాలు చూడమనీ ఆహ్వానిస్తున్నాడు. జర్మనీలో చాల నగరాల పేర్లు మార్క్స్, ఎంగెల్స్‌ల రచనల్లో చదివి ఉండడం వల్ల ఎప్పటికైనా ఆ నగరాలు చూడగలిగితే, ఆ చరిత్రను పునర్జీవించగలిగితే బాగుండునని నాకూ కోరిక ఉండింది. చివరికి, మార్క్స్ 200వ జయంతి సందర్భంగా ఆయన పుట్టిన ఊరు ట్రియర్‌లో ఎన్నో ఉత్సవాలూ, ప్రదర్శనలూ జరుగుతున్నాయని విని ఆ రోజుకల్లా అక్కడికి వెళ్లగలిగితే బాగుంటుందనుకున్నాను. అలా ఏప్రిల్ 29 నుంచి మే 16 దాకా జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీల్లో కొన్ని నగరాలు, స్థలాలు చూశాను. ఆ అనుభవాలన్నిటిలోకీ శిఖరాయమానమైనవి, ఉద్వేగభరితమైనవి మే 5న ట్రియర్‌లో పొందిన అనుభవాలు.

రంజిత్ ఉండే ఊరు వాల్డెన్‌బర్గ్ నుంచి ట్రియర్ మూడు వందల కి.మీ. దూరం. మేం (రంజిత్, నా సహచరి వనజ, నేను) మే 5 ఉదయాన్నే బయల్దేరాం. కొబ్లెన్స్‌లో ఉండే తెలుగు మిత్రులు శ్రావ్య, రాహుల్ ట్రియర్‌కు నేరుగా వచ్చారు. ట్రియర్ చేరడానికి ముప్పై నలభై కి.మీ. ముందు రోడ్డు పక్కన రెస్ట్ హౌజ్, రెస్టారెంట్ దగ్గర ఆగినప్పుడు ట్రియర్‌కే వస్తున్న రెండు, మూడు బస్సులు కనబడ్డాయి. వారు కూడ మార్క్స్ ద్విశతజయంతి ఉత్సవాల్లో పాల్గొనడానికి వస్తున్నారని తెలిసింది. దక్షిణ జర్మనీలో ఒక పట్టణంలో స్థానిక స్వపరిపాలన సంస్థకు ఎన్నికైన సభ్యుడు, లండన్‌లో మార్క్స్ వాక్ నిర్వహించే లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ అధ్యాపకురాలు పరిచయమయ్యారు. అంటే అక్కడి నుంచే మార్క్స్ జయంతి సంరంభం, మార్క్స్ పుట్టిన ఊరి అనుభూతులు ప్రారంభమయ్యాయన్నమాట.

జర్మనీ పశ్చిమ భాగంలో మోసెల్ నదీ తీరాన ప్రాచీన నగరం ట్రియర్. ఆ నగరం రోమన్ సామ్రాజ్యపు రోజుల నుంచీ ఉందనడానికి గుర్తుగా ఆ ఊరి మధ్యలో పెద్ద రోమన్ దుర్గ ప్రాకార శిథిలాలున్నాయి. ఆల్ప్స్ పర్వతాలకు ఉత్తరంగా జర్మనీలో రోమన్ సామ్రాజ్య కేంద్రంగా ఉండిన ఏకైక నగరంగా దానికి గుర్తింపు ఉంది. ప్రాచీన కట్టడాలకు యునెస్కో గుర్తింపు పొందిన సాంస్కృతిక కేంద్రం అది. రెండు వేల ఏళ్లుగా ద్రాక్ష తోటలకు ప్రసిద్ధి అనీ, మధ్య యుగాలలో కూడ పేరెన్నికగన్న నగరమనీ నగర వాసులు చెప్పుకుంటారు.

ట్రియర్‌లో ఊరు ఊరంతా మార్క్స్ జయంతి జరుపుతున్నది. ఊళ్లో ఎక్కడ చూసినా "హ్యాపీ బర్త్‌డే కార్ల్ మార్క్స్" అని పోస్టర్లు, బానర్లు ఉన్నాయి. సాధారణ దుకాణాలు కూడ ఆ పోస్టర్లు అతికించుకుని ఉన్నాయి. జర్మనీ ప్రభుత్వం, ట్రియర్ నగర పాలక సంస్థల ఆధ్వర్యంలో నడిచే రైనిషెస్ లాండెస్ మ్యూజియం, స్టాట్ మ్యూజియం, సిమియన్ స్టిఫ్ట్ మ్యూజియం, కార్ల్ మార్క్స్ హౌజ్ నిర్వహిస్తున్న ఫ్రెడరిక్ ఎబర్ట్ స్టిఫ్టుంగ్, ఊళ్లో అతి పురాతనమైన కెథెడ్రల్ – అన్నీ కూడ మార్క్స్ జయంతిని తమ తమ పద్ధతుల్లో జరుపుతున్నాయి. ఈ నాలుగు ప్రధాన సంస్థలూ తమ తమ ప్రత్యేక ప్రదర్శనా ఇతివృత్తాలను ఉంచుకుంటూనే, 'కార్ల్ మార్క్స్ 1888–1883 లెబెన్, వెర్క్, జీట్' (జీవితం, కృషి, కాలం) అనే ప్రధాన ఇతివృత్తాన్ని పెట్టుకున్నాయి. ఇవి కాక, చైనా ప్రభుత్వం ట్రియర్ నగర పాలక సంస్థకు ఈ సందర్భంగా ప్రత్యేక కానుకగా ఇచ్చిన భారీ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమం కూడ ఉంది.

మేం ట్రియర్ చేరీ చేరగానే మార్క్స్ పుట్టిన ఇంటికే బయల్దేరాం. కాని ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన

ప్రదర్శన కోసం, పునర్నవీకరించడం కోసం ఆరు నెలలుగా మూసి ఉన్న ఆ భవనాన్ని అప్పుడే మళ్లీ తెరుస్తున్నారు గనుక అక్కడ ఆహ్వానితుల కోసం మాత్రమే జరుగుతున్న ఉత్సవం సాగుతున్నది. ఆ ఉత్సవం అయిన తర్వాతనే ఇంట్లోకి ఎవరినైనా అనుమతిస్తామన్నారు. దానితో మేమిక విగ్రహావిష్కరణ స్థలం వైపు మళ్లాం. నాలుగడుగులు వేయగానే మొట్టమొదట కనిపించింది నినాదాలు ఇస్తున్న ఓ యాభై అరవై మంది గుంపు. వాళ్లు ఇస్తున్న నినాదాలు అర్థం కాక, దగ్గరికి వెళ్లి చూస్తే వాళ్లంతా దలైలామా బొమ్మలు పట్టుకుని ఉన్నారు. చైనా ప్రభుత్వానికి, మార్క్సిజానికి వ్యతిరేకంగా నినాదాలు ఇస్తున్నారు. 'ఓహో మార్క్స్ జయంతి సందర్భంగా, ప్రత్యేకించి ఇవాళ్టి విగ్రహావిష్కరణలో చైనా ప్రభుత్వ ప్రమేయం ఉంది గనుక వీళ్లు నిరసన ప్రదర్శన జరుపుతున్నట్టున్నారు' అనుకుని ముందుకు కదిలాం.

మరొక నాలుగడుగులు వేసే సరికి వందలాది మంది ఎర్ర జెండాల ఊరేగింపు. జర్మనీకి చెందిన నాలుగు కమ్యూనిస్టు పార్టీలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఆ ఊరేగింపులో దేశదేశాల నుంచి వచ్చిన కమ్యూనిస్టు పార్టీల ప్రతినిధులు, స్వతంత్ర కమ్యూనిస్టులు ఎందరో కలిసిపోయారు. ఆ ఊరేగింపులో కలిసి, ఆ నినాదాల్లో భాగం పంచుకుంటూ విగ్రహం ఉన్న చోటి వరకూ వెళ్లాం.

## విగ్రహావిష్కరణ

మార్క్స్ 200వ జయంతి సందర్భంగా ట్రియర్ నగరానికి ఒక భారీ కాంస్య విగ్రహం కానుకగా ఇస్తానని చైనా ప్రభుత్వం గత సంవత్సరం సందేశం పంపింది. ట్రియర్ నగర వాసులలో, ముఖ్యంగా నగరపాలక సంస్థలో ఈ కానుకను స్వీకరించాలా లేదా అని చర్చ మొదలైంది. చైనా నేషనల్ మ్యూజియం డైరెక్టర్, చైనా పీపుల్స్ పొలిటికల్ కన్సల్టేటివ్ కాన్ఫరెన్స్ సభ్యుడు, ప్రపంచ ప్రఖ్యాత శిల్పి వు వెయిషాన్ విగ్రహం నెలకొల్పే స్థలాన్ని చూడడానికి జనవరిలో ట్రియర్ సందర్శించాడు. మార్క్స్ ఈ ఊళ్లో గడిపింది బాల్య, కౌమారాలు మాత్రమే గనుక ఆయనను ఒక చిన్నపిల్లవాడిగా చిత్రించాలని, ఆ చిన్నపిల్లాడు ఒక బెంచి మీద కూచుని ఆడుకుంటున్నట్టు ఉండాలని, ఆయన పక్కన కూచోవడానికి ఇతరులకు స్థలం కూడా వదలాలని ట్రియర్‌లో ఒక సూచన వచ్చిందట. మార్క్స్ వ్యక్తిత్వానికి, ఘనతకు తగినట్టుగా భారీ విగ్రహమే ఉండాలని, పధ్నాలుగు అడుగుల ఎత్తయిన విగ్రహం తయారు చేస్తానని శిల్పి అన్నాడట. చివరికి ఆ విగ్రహమే నిర్ధారణ అయి, ఏప్రిల్ నాటికి విగ్రహం ట్రియర్ చేరింది. ఈలోగా చైనా మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నది గనుక చైనా కానుకను స్వీకరించవద్దని నిరసనలు, ప్రకటనలు మొదలయ్యాయి. చివరికి 42–7 ఓట్ల ఆధిక్యతతో విగ్రహాన్ని స్థాపించాలని, పోర్టా నిగ్రా అని పిలుచుకునే రోమన్ ప్రాకార శిథాలాల దగ్గర స్థాపించాలని నిర్ణయించారు. అది మార్క్స్ పుట్టిన ఇంటికి ఒక ఫర్లాంగు దూరంలో ఉంటుంది గనుక మార్క్స్ తన ఇంటివైపు చూస్తున్నట్టుగా దాన్ని ఏర్పాటు చేశారు. మూడడుగులు పునాది కూడ కలిసి అది నేల నుంచి పదిహేడడుగుల ఎత్తున ఉంది.

ఆ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఏర్పాటు చేసిన ప్రాంగణంలో దాదాపు వెయ్యి మంది, ప్రాంగణం బైట రోడ్ల మీద, భవనాల గదుల్లో, కప్పుల మీద దాదాపు మరొక రెండు మూడు వేల మంది ఉన్నారు. ఒక పక్కన 'నియంతల పిత మార్క్స్' అనీ, 'లక్షలాది మంది ప్రజల హంతకుల పిత' అనీ, టిబెట్‌కు స్వాతంత్ర్యం కావాలనీ బానర్లు, ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తున్న యాభై అరవై మంది టిబెటన్లు, వారితో పాటు ఉన్న కొందరు జర్మన్ కమ్యూనిస్టు వ్యతిరేకులు ప్రాంగణంలోకి జొరబడకుండా నిరోధించడానికి పోలీసు వలయాలు ఏర్పాటు చేశారు.

జర్మనీ, చైనీస్ ప్రభుత్వ ప్రతినిధుల ఉపన్యాసాలు, వాటికి జర్మన్, చైనీస్ అనువాదాలు గంటన్నర రెండు గంటల పాటు సాగి విసుగెత్తించినా అందరూ ప్రశాంతంగా వేచి చూశారు. వృద్ధులు, యువకులు, పిల్లలు, చిన్నపిల్లలను భుజాల మీదికి ఎక్కించుకుని కూచోపెట్టుకున్న తల్లిదండ్రులు, వేరువేరు దేశాలవాళ్లు, వేరువేరు భాషల వాళ్లు, వేరువేరు రంగుల వాళ్లు నిజంగా అక్కడ 'ప్రపంచ కార్మికులారా ఏకం కండి' అని మార్క్స్ ఇచ్చిన నినాదం వాస్తవ రూపం దాల్చిన దృశ్యం కనబడింది. విగ్రహం మీద అప్పటివరకూ కప్పి ఉంచిన ఎర్రగుడ్డను ప్రభుత్వ ప్రతినిధులు తొలగించి విగ్రహాన్ని ఆవిష్కరించగానే వేలాది మంది ప్రేక్షకుల కరతాళ ధ్వనులు, నినాదాలు మిన్నంటాయి.

ఆ ప్రాంగణంలోనూ, నగరంలో చాలా చోట్ల ఈ సందర్భంగా మార్క్స్ బొమ్మలను, సూక్తులను సరుకులుగా మార్చి అమ్ముకునే ప్రయత్నం కూడా పెద్ద ఎత్తునే జరిగింది. మార్క్స్ బొమ్మలతో, సంతకంతో పెన్నులు, తాళం చెవులు, కార్డులు, పుస్తకాలు, ఫోటోలు మాత్రమే కాక మార్క్స్ పేరుతో ప్రత్యేకంగా విడుదల చేసిన కాఫీ, బీర్, షాంపేన్‌ల అమ్మకాలు కూడ జోరుగా సాగాయి. చివరికి మార్క్స్ ఇంటికి వెళ్లే దారిలో కూడలిలో రెడ్ సిగ్నల్, గ్రీన్ సిగ్నల్ కూడ మార్క్స్ బొమ్మలతో తయారు చేశారు.

## స్టాడ్ట్ మ్యూజియం సిమియన్ స్టిఫ్ట్

ట్రియర్‌లో కొన్ని దశాబ్దాలుగా ఉన్న సిటీ మ్యూజియం ఆ విగ్రహం పక్కనే ఉంది. అది ఆ ప్రాంతంలో దొరికిన శిల్పాలను, పురా వస్తువులనూ, చిత్రాలనూ, జీవనశైలి చిహ్నాలనూ సంగ్రహపరిచిన మంచి మ్యూజియం అని పేరు పొందింది గాని, ప్రస్తుతం ప్రత్యేకంగా మార్క్స్ జీవితంపై 'స్టేషన్స్ ఇన్ లైఫ్' అనే ఉప ఇతివృత్తంతో ఒక మూడు అంతస్తుల, పది పన్నెండు గదుల ప్రదర్శన ఏర్పాటు చేసింది. మూడు అంతస్తులు కనబడే మెట్ల పక్కన ఆ మూడు అంతస్తుల నిలువునా మార్క్స్ జీవితక్రమంలోని ఏడెనిమిది కీలకమైన ఫోటోలు నిలువెత్తు పరిమాణంలో ముద్రించిన పెద్ద బానర్ వేలాడదీశారు.

ఈ ప్రదర్శన చివర చెప్పినట్టు 'మార్క్స్ జీవితం ఒక సుదీర్ఘ ప్రయాణం' అనే అవగాహనతో ఆ జీవిత ప్రయాణంలో ఆయన ఒక రోజయినా కొన్ని సంవత్సరాలయినా నిలిచిన స్టేషన్ల ద్వారా ఆయన వ్యక్తిత్వాన్ని, కృషిని, కాలాన్ని పరిచయం చేయడం ఈ ప్రదర్శన ఉద్దేశ్యం. అలా ట్రియర్‌లో బయల్దేరి ఎన్నెన్నో ఊళ్లూ దేశాలూ తిరుగుతూ ఒక్కొక్క స్టేషన్‌లో ఎంతో మందిని కలుస్తూ, ఎన్నో అన్వేషిస్తూ, ఎన్నో రాస్తూ, ఎందరినో సంఘటితపరుస్తూ, ఎందరినో ప్రభావితం చేస్తూ సాగిన ఈ మహత్తర జీవిత యాత్రను ఈ ప్రదర్శన అద్భుతంగా పట్టుకుంది. అది కార్ల్ మార్క్స్ అనే ఒకానొక వ్యక్తి జీవితచరిత్రగా మాత్రమే కాక, ఆ వ్యక్తి అలా ఎదగడానికి కారణమైన సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక నేపథ్యంలో ఆ వ్యక్తిని భాగంగా చూసే సామాజిక చరిత్రగా చూసింది గనుక అది మరింత అద్భుతంగా ఉంది.

ప్రదర్శన ప్రారంభంలోనే 1818లో మార్క్స్ పుట్టే నాటికి ట్రియర్ ఎలా ఉందో, ఆ ట్రియర్ జీవితం మార్క్స్ ఆలోచనాసరళి మీద ఎటువంటి ప్రభావం వేసిందో, అంటే ప్రారంభమైన స్టేషన్‌లోనే ఈ రైలు ప్రయాణ దిశ ఎలా నిర్ణయమయిందో ఆధారాలతో సహా వివరించారు. 1820లలో ట్రియర్‌లో కలరా వ్యాపించి వందలాది మంది చనిపోయారట. ఆ తర్వాత కలరా ఎందుకు అంతగా విస్తరించిందో తెలుసుకోవడానికి ప్రభుత్వం 1831లో ట్రియర్‌లో ఒక సామాజిక, ఆర్థిక సర్వే నిర్వహించిందట. ఆ సర్వేలో ప్రజలను అడిగిన ప్రశ్నలు, జవాబులు నమోదు చేసిన రిజిష్టర్ల కాగితాలు అక్కడ ప్రదర్శనకు పెట్టారు. ఆ సర్వే ప్రకారం ఆనాటి ట్రియర్ జనాభాలో 70 శాతం పైన కనీస సౌకర్యాలు లేని, పేదరికపు జీవనం గడుపుతున్నారని తేలిందట. అలా పేదలు నివసించే



ప్రాంతాలలో 1831 నాటి ట్రియర్ పటాన్ని కూడ అక్కడ ప్రదర్శనకు పెట్టారు. సంపన్న కుటుంబంలో పుట్టి పెరుగుతున్నప్పటికీ, తన ఇంటి చుట్టుపట్లనే కనబడుతున్న దుర్భర దారిద్ర్యం ఆయనతో ఆ తర్వాతి అన్వేషణలకు బీజం వేసి ఉంటుందని అక్కడ వ్యాఖ్య రాశారు.

అయితే మార్క్స్ అక్కడ ఎక్కువ రోజులు ఉండలేదు. పదిహేడేళ్ల వయసులో, 1835లో న్యాయవిద్య అభ్యసించడం కోసం తండ్రి బాన్ విశ్వవిద్యాలయానికి పంపాడు. తనలాగే కొడుకు కూడ న్యాయవాది కావాలని తండ్రి ఆశించాడు. తర్వాతి స్టేషన్ బాన్. న్యాయవిద్య తనకు సరిపడదని మార్క్స్ త్వరలోనే తెలుసుకున్నాడు. అందుకని బాన్ స్టేషన్‌లో రైలు ఎక్కువ సేపు ఆగలేదు. అప్పటికి మేధో సంచలనాలకు, తాత్విక చర్చలకు కేంద్రంగా ఉన్న బెర్లిన్ విశ్వవిద్యాలయానికి వెళ్లాలని మార్క్స్ అనుకున్నాడు. న్యాయశాస్త్రం వదిలి తత్వశాస్త్రంలో ప్రవేశించాడు.

తన తత్వశాస్త్ర సిద్ధాంత పత్రాన్ని స్వీకరించడానికి బెర్లిన్ విశ్వవిద్యాలయం తిరస్కరించిన తరువాత, మార్క్స్ దాన్నే యేనా విశ్వవిద్యాలయంలో సమర్పించి, పిహెచ్‌డి పొందాడు. ఎక్కడో ఒకచోట తత్వశాస్త్ర అధ్యాపకుడిగా చేరాలనుకుని, తన విప్లవ భావాల వల్ల ఆ ఉద్యోగం దొరకదని తేలిపోయాక, 1842లో కోలోన్ చేరి జర్నలిస్టుగా మారి రైనిష్ జీటుంగ్‌లో చేరాడు. ఆ పత్రికలో ఆయన రాస్తున్న విప్లవ భావాలను సహించని ప్రష్యన్ ప్రభుత్వ సెన్సార్లు ఆ పత్రిక మీద ఎన్నో ఆంక్షలు విధించారు. చివరికి 1843లో పత్రికలో రష్యన్ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ వచ్చిన ఒక వ్యాసంతో, జార్ చక్రవర్తి మొదటి నికొలస్ పత్రికను నిషేధించమని ప్రష్యన్ ప్రభుత్వాన్ని కోరాడు. ప్రష్యన్ ప్రభుత్వం పత్రికను నిషేధించడంతో మార్క్స్ మరొక పత్రిక కోసం పారిస్ తరలి పోవలసి వచ్చింది.

పారిస్‌లో ఆయనకు ఎంగెల్స్ పరిచయమై ఒక అసాధారణమైన, అపురూపమైన, దశాబ్దాల పాటు సాగిన మేధో

మైత్రి మొదలయింది. ఆ తర్వాత గడిచిన ఆరు సంవత్సరాలలో ఒక్కొక్క దేశం నుంచి బహిష్కృతుడవుతూ మార్క్స్ పారిస్, బ్రస్సెల్స్, కోలోన్‌లలో కాస్త ఎక్కువ కాలం, ఇంగ్లండ్, హాలండ్, ఫ్రాన్స్‌లలో అనేక నగరాలలో కొద్ది కాలం గడిపాడు. అలా ఆయన ఉండిన ప్రతి స్థలంలోనూ ఆయన స్నేహ బృందంలో ఎవరున్నారో, ఆ బృందం ఏయే పనులు చేసిందో, ఆయన ఏ రచనలు చేశాడో మొదలైన వివరాలు, చిన్న చిన్న వివరాలతో రాశారు. ఆయా కాలాల్లో అచ్చయిన పుస్తకాల తొలి ప్రచురణ ప్రతులు, 1848లో అచ్చయిన కమ్యూనిస్టు ప్రణాళిక, 1867 నాటి దాస్ కాపిటల్, 1845 నాటి ఎంగెల్స్ కండిషన్ ఆఫ్ వర్కింగ్ క్లాస్ ఇన్ ఇంగ్లండ్‌తో సహా ప్రదర్శనకు పెట్టారు. కన్ఫెషన్స్ పేరుతో ఆ రోజుల్లో విరివిగా సాగుతుండిన 20 ప్రశ్నల పత్రానికి మార్క్స్ 1865లో హాలండ్‌లో ఉన్న రోజుల్లో రాసిన జవాబుల చేతిరాత ప్రతి కూడ ఇక్కడ ప్రదర్శనకు పెట్టారు. ఆ ప్రతిలోనే ఆయన 'మీ మూలసూత్రం ఏమిటి' అనే ప్రశ్నకు 'మనిషికి సంబంధించినదేదీ నాకు పరాయిది కాదు' అనే రోమన్ కవి టెరెన్స్ వాక్యాన్ని, 'మీ ఆశయం ఏమిటి' అనే ప్రశ్నకు 'ప్రతిదాన్నీ ప్రశ్నించు' అని ఫ్రెంచి తత్వవేత్త దేకార్త్ మాటను తన జవాబులుగా రాశాడు. అలాగే ఈ ప్రదర్శనలో మార్క్స్ వాడిన పెన్నులు, పాళీలు, సిరా బుడ్డీలు కూడ ప్రదర్శనకు పెట్టారు.

ఈ ప్రదర్శన మాత్రమే కాదు, ట్రియర్‌లో మేం చూసిన మూడు ప్రదర్శనలూ ఎంత శ్రద్ధగా, ప్రేమగా తయారు చేశారంటే అవి కేవలం మొక్కుబడి జీవితచరిత్రలు కావు. మార్క్స్ జీవిత చరిత్రలు ఇప్పటికి వందకు పైగా వచ్చి ఉంటాయి. వాటన్నిటిలో లేనిదేదో ఒకటి, వాటిలో కనబడని ఏదో ఒక కోణం, వాటిలో సమ్మిళితం కాని భిన్న ఘటనలు, ఆ పాత జీవితచరిత్ర రచయితలకు కూడ తెలియని, అందుబాటులోకి రాని ఏదో ఒక కొత్త సమాచారం, తెలిసిన సమాచారం మీద కూడ కొత్త వ్యాఖ్య, కొత్త వెలుగు ఈ ప్రదర్శనల్లోని ముఖ్యాంశాలు.

అలా ఈ ప్రదర్శనలో ఇదివరకెక్కడా బైటపడని, ఎవరికీ తెలియని ఒక రేఖాచిత్రం ఉంది. మార్క్స్ కన్న నాలుగేళ్లు పెద్దవాడైన హెన్రిక్ రోస్ బాక్ (1814–79) అనే ట్రియర్‌లోని చిత్రకారుడు, వైద్యుడు, వృక్ష శాస్త్రజ్ఞుడు 1835–36లో పదిహేడేళ్ల మార్క్స్ రేఖాచిత్రం పెన్సిల్‌తో గీశాడు. ఇది మార్క్స్ విశ్వవిద్యాలయానికి వెళ్లే ముందో, బాన్‌లో ఉన్నప్పుడో గీసింది కావచ్చు. ఆ చిత్రం 2016లో బైటపడింది. అది ఈ ప్రదర్శనలో తొలిసారి బహిరంగంగా ప్రదర్శించారు.

## కార్ల్ మార్క్స్ హౌజ్

మ్యూజియం మార్క్స్ హౌజ్ మార్క్స్ పుట్టిన ఇల్లు. ఇది కార్ల్ మార్క్స్ తండ్రి హైన్రిక్ మార్క్స్ కట్టించిన, కొనుక్కున్న సొంత భవనమా, అద్దెకు ఉన్న ఇల్లా అనే అంశంలో భిన్న కథనాలున్నాయి గాని ప్రసిద్ధుడైన న్యాయవాదిగా, ద్రాక్షతోటల యజమానిగా, ఎగువ మధ్యతరగతిలో ఉండిన హైన్రిక్ ఈ భవనం సొంతదారు అయి ఉండడానికే ఎక్కువ అవకాశాలున్నాయి. ఆ కుటుంబం ఈ ఇంట్లో అద్దెకే ఉన్నారని, పోర్టా నిగ్రా సమీపంలో సొంత ఇల్లు ఉండేదని స్థానిక జర్నలిస్టు ఒకరు ప్రస్తుతం రాసిన పుస్తకంలో రాశారు. మొత్తానికి మార్క్స్ ఆ ఇంట్లోనే పుట్టి పెరిగాడనేది నిర్వివాదం.

అయితే మార్క్స్ చనిపోయిన ఇరవై ఏళ్ల తర్వాత, 1904 నాటికి ఈ ఇంటి గురించి తెలిసి జర్మన్ కమ్యూనిస్టులు, ముఖ్యంగా జర్మన్ సోషల్ డెమొక్రటిక్ పార్టీ (ఎస్ పిడి) ఈ ఇంటిని పరిరక్షించాలని పూనుకున్నారు. వారి ప్రయత్నాలు 1928లో ఫలించి, ఆ భవనం ఎస్ పిడి సొంతమైంది. కాని హిట్లర్ అధికారానికి రాగానే 1993లో ఈ భవనాన్ని ఆక్రమించి, అందులో ప్రభుత్వ ముద్రణాలయం పెట్టారు. మళ్లీ 1947కు గాని అది ఎస్‌పిడి చేతికి రాలేదు. ఎస్‌పిడి ఆ భవనంలో మార్క్స్ జీవితం, కృషికి సంబంధించిన మ్యూజియం ఏర్పాటు చేసి 1947 మే 5న ప్రారంభించింది. 1968లో ఈ భవనం ఎస్‌పిడికి సన్నిహితంగా ఉన్న ఫ్రెడరిక్ ఎబర్ట్ స్టిఫ్టుంగ్ అనే సేవా సంస్థకు అప్పగించారు. 1983లో మార్క్స్ శతవర్ధంతి సందర్భంగానూ, 2005లోనూ ఈ మ్యూజియం కొన్ని నెలలు మూసివేసి పునర్నిర్మాణం, పునర్నవీకరణ పనులు చేపట్టారు. ప్రస్తుతం ద్విశత జయంతి సందర్భంగా 2017 సెప్టెంబర్‌లో మూసివేసి, కొత్త ప్రదర్శన ఏర్పాటు చేసి, ఈ మే 5న ప్రారంభించారు. గత పునర్నవీకరణల నాటి నుంచీ కూడ ఈ ప్రదర్శనలో కేవలం మార్క్స్ జీవితం, కృషి విభాగాలు మాత్రమే కాక ప్రపంచం మీద మార్క్స్ ప్రభావం అనే విభాగాన్ని కలిపారు.

అసలు ఆ భవనంలో అడుగు పెడుతున్నప్పుడే శిశువుగా, బాలుడిగా, కౌమారదశలో మార్క్స్ ఈ గదుల్లో, ఈ నేల మీద, ఈ గోడలు పట్టుకుని అంబాడి, లేచి నిలబడి, తిరుగాడి, తోబుట్టువులతో, స్నేహితులతో ఆటలు ఆడుకుని, ఇక్కడి గాలి పీల్చి, ఈ గాలిలోకి మాటలు వదిలి ఉంటాడు గదా అని ఉద్విగ్నతకు లోనయ్యాను. రోమాలు నిక్కబొడుచుకున్నాయి. కళ్లు చెమ్మగిల్లాయి.

ఆ మూడంతస్తుల భవనంలో ప్రతి గదినీ చాల శ్రద్ధగా, ప్రేమతో, గౌరవంతో అలంకరించారు. ఫోటోలు, చిత్రాలు,

వస్తువులు, పుస్తకాలు, పాత పత్రికలు జాగ్రత్తగా గాజు అద్దాల్లో ప్రదర్శనకు పెట్టడం మాత్రమే కాదు, ప్రతి ప్రదర్శన వస్తువు పక్కనా అందమైన చేతిరాతతో, మార్క్స్ పట్ల గౌరవం, మార్క్సిజం భవిష్యత్తు పట్ల ఆశ కలిగించే పద్ధతిలో వ్యాఖ్యలు రాసి పెట్టారు. ఇక్కడ కూడ మార్క్స్, ఎంగెల్స్‌ల చేతిరాతలు, లేఖలు, వారి అచ్చయిన పుస్తకాల తొలి ప్రచురణ ప్రతులు, మార్క్స్ వాడుకున్న వస్తువులు, వివిధ చిత్ర రూపాలలో మార్క్స్ బొమ్మలు ప్రదర్శనకు పెట్టారు. మార్క్స్ జెన్నీని ఉద్దేశించి రాసిన కవిత ఆయన చేతిరాతలో ఉంది. కమ్యూనిస్టు ప్రణాళిక, లుడ్విగ్ ఫ్యూర్ బా – సాంప్రదాయిక జర్మన్ తత్వశాస్త్ర ముగింపు తొలి ప్రచురణ ప్రతులు, మార్క్స్ వ్యాసం అచ్చయిన న్యూయార్క్ డెయిలీ ట్రిబ్యూన్ 1853 జూన్ 25 ప్రతి, దాస్ కాపిటల్ తొలి ప్రచురణ ప్రతి వంటివెన్నో ఉన్నాయి. స్వయంగా మార్క్స్ ఉపయోగించిన, మార్క్స్ మార్జినల్ నోట్స్ రాసుకున్న ఆడమ్ స్మిత్ రాసిన వెల్త్ ఆఫ్ నేషన్స్ ప్రతి ఉంది. ఆ రోజుల్లో ఫోటోస్టాట్, స్కానింగ్ సౌకర్యాలు లేవు గనుక తాను చదివిన ఎందరో తనకంటే ముందరి రచయితల రచనల నుంచి మార్క్స్ వేలాది పేజీలు ఎత్తిరాసుకున్నాడు. వాటిని ఉటంకిస్తూ తన విశ్లేషణ సాగించాడు. అలా ఆడమ్‌స్మిత్ వెల్త్ ఆఫ్ నేషన్స్ నుంచి ఎత్తి రాసుకున్న పేజీ కూడ ఇక్కడ ఉంది. కమ్యూనిస్టు మానిఫెస్టోలో ఒక పేజీ మార్క్స్ చేతిరాతలో, దాని మీద జెన్నీ వ్యాఖ్యతో ఇక్కడ ఉంది.

ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వస్తువులు, వాటికి రాసి పెట్టిన వ్యాఖ్యలు కూడ చూసి తీరవలసినవి. ప్రారంభంలోనే 'అర్థం చేసుకోవడం, మార్చడం, విముక్తి చేయడం' అనే శీర్షికతో 'తన రచనల్లో కార్ల్ మార్క్స్ ప్రధాన దృష్టి స్వేచ్ఛ మీద ఉండేది. ఈ స్వేచ్ఛకు రెండు అర్థాలున్నాయి. ఒకటి, దోపిడీ నుంచీ, పీడన నుంచీ స్వేచ్ఛ. రెండు, ప్రతి మనిషీ తన సొంత అవసరాల, సామర్థ్యాల మేరకు జీవించే, పనిచేసే స్వేచ్ఛ అని రాసి పెట్టారు. మార్క్స్ జీవితకాలంలో ఎంతెంత కాలం ఏయే ఊళ్లో గడిపాడో తెలియజేయడానికి ఇరవైకి పైగా ఇసుక గడియారాలతో ఒక బల్ల తయారు చేశారు.

మార్క్స్ ఉపయోగించిన గడియారం (ఆ రోజుల్లో చేతి గడియారం పెద్దగా వాడకంలోకి రాలేదు. ఒక గొలుసుకు కట్టి నడుముకు పెట్టుకునే, చేతిలో పట్టుకునే గడియారాలుండేవి) పెట్టి, "కార్ల్ మార్క్స్ గడియారం. మార్క్స్ తన జీవితమంతా పనిచేస్తూనే గడిపాడు – అయినా ఆయన చేయదలచుకున్న పనులు పూర్తి చేయడానికి ఆయనకు ఎప్పుడూ సమయం సరిపోయేది కాదు' అని వ్యాఖ్య పెట్టారు. లండన్ ఇంట్లో మార్క్స్ ఎప్పుడూ కూచుని చదువుకునే, చివరికి మరణించిన కుర్చీ కూడ ఇక్కడ ఉంది. ఆ కుర్చీని కావలించుకుంటే కన్నీళ్లు ఆగలేదు.

మార్క్స్ ప్రభావం గురించి కూడ ఈ ప్రదర్శనలో సవివరంగా మూడు నాలుగు గదుల్లో చిత్రించారు. మార్క్స్ మరణం తర్వాత 1939 వరకూ జరిగిన పరిణామాలు, బోల్షివిక్ విప్లవం, యూరప్‌లో బలపడిన సోషల్ డెమొక్రటిక్ పార్టీల చరిత్ర వంటివి ఈ విభాగంలో ఉన్నాయి. తర్వాతి విభాగం 1939 నుంచి ప్రపంచీకరణ వరకు, ఆ తర్వాతి విభాగం ప్రపంచీకరణ యుగంలో మార్క్సిజం ప్రభావం గురించి వివరించాయి.

మార్క్సిజాలు, లెనినిజాలు, స్టాలినిజాలు, గువేరాయిజాలు, మావోయిజాలు, ట్రాట్స్కీయిజాలు, పోస్ట్ మార్క్సిజాలు, ఆస్ట్రో మార్క్సిజాలు, టిటోయిజాలు, లిబరేషన్ థియాలజీ, క్రిటికల్ థియరీ, డెమొక్రటిక్ సోషలిజం వంటివన్నీ మార్క్స్ ఆలోచనాధార నుంచి వికసించినవేనని ఒక చిత్రం గీసి పెట్టారు. "మార్క్సిజం ఒక మూసుకుపోయిన సిద్ధాంతం కాదు' అనే శీర్షికతో "పందొమ్మిదో శతాబ్ది చివరి రోజుల నుంచీ సోషలిస్టులు, సోషల్ డెమొక్రట్లు కార్ల్ మార్క్స్ విశ్లేషణలకు తమ వ్యాఖ్యానాలను 'మార్క్సిజం' అనే పేరుతో పిలుస్తున్నారు. సమాజం మీద, పెట్టుబడిదారీ విధానం మీద ఆయన సాగించిన విమర్శ ఈ పేరుతోనే విశేష ప్రాచుర్యంలోకి వచ్చింది. ఆ కాలంలో యూరప్‌లోని ఎన్నో లేబర్ పార్టీలు తమను తాము మార్క్సిస్టుగానే భావించుకునేవి. కాని ఈ మాట మార్క్స్ తన మరణానంతరం ఏదో ఒక మూసుకుపోయిన సిద్ధాంతాన్ని మిగిల్చి వెళ్లిపోయాడేమోననే అపార్థానికి అవకాశం ఇస్తుంది. కాని కొన్ని ఎంపిక చేసిన మార్క్సిజాలను గనుక పరిశీలిస్తే, అది వాస్తవం కాదని తెలుస్తుంది. అందుకు భిన్నంగా పెట్టుబడిదారీ విధానం మీద మార్క్స్ చేసిన విమర్శ, విశ్లేషణ సమగ్రమైనవే గాని అసంపూర్ణమైనవీ, అక్కడక్కడ పొసగనివీ కూడ. అలాగే ఆయన రచనల్లో చాల భాగం చాల కాలం వరకూ ప్రచురణ కాలేదు గనుక, వేరు వేరు వ్యక్తులు, పార్టీలు, ఉద్యమాలు ఆ ఖాళీలను పూరించడానికి ప్రయత్నించారు. ఆ ప్రయత్నంలో భాగంగా వాళ్లు కొత్త మార్క్సిజాలను తయారు చేశారు. వాటిలో చాల భాగం సారాంశంలో ఒకదానితో ఒకటి సంబంధంలో ఉంటాయి. కొన్ని మాత్రం వేరే వాటితో స్పష్టంగా వేరు చేసుకుంటాయి. అయినా మిగిలిపోయే ప్రశ్న : వాటిలో ప్రతి ఒక్కదానిలో ఎంత మార్క్స్ ఉన్నాడు అనేదే" అని రాసి పెట్టారు.

ఒక చోట గోడ మీద పెద్ద ఎర్ర కాన్వాస్ గుడ్డ మీద నలుపు రంగులో వందలాది గీతలు ఉంటాయి. దగ్గరికి వెళ్లి చూస్తే ఆ

గీతలన్నీ ప్రపంచ ప్రసిద్ధులైన వారి పేర్లు, వివరాలు. ఆ పేర్ల మధ్య నుంచే ముదురు నలుపులో మార్క్స్ ముఖచిత్రమూ కనబడుతుంది. దగ్గరికి వెళ్ళి ఆ పేర్లు చదివితే ఇరవయ్యో శతాబ్ది తత్వవేత్తలు, శాస్త్రజ్ఞులు, రచయితలు, కళాకారుల పేర్లు కనబడతాయి. "ఇరవయ్యో శతాబ్దిలో తత్వవేత్తలు, శాస్త్రజ్ఞులు, రచయితలు, కళాకారులు వంటి అసంఖ్యాకమైన మేధావులెందరో మార్క్సిస్టు భావాలతో ప్రభావితమయ్యారు. తమ జీవితాలలో కొద్దికాలం వరకు గాని, జీవితాంతం గాని ఆ భావాలతో ఉన్నారు" అని రాసిపెట్టారు.

ఒక చోట "మరణించాడని ప్రకటించారా లేక ఇంకా సజీవుడేనా? ఇంకా ఎంతకాలం ఉంటాడు" అనే శీర్షికతో "మార్క్స్ సామాజిక శాస్త్రాలలో, పరిశోధనలో జీవించే ఉంటాడు. మార్క్స్ మీద మేధోపూర్వక వ్యాఖ్యానాలు కొనసాగుతూనే ఉంటాయి" అని రాశాడు.

చిట్టచివరికి, వాట్ ఈజ్ లెఫ్ట్ (మిగిలిందేమిటి) అనే శీర్షికతో "2007లో అమెరికాలో గృహరుణాల బుడగ పేలిపోయింది. రుణగ్రహీతలు తమ ఇళ్ల తనఖా రుణాలను చెల్లించలేకపోయారు గనుక, ఈ గృహరుణాల ఖాతాల విలువలు అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లలో కుప్పకూలిపోయాయి. అంతర్జాతీయ బ్యాంకు, ద్రవ్య వ్యవస్థ సంక్షోభంలో పడింది. అమెరికాలోని లేమాన్ బ్రదర్స్‌తో సహా పెద్ద బ్యాంకులు పేకమేడల్లా కూలిపోయాయి. వారిని ఆదుకోవడానికి ప్రభుత్వాలు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ సంక్షోభం ద్రవ్యేతర రంగానికి కూడ వ్యాపించింది. యూరప్‌లో గ్రీస్ వంటి దేశాలు దివాళా ఎత్తే అంచుల వరకూ చేరాయి. అంతర్జాతీయ పెట్టుబడిదారీ విధానం ఉపయోగకరమైనదనే ఊహాత్మక ఆశ ఈ కొత్త దెబ్బతో ధ్వంసమైపోయింది. యుద్ధాలు, ప్రజలను, పర్యావరణాన్ని దోపిడీ చేయడం, డిజిటలైజేషన్ ప్రతికూల ఫలితాలు సామాజిక రాజకీయ రంగాల విజయాలన్నిటినీ సవాలు చేస్తున్నాయని తేటతెల్లమైంది. ప్రపంచాన్ని సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా న్యాయబద్ధమైన సమాజంగా తీర్చిదిద్దే కార్యక్రమాలలో ప్రజలు ఇదివరకెన్నటికంటే ఎక్కువగా పాల్గొనడానికి ఈ సమస్యలు పురికొల్పాయి. కార్ల్ మార్క్స్ రాసిన కాపిటల్ అమ్మకాలు ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్నాయంటే ఆశ్చర్యమేమీ లేదు" అని ప్రదర్శన ముగుస్తుంది.

## మ్యూజియం ఆమ్ డోమ్

ఇక మరొక ఆసక్తికరమైన ప్రదర్శన ట్రియర్‌లోని చర్చి ఏర్పాటు చేసినది. హై కెథెడ్రల్ ఆఫ్ సేంట్ పీటర్ అనీ, ట్రియర్ కెథెడ్రల్ అనీ పిలిచే ఈ చర్చి పాతరూపంలో మూడో శతాబ్ది నుంచీ ఉందనీ, ప్రస్తుత రూపంలోని భవనం 1270 నుంచీ ఉందని చరిత్ర చెపుతున్నది. జర్మన్‌లో సాధారణంగా కెథెడ్రల్‌ను డోమ్ అంటారు. ఈ డోమ్‌కు అనుబంధంగా 1904 నుంచీ ఒక మ్యూజియం ఉంది.

ఇది మామూలుగా క్రైస్తవ మ్యూజియమే గాని, మార్క్స్ ద్విశత జయంతి సందర్భంగా మార్క్స్ శ్రమ గురించి రచించాడు. విశ్లేషించాడు గనుక శ్రామిక జీవితానికీ, మానవ గౌరవానికీ మధ్య ఘర్షణను అన్వేషించే ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఈ మ్యూజియం నిర్వాహకులు తలపెట్టారు. 'లీబెన్స్ వెర్ట్ ఆర్బైట్' (సార్థకమైన శ్రమ) అనే శీర్షిక కింద ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన శ్రమను గౌరవించే, శ్రమ సౌందర్యాన్ని, నైపుణ్యాన్ని, సార్థకతనూ ప్రేమించే వారందరూ తప్పనిసరిగా చూడవలసినది. కళ, ఊహ, శారీరక శ్రమ, యాంత్రిక శ్రమ, మరమనుషుల శ్రమ వంటి అనేక రంగాలలో జరుగుతున్న సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలతో ఈ ప్రదర్శన తయారయింది. చేనేత, అల్లకం, కుట్టు, కుండల తయారీ, లోహ సామాగ్రి తయారీ, భవన నిర్మాణం వంటి లెక్కలేనన్ని శ్రమ రూపాలు ఇక్కడ ఆరు హాళ్లలో ఆరు ఉపశీర్షికల కింద, ఆరు కీలకమైన ప్రశ్నలతో సాగాయి.

క్రైస్తవ సామాజిక నీతి, ప్రస్తుత పనిస్థలం – భవిష్యత్తు పని స్థలం, శ్రమ ఇతివృత్తంలో వైతాళిక అన్వేషణలు, కళా పథకాల సహకారం, ఆటర్స్‌బర్గ్ యూనివర్శిటీ కళాపథకం, ప్రపంచీకరణలో శ్రామిక ప్రపంచపు ప్రభావాలు అనే ఉపశీర్షికల కింద ఆరు హాళ్లలో ఎన్నెన్నో శ్రమైన జీవన సౌందర్యపు చిహ్నాలను ప్రదర్శించారు. ప్రతి హాలులోనూ ఒక ఆలోచనా స్ఫోరకమైన ప్రశ్న వేశారు. "నేను ప్రతిదీ చేయగలనా, చేయవచ్చా?", "నేను శ్రమిస్తున్నప్పుడు నా ఆత్మ ఏం చేస్తుంటుంది?" "ప్రతిదీ ఇంతగా చెడిపోయిందేనా?" "నేను మరొకరిని అయి ఉండగలనా?", "ఎప్పటికైనా సంతోషం నన్ను చేరుతుందా?" "ఒక రోజంతా కష్టభరితమైన శ్రమ తర్వాత కడుపు నిండా గంజి అడగడమే అపరాధమా?" అనేవి ఆ ప్రశ్నలు.

ఇంకా మరొక మ్యూజియం కూడ చూడవలసే ఉండింది గాని ఆ మ్యూజియం మూసివేసే సమయం కావడంతో, అప్పటికే రోజంతా తిరిగిన అలసటతో, అపారమైన అనుభవాల, అనుభూతుల, ఉద్వేగాల జడివానలో తడిసి ముద్దై వెనక్కి తిరిగాం. మరొకచోట రాసినట్టు జీవితం సార్థకమైందని అనిపించిన రోజు ఇది. ❑

RNI Regn No. 52879/93

*With best compliments from*

☎ 0866 2436959
94919 62759

**S.R. BOOK LINKS**

31-13-18, Danaiah Street, Machavaram
**VIJAYAWADA - 520 004**

❖

D.R. Rao ✆ 98491 81712

**S.R. PUBLISHERS**

#11-8-31, Jagannadham Street
**VIJAYAWADA - 520 001**

- *Student's Manuals*
- *Question Banks*
- *Rank Gainers*
- *Work Books*
- *Dictionaries*

email : sriraghavendrapublishers@hotmail.com

Phones : 0866 2560312, 2568312, 2560542

Fax : 0866 2568612

**JAATEEYA SPURTHI,** Fortnightly Printed and **Published by N. Venkateswara Rao**
at Godavari Printers, R.R.Pet, ELURU - 534 002. ✆ 9848 234228 **Chief Editor : DVVS Varma**